

శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



మోదీ అండదండలతో విశ్వాస ద్రోహం

ఢిల్లీలో కాకుండా మరెక్కడ చేయాలి?

'ఉపా' కేసులో ముగ్గురి అరెస్టు..

07



సంపుటి 09, సంచిక: 223 | సోమవారం | 13-07-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




# ఏడిపిస్తున్న ఎల్‌నినో

## ముందుకు సాగని వ్యవసాయం

- 26 జిల్లాల్లో లోటు వర్షపాతం
- నాలుగు నెలల వర్షాకాలంలో నలభై రోజులు వృథా
- జూన్ చివరి నాటికి 14.78 లక్షల ఎకరాల్లోనే సాగు
- వట్టిపోయిన సాగునీటి ప్రాజెక్టులు
- పాతాళానికి భూగర్భ జలాలు
- తీవ్ర సంక్షోభంలో ఖరీఫ్ సాగు
- వర్షాలు లేక బిక్కు బిక్కుమంటున్న రైతాంగం
- పశువుల మేతకు తీవ్ర కటకట

ప్రజాపక్షం/హైదరాబాద్/ ఖమ్మం

రాష్ట్రంలో వ్యవసాయ రంగంపై సూపర్ ఎల్‌నినో ప్రభావం చాలా తీవ్రంగా కనిపిస్తోంది. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రభావం వల్ల నైరుతి రుతుపవనాలు బలహీనపడి, రాష్ట్రం లో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఖరీఫ్ సాగు తీవ్ర సంక్షోభంలో పడింది. వానాకాలం ప్రారంభమై దాదాపు 40 రోజులు గడిచినా రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో పంటలు వేసేందుకు రైతులు జంకుతున్నారు. ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో జూన్ నెలలో సాధారణం కంటే 22 శాతం తక్కువ వర్షపాతంనమోదు కాగా, జులై రెండో వారం నాటికి రాష్ట్ర సగటు వర్షపాత లోటు 13 శాతం నుండి 16.5 శాతం వరకు నమోదైంది. సాధారణంగా ఈ సమయానికి 177.9 మి.మీ. కురవాల్సి ఉండగా, కేవలం 154.9 మి.మీ మాత్రమే నమోదు కావడంతో పంటలసాగుపై తీవ్ర ప్రభావం చూపింది. ఎల్‌నినో సృష్టించిన వర్షపాత లోటు రాష్ట్రంలో స్పష్టంగా కనిపిస్తోంది. దాదాపు 17 నుండి 26 జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ (లోటు) వర్షపాతం నమోదైంది. వాతావరణ కేంద్రం వివరాల ప్రకారం ఉమ్మడి మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, మెదక్ జిల్లాల్లోని పలు మండలాలు తీవ్ర వర్షాభావాన్ని ఎదుర్కొంటున్నాయి. కొన్ని దక్షిణ, పశ్చిమ జిల్లాల్లో ఈ లోటు మరింత ఎక్కువగా ఉంది. మొత్తం 1.32 కోట్ల ఎకరాల సాగు భూమి ఉండగా వర్షపాత లోటు కారణంగా రాష్ట్రంలో జులై మొదటి వారం ముగిసేసరికి కేవలం 14.78 లక్షల (11.2 శాతం) ఎకరాల్లోనే సాగు పనులు ప్రారంభమయ్యాయి. ఈ సమయానికి గత ఏడాదితో పోలిస్తే ఇది దాదాపు సగానికి పైగా తక్కువ ఉంది. రాష్ట్రంలో వరి సాధారణ సాగు విస్తీర్ణ లక్ష్యం దాదాపు 65.97 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 4.22

తరువాయి 8లో



ఒమన్ తీరం వద్ద

# వాణిజ్య నౌకపై ఇరాన్ దాడి

## భారతీయుడు గల్లంతు : పది మంది సురక్షితం

- ఇరాన్ క్షిపణి, డ్రోన్ స్థావరాలు సహా 140 లక్ష్యాలపై సెంట్‌కామ్ దాడులు
- సర్వత్రా క్షిపణి హెచ్చరిక మోతలు
- ఎనిమిది ఇరాన్ నగరాల్లో పేలుళ్ళు
- గల్ఫ్ అరబ్ దేశాలపై విరుచుకుపడిన ఇరాన్
- మేం మళ్ళీ చెప్పేవరకూ హోర్ముజ్ తెరుచుకోదు : ఐఆర్‌జిసి

**దుబాయ్:** అమెరికా–ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో సైప్రస్ జెండాతో వెళుతున్న మరో భారత సిబ్బంది వాణిజ్య నౌక ఎం/వి జిఎఫ్‌ఎస్ గెలాక్సీపై దాడి జరిగింది. ఒమన్‌కు తూర్పుతీరంలో ఉన్న జలాల్లో దాడికి గురైన నౌక నుండి పదిమంది నావికులు,పౌరులు సురక్షితంగా లైఫ్‌బోటులోకి వెళ్ళారు. ఐతే ఒక భారతీయుడి జాడ తెలియడంలేదు. అతడికోసం తీవ్రంగా గాలిస్తున్నారు. హోర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ఐఆర్‌జిసి ప్రకటించింది. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకూ హోర్ముజ్ జలసంధి తెరుచుకోదని స్పష్టం చేస్తూ హెచ్చరిక కాల్పులు జరిపిన కొద్ది గంటలకే అమెరికా దాడులు ప్రారంభమయ్యాయి. హోర్ముజ్‌లో ప్రధాన జలమార్గంలో వెళుతున్న వాణిజ్య నౌకపై దాడి చేసినందుకే తాము దాడులు చేశామని సెంట్‌కామ్ ప్రకటించింది. ఈ నౌక సైప్రస్ జెండాతో వెళుతోందని పేర్కొంది. ఈ నౌకపై ఇరాన్ దాడులు చేసిందని అమెరికా సైన్యం సెంట్‌కామ్ వర్గాలు ప్రకటించాయి. దీంతో అమెరికా తన మూడో విడత దాడులకు భారత్ సిబ్బంది ఉన్న నౌకనే కారణంగా చూపించినట్లయింది. సైప్రస్ జెండాతో వెళుతున్న ఈ నౌకలో 11 మంది భారతీయులు ఉన్నారని విదేశీమంత్రిత్వశాఖ ప్రకటించింది. ఈ ప్రాంతంలో దాడులు తీవ్ర ఆందోళన కలిగించే విషయమని పేర్కొంది. ఈ ప్రాంతంలో నావికులకు రక్షణ ఉండాలని, వాణిజ్య నౌకలు,పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని దాడులు ముగిసిపోవాలని కూడా డిమాండ్ చేసింది. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో స్వేచ్ఛాయుత, నిరాటంక నౌకారాకపోకలను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని కోరింది. కాగా, భారత వాణిజ్యనౌక జిఎఫ్‌ఎస్ గెలాక్సీ ఇంజిన్ రూమ్‌పై ఇరాన్

తరువాయి 8లో

## భారత్ ఖండన

దాడులు ఆపి సురక్షిత నౌకాయానానికి భరోసా ఇవ్వాలి : విదేశీమంత్రిత్వశాఖ డిమాండ్

**న్యూఢిల్లీ:** ఒమన్ తీరంలో సైప్రస్ జెండాతో వెళుతున్న వాణిజ్య నౌకపై జరిగిన దాడిని భారతదేశం తీవ్రంగా ఖండించింది. ఈ నౌకలో 11 మంది భారత సిబ్బంది, పౌరులు ఉన్నారని, వీరిలో ఒకరు గల్లంతయ్యారని ఆందోళన వ్యక్తం చేసింది. గల్లంతైన నావికుడికోసం తీవ్రంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, ఈ పరిస్థితులను ఎప్పటికప్పుడు భారత్ కనిపెట్టుకుని పర్యవేక్షిస్తోందని భారత విదేశీమంత్రిత్వశాఖ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. పదిమంది భారతీయ సిబ్బంది,పౌరులు మాత్రం సురక్షితంగా లైఫ్‌బోటులోకి ఎక్కారని వారు క్షేమంగా ఉన్నారని కూడా ప్రకటించింది. హోర్ముజ్ జలసంధిలో పదే పదే నావికులపై దాడులు జరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పేర్కొంది. పశ్చిమాసియాలోని హోర్ముజ్ జలసంధిలో అమెరికా–ఇరాన్ మధ్య మరోసారి యుద్ధ పరిస్థితులు చెలరేగుతున్న తరుణంలో ఈ ఉద్రిక్తతలను తక్షణం తొలగించాలని భారత్ డిమాండ్ చేసింది. హోర్ముజ్

తరువాయి 8లో



## తల్లిదండ్రుల 'సర్' వివరాలు తప్పనిసరి

కొత్త అభ్యర్థుల ధరఖాస్తులపై ఇసి సూచనలు

**అయోధ్య :** గతంలో జరిగిన ఓటరు ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)లో చేర్చబడని ప్రస్తుత ఓటర్లు మాత్రమే కాకుండా, ఓటర్ల జాబితాలో చేరడానికి దరఖాస్తు చేసుకునే కొత్త అభ్యర్థులు కూడా తమ తల్లిదండ్రుల సర్ వివరాలను సమర్పించాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం (ఇసి) అధికారులు తెలిపారు. ఎన్నికల జాబితాలో చేరడం కోసం ఫారం 6 నింపే కొత్త ఓటర్లు తమ తల్లిదండ్రుల 'సర్' వివరాలను జతచేయడాన్ని తప్పనిసరి చేస్తూ ఎన్నికల సంఘం (ఇసి)

తరువాయి 12లో



## క్షీణిస్తున్న సోనమ్ ఆరోగ్యం

- తగ్గుతున్న రక్తపోటు
- 7.8 కిలోలు తగ్గిన వాంగ్‌చుక్
- 15 రోజులుగా కొనసాగుతున్న నిరవదిక నిరాహార దీక్ష

**న్యూఢిల్లీ :** పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష 15వ రోజుకు చేరుకోగా, ఆదివారం ఆయన ఆరోగ్యం మరింత క్షీణించింది. రక్తపోటు తగ్గడంతో పాటు, దీక్ష ప్రారంభమైనప్పటి నుండి మొత్తం 7.8 కిలోల బరువు తగ్గినట్లు వైద్యులు తెలిపారు. పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) చేపట్టిన నిరసన ఆదివారంతో 23వ రోజుకు చేరుకుంది. ఆ సంస్థ అందించిన ఆరోగ్య సమాచారం ప్రకారం... వాంగ్‌చుక్ రక్తపోటు 104/66 ఎంఎం హెచ్‌జికి పడిపోయింది, అలాగే దీక్ష మొదలైనప్పటి నుండి ఆయన బరువు మొత్తం 7.8 కిలోలు తగ్గింది. అంతేకాకుండా, ఈ ఉద్యమానికి సంఘీభావం తెలిపేందుకు పలువురు రాజకీయ నాయకులు, మేధావులు నిరసన స్థలాన్ని సందర్శించినట్లు

తరువాయి 8లో



## 'బొగత' పరవళ్లు సందర్శకుల సందడి

- జలపాతం వద్ద కిక్కిరిసిన పర్యాటకులు

ప్రజాపక్షం/వాజేడు

ములుగు జిల్లా వాజేడు మండలంలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న ప్రముఖ పర్యాటక కేంద్రం బొగత జలపాతం సందర్శకులతో కిక్కిరిసిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలతో జలపాతంలో నీటి ప్రవాహం పెరగడంతో ప్రకృతి అందాలను తిలకించేందుకు వరంగల్, ఖమ్మం,

తరువాయి 12లో



# జల జగడాలొద్దు

- రైతులకు సాగు నీరివ్వాలి
- నీచ రాజకీయాలు, బూతు పురాణం సరికాదు
- బిఆర్‌ఎస్, కాంగ్రెస్ వ్యాఖ్యల తీరును ఖండిస్తున్నాం
- పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/వనపర్తి టౌన్

రాష్ట్రంలో రాజకీయ జగడాలు మాని సాగు జలాలను అందించేందుకు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సిపిఐ శాసనసభ పక్ష నేత కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఆదివారం వనపర్తి ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సిపిఐ ఉమ్మడి జిల్లా మూడు రోజుల రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు సమావేశానికి కూనంనేని అతిథిగా హాజరై మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కన్నెంపల్లి రిజర్వాయర్ నింపి నీళ్లు ఇవ్వాలని హరీష్ రావు, కెటిఆర్, నింపితే తెగి కొట్టుకుపోయి నష్టం జరుగుతుందని సిఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని దీనిపై నీచ రాజకీయాలు, బూతు పురాణం సరికాదని, సంయమనం పాటించాలని సూచించారు. బిఆర్‌ఎస్ కాంగ్రెస్ వ్యాఖ్యలను తీరును సిపిఐ ఖండిస్తోందన్నారు. మూడేళ్ల క్రితం కాళేశ్వరం ఫిల్లర్లు కుంగుబాటుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ పరిశీలించి సిడబ్ల్యుసికి నివేదిక పంపినా ఇంతవరకు సిడబ్ల్యుసి తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. కాళేశ్వ రం విషయంలో రాజకీయ నిర్ణయాలు సరికాదని సిడబ్ల్యుసి నివేదిక ప్రకారం ముందుకు వెళ్లాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించిన కేంద్రం తెలంగాణ ఏ ప్రాజెక్టుకు ఇంతవరకు జాతీయ హోదా ఇవ్వలేదని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని డిమాండు చేశారు. ఆంధ్రకు పోలవరానికి జాతీయ హోదా కల్పిస్తేనే పాలమూరు జిల్లాతో పాటు రంగారెడ్డి నల్గొండ జిల్లాలకు సాగునీరు అందుతుందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జూరాల, కెఎల్‌ఐ, నెట్టెంపాడు, బీమా కోయిల్‌సాగర్, తదితర ప్రాజెక్టులు పెండింగ్‌లోనే ఉన్నాయని ఐదు, ఆరు లక్షల కోట్లు ఖర్చు పెడితే ప్రాజెక్టులు పూర్తి అవుతాయని ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. భారత గడ్డపై సిపిఐకి వందేళ్లు దాటిందని ప్రజల పక్షాన నిటారుగా నిలబడి రాజీలేని పోరాటం చేస్తోందని, సమరశీల పోరాటాల ద్వారా ఎర్రజెండా మరింత ఎరుపెక్కిందన్నారు. కమ్యూనిస్టు పార్టీపై కారుకూతలు కూసేవారు ఒక్కరోజైనా కమ్యూనిస్టుగా బతికితే దాని

తరువాయి 12లో

# 22 కొత్త రేడియల్ రోడ్లు

- హెచ్ఎండిఎ మాస్టర్ ప్లాన్ - 2031లో ప్రతిపాదనలు
- 24 నుంచి 60 మీటర్ల వెడల్పుతో అభివృద్ధికి ప్రణాళిక
- హైదరాబాద్ శివారు ప్రాంతాలకు వేగవంతమైన అనుసంధానమే లక్ష్యం



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మహానగర భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుని హెచ్ఎండిఏ మాస్టర్‌ప్లాన్ –2031లో 22 రేడియల్ రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. 'ఫ్యూచర్ సిటీ' విజన్‌కు అనుగుణంగా, మాస్టర్ ప్లాన్2031 పరిధిలో 22 కీలక రోడ్ల అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), కోర్ సిటీ, అభివృద్ధి చెందుతున్న ఐటి, ఇండస్ట్రియల్ కారిడార్లను కలుపుతూ 22 ప్రధాన రహదారులను విస్తరించాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఇరుకు గా మారి, బాటిల్‌నెక్‌గా పరిణమించిన ఈ 22 మార్గాలను ట్రాఫిక్ సాంద్రతను బట్టి 24,30,45,60 మీటర్ల వెడల్పుతో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నారు. హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న

తరువాయి 8లో

## 'తెలంగాణ రక్షణ సేన'కు గుర్తింపు ఇవ్వండి..

- ఆ అభ్యంతరాలు మాకు ఇవ్వండి...
- కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్

'తెలంగాణ రక్షణ సేన' అనే పేరుతో దేశంలో ఏ ఇతర రాజకీయ పార్టీ కూడా నమోదు కాలేదని, ఇది ఏ గుర్తింపు పొందిన లేదా నమోదైన రాజకీయ పార్టీ పేరును పోలిలేదని, అందుకే తమ పార్టీకి (తెలంగాణ రక్షణ సేన ) గుర్తింపు ఇవ్వాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 29ఎ కింద ప్రతిపాదిత 'తెలంగాణ రక్షణ సేన' పార్టీ గుర్తింపు కోసం తాము చేసుకున్న దరఖాస్తును పరిశీలించి, ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. ఒక్క

తరువాయి 12లో



## 'ఆరోగ్యశ్రీ'పై అసహనం

- నిర్మల్ జిల్లాలో అమలు తీరుపై సర్వత్రా విమర్శలు
- ప్రభుత్వ పథకాన్ని తప్పుదోవ పట్టిస్తున్న ప్రైవేట్ వైద్యశాలలు
- రోగుల నుంచి అదనంగా వసూళ్లు

ప్రజాపక్షం/నిర్మల్

ప్రభుత్వం నిరుపేదలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిధిని విస్తరించి, ఆర్థిక పరిమితిని పది లక్షల రూపాయలకు పెంచింది. అయితే నిర్మల్ జిల్లాలో ఈ పథకం అమలు తీరుపై ప్రజల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వ ఉద్దేశాలు ఎంత గొప్పగా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలులో ఉన్న లోపాలు పథకం ప్రయోజనాలను పూర్తిగా ప్రజలకు చేరకుండా చేస్తున్నాయని బాధితులు వాపోతున్నారు. కేంద్రంతో పాటు భైంసా, ఖానాపూర్ తదితర ప్రాంతాల్లోని కొన్ని ప్రైవేట్ వైద్యశాలలు ఆరోగ్యశ్రీ పథకాన్ని ఆదాయ మార్గంగా మార్చుకున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉచితంగా అందించాల్సిన చికిత్సలు, శస్త్రచికిత్సలు, ఇతర వైద్య సేవల కోసం రోగుల కుటుంబాల నుంచి అదనపు మొత్తాలను వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు పెరుగుతున్నాయి. పడకల వినియోగ రుసుము, శస్త్రచికిత్స గది నిర్వహణ వ్యయం, ప్రత్యేక పరీక్షల ఖర్చులు వంటి పేర్లతో వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నట్లు బాధితులు

తరువాయి 12లో

# కాలంతో పాటు మారేదే సాహిత్యం

సరిగ్గా ఏడాది క్రితం ప్రఖ్యాత కవి, రచయిత, విమర్శకుడు, సాహిత్య చరిత్రకారుడు, పరిశోధకుడు, నవచేతన పబ్లికేషన్స్ సంపాదకులు ఏటుకూరి ప్రసాద్ గారితో జరిపిన 'ముఖాముఖి'. వివిధ కారణాల నేపథ్యంలో, ప్రచురించలేకపోయిన ఇంటర్వ్యూ, ఇప్పుడు ఏటుకూరి గారి అకాల మృతికి సంతాపంప్రకటిస్తూ, 19వ తేదీన ఆయన 'జయంతి' సందర్భంగా ప్రచురించడం సముచితం.. సందర్భోచితం.

**ప్రశ్న: 'ముఖాముఖి'కి అవకాశం ఇచ్చినందుకు, ముందుగా మీకు ధన్యవాదాలు. ఈ సంభాషణను ఒక ప్రాథమిక ప్రశ్నతో ప్రారంభిద్దాం. సాహిత్యం అంటే ఏమిటి? అది కాలానుగుణంగా ఎందుకు మారుతూ ఉంటుంది?**

**ఏటుకూరి:** ధన్యవాదాలు. సాహిత్యం అనేది కేవలం పదాల సమాహారం కాదు. అది ఒక నాగరికతకు సంబంధించిన సామూహిక స్మృతి. మనిషి అనుభవించిన జీవితం, అతని కలలు, భయాలు, విశ్వాసాలు, పోరాటాలు, ఆశలు, నిరాశలు, విజయాలు, వైఫల్యాలు కలగలిసిన జీవన ప్రవాహమే సాహిత్యం. అందుకే అది ఎప్పుడూ స్థిరంగా ఉండదు. సమాజం మారితే సాహిత్యం మారుతుంది. విలువలు మారినప్పుడు కూడా సాహిత్యం కొత్త రూపాన్ని సంతరించుకుంటుంది. ఒకప్పుడు మనిషి ప్రకృతి శక్తుల ముందు నిస్సహాయుడు. వర్షం ఎందుకు కురుస్తుంది? పిడుగు ఎందుకు పడుతుంది? వంటి అత్యంత సాధారణ ప్రశ్నలకు కూడా అతని వద్ద శాస్త్రీయ సమాధానాలు లేవు. అలాంటి సమయంలో పురాణాలు, ఇతిహాసాలు, దైవకథలు జన్మించాయి. అదే కాలంలో అవి ప్రజలకు జ్ఞానాన్ని, ధైర్యాన్ని, నీతిని అందించే సాధనాలుగా నిలిచాయి. తర్వాత రాజ్యాలు ఏర్పడ్డాయి. రాజుల ఆధిపత్యం పెరిగింది. యుద్ధాలు, విజయాలు, సామ్రాజ్యాల విస్తరణ సమాజ జీవితంలో ప్రధాన అంశాలయ్యాయి. ఆ ప్రభావం సాహిత్యంపై పడింది. అందుకే ప్రతి యుగానికి తనదైన సాహిత్యం ఉంటుంది. సాహిత్యం చరిత్రను అనుసరించదు. ఎందుకంటే, అది చరిత్రతో కలిసి ప్రయాణిస్తుంది.

**ప్రశ్న: అంటే, సాహిత్యం సమాజానికి అద్దం అని చెప్పడం సరైనది కాదా?**

**ఏటుకూరి:** అది సగం నిజం మాత్రమే. 'సాహిత్యం సమాజానికి అద్దం' అని మనం తరచూ వింటాం. కానీ అద్దం కేవలం ఉన్నదాన్ని మాత్రమే చూపిస్తుంది. సాహిత్యం అంతకంటే గొప్పది. అది దారి కూడా చూపించాలి. చీకటిలో మనిషి చేతిలో ఉండే దివిటీలా ఉండాలి. ఉదాహరణకు బానిసత్వం ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా సాధారణ వ్యవస్థ. ఆ కాలంలో కొంతమంది రచయితలు దానిని సమర్థించారు. కానీ మరికొందరు మానవ గౌరవాన్ని సమర్థిస్తూ రచనలు చేశారు. చరిత్రలో మార్పును తీసుకొచ్చింది ఎవరు? అద్దంలా చూసినవారా? లేక వెలుగులా మార్గం చూపినవారా? సమాధానం స్పష్టంగా కనిపిస్తున్నది. అందుకే, సాహిత్యం వాస్తవాన్ని చూపాలి.. అదే సమయంలో, అంగీకారంకాని వాస్తవాన్ని మార్చే శక్తినీ కలిగి ఉండాలి అంటాను.

**ప్రశ్న: రాజుల కాలంనాటి సాహిత్యంలో ప్రజల జీవితం కనిపించదనే విమర్శలు ఉన్నాయి. వాటిని ఎలా చూడాలి?**


**ఏటుకూరి:** ఆ విమర్శలో కొంత నిజం ఉంది. చాలా వరకూ ఆస్థాన సాహిత్యం రాజుల చుట్టూనే తిరిగింది. రైతు, కూలీ, మహిళ, శిల్పి, సాధారణ ప్రజల జీవితం అందులో తక్కువగా కనిపిస్తుంది. ఎందుకంటే రచయితల జీవితం కూడా రాజసభలకే పరిమితమైంది. అయితే, అదే కాలంలో ప్రజల నోటి మాటగా జానపద సాహిత్యం జీవించింది. జానపద గీతాలు, కథలు, సామెతలు, బుర్రకథలు, యక్షగానాలు, ఒగ్గుకథలు వంటి ప్రక్రియల్లో ప్రజల అసలు జీవితం కనిపిస్తుంది. అందుకే ఒక దేశ సాహిత్య చరిత్రను అర్థం చేసుకోవాలంటే కేవలం గ్రంథాలు మాత్రమేకాదు, జానపద సాహిత్యాన్ని కూడా సమానంగా అధ్యయనం చేయాలి.

**ప్రశ్న:సాహిత్యంలో ఊహాశక్తి పాత్ర ఎంత ముఖ్యమైనది?**

**ఏటుకూరి:** సాహిత్యం పూర్తిగా వాస్తవం మాత్రమే అయితే అది వార్త అవుతుంది. పూర్తిగా ఊహ మాత్రమే అయితే అది కల్పితం అవుతుంది. గొప్ప సాహిత్యం ఈ రెండింటి సమన్వయం. ఊహాశక్తి లేకపోతే కవి కొత్త ప్రపంచాన్ని సృష్టించలేడు. అదే వాస్తవం లేకపోతే ఆ ప్రపంచం పాఠకుడిని తాకదు. అందుకే గొప్ప రచయితలు వాస్తవాన్ని ఊహతో అందంగా తీర్చిదిద్దుతారు.రామాయణం, మహాభారతం, షేక్స్పియర్ నాటకాలు, రవీంద్రనాథ్ ఠాగూర్ రచనలు, ఇలా అన్నింటిలోనూ ఊహ ఉంది. కానీ ఆ ఊహ చివరకు మనిషి జీవితాన్నే ప్రతిబింబిస్తుంది.

**ప్రశ్న: నేటి యువ రచయితలు ప్రాచీన సాహిత్యాన్ని చదవాలా? లేక ఆధునిక సాహిత్యానికే పరిమితం కావాలా?**

**ఏటుకూరి:** ప్రాచీన సాహిత్యం చదవకుండా ఆధునిక సాహిత్యాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడం కష్టం. అలాగే



ఆధునిక సాహిత్యం చదవకుండా ప్రాచీన సాహిత్యాన్ని మాత్రమే చదివితే వర్తమానం అర్థం కాదు. ఒక చెట్టుకు వేర్లు ఎంత ముఖ్యమో, కొత్త కొమ్మలు కూడా అంతే ముఖ్యమైనవి. వేర్లను కోసేస్తే చెట్టు నిలబడదు. కొత్త కొమ్మలు రాకపోతే అది ఎదగదు. సాహిత్యానికి కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది.

**ప్రశ్న: ఇలాంటి సందర్భాలలో, సాహిత్యాన్ని ఎలా చూడాలంటారు?**

**ఏటుకూరి:** సాహిత్యం ఎప్పుడూ కాలంతో సంభాషిస్తుంది. కాలంతో మమేకమవుతుంది. అది నిన్నటి నుంచి ఈ రోజుకు, ఈరోజు నుంచి రేపటికి ప్రయాణించే సజీవ ప్రక్రియ. అందుకే సాహిత్యాన్ని మ్యూజియంలో పెట్టే వస్తువుగా కాకుండా, నిరంతరం పరిణామం చెందే సజీవ శక్తిగా చూడాలి.

**ప్రశ్న: సాహిత్యంలో కాల్పనికవాదం, రొమాంటిసిజం ఎలా ప్రవేశించాయి?**

**ఏటుకూరి:** పద్దెనిమిదో శతాబ్దం చివరి నుంచి యూరప్‌లో పారిశ్రామిక విప్లవం, శాస్త్రీయ ఆవిష్కరణలు, పట్టణీకరణ వేగంగా పెరిగాయి. యంత్రాలు మనిషి జీవితాన్ని మార్చేశాయి. అయితే ఆ మార్పుల్లో మనిషి ప్రకృతికి, భావోద్వేగాలకు దూరమవుతున్నాడనే భావన రచయితల్లో కలిగింది. దానికి ప్రతిస్పందనగా రొమాంటిసిజం లేదా కాల్పనికవాదం వచ్చింది. విలియం వర్డ్స్‌వర్త్, షెల్లీ, కీట్స్, బైరన్ వంటి కవులు ప్రకృతిని, ప్రేమను, స్వేచ్ఛను, వ్యక్తి అంతర్ముఖ ప్రపంచాన్ని కవిత్వంలో ప్రతిష్ఠించారు. మన తెలుగు సాహిత్యంలోనూ భావకవిత్వం, ప్రకృతి వర్ణనలు, ప్రేమ, వ్యక్తిగత అనుభూతులు ప్రధానంగా నిలిచిన కాలం ఉంది. కాల్పనికవాదం మనిషి హృదయాన్ని అందంగా ఆవిష్కరించింది. కానీ అది సమాజంలోని కఠిన వాస్తవాల నుంచి కొంత దూరంగా వెళ్లిందనే విమర్శ కూడా ఉంది.

**ప్రశ్న: ఈ కాల్పనికవాదం సాహిత్యానికి లోపమా? లేక అవసరమైన దశా?**

**ఏటుకూరి:** అది ఖచ్చితంగా అవసరమైన దశే. మనిషి కేవలం రొట్టెతో మాత్రమే జీవించడు. అతనికి కలలు కావాలి, సంగీతం కావాలి, ప్రేమ కావాలి, ప్రకృతి కావాలి. కాల్పనికవాదం మనిషి మనసును సుసంపన్నం చేసింది. అయితే సమాజంలో ఆకలి, దోపిడీ, అసమానతలు పెరిగినప్పుడు కేవలం పూలు, చంద్రుడు, ప్రేమ గురించి మాత్రమే రాస్తే అది అసంపూర్ణ సాహిత్యంగా మారుతుంది. అందుకే తరువాతి దశలో సాహిత్యం మళ్లీ మనిషి జీవిత వాస్తవాల వైపు తిరిగింది.

**ప్రశ్న:మానవతావాద సాహిత్యం ఎలా ఆవిర్భవించింది?**

**ఏటుకూరి:** ప్రపంచ యుద్ధాలు, వలస పాలన, పేదరికం, దోపిడీ వంటి అనుభవాలు సహజంగానే 'సాహిత్యం ఎవరి కోసం?' అనే ప్రశ్నను రచయితల ముందు ఉంచాయి. అప్పటి నుంచి సాధారణ మనిషే సాహిత్యానికి కేంద్రబిందువయ్యాడు. టాల్‌స్టాయ్, దోస్తోయెవ్‌స్కీ, చార్లెస్ డికెన్స్, మాక్సిమ్ గోర్కీ వంటి రచయితలు సమాజంలోని సామాన్యుల బాధలను ప్రపంచానికి పరిచయం చేశారు. తెలుగులో గురజాడ అప్పారావు దేశమం 'మట్టికాదోయ్, దేశమం మనుషులోయ్' అంటూ, మానవతావాద సాహిత్యానికి అత్యుత్తమ నిర్వచనమిచ్చారు. అక్కడి నుంచి మనిషే సాహిత్యానికి కొలమానంగా మారాడు. శ్రీశ్రీ వంటి వారు కార్మికులకు పట్టంగట్టి, శ్రామిక వాదాన్ని బలంగా వినిపించారు.

**ప్రశ్న: సాహిత్యం ఎప్పుడు ఈ విధమైన సామాజిక వాస్తవికత వైపు మళ్లింది?**

**ఏటుకూరి:** సమాజంలో అసమానతలు పెరిగినప్పుడు సాహిత్యం కూడా వాటిని ప్రశ్నించడం ప్రారంభించింది. రైతులు, కార్మికులు, కూలీలు, నిరుద్యోగులు, శ్రమజీవుల జీవితాలు సాహిత్యంలో ప్రధానాంశాలయ్యాయి. ఈ దశలో వాస్తవిక సాహిత్యం, అభ్యుదయ సాహిత్యం బలంగా ఎదిగాయి. తెలుగులో శ్రీశ్రీ, దాశరథి, కాళోజీ, ఆరుద్ర వంటి రచయితలు కవిత్వాన్ని ప్రజల జీవితాలకు దగ్గర చేశారు. ప్రపంచ సాహిత్యంలో పాబ్లో నెరుడా, బెర్టోల్ట్ బ్రెష్ట్ వంటి రచయితలు కూడా ఇదే దిశలో ప్రయాణించారు. సాహిత్యం వినోదం మాత్రమేగాక, సామాజిక చైతన్యానికి ఆయుధంగా కూడా మారింది.

**ప్రశ్న: వామపక్ష సాహిత్యాన్ని చాలా మంది రాజకీయ కోణంలోనే చూస్తారు. దానికి మీ సమాధానం ఏమిటి?**

**ఏటుకూరి:** వామపక్ష సాహిత్యాన్ని కేవలం రాజకీయ కోణంలో చూడడం సరైంది కాదు. దాని ప్రధాన ఆందోళన సామాజిక, ఆర్థిక అసమానత. ప్రపంచంలో సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతుంది. లక్షలాది మంది ఆకలి, నిరుద్యోగం, నిరాశ్రయత్వంతో జీవిస్తుం సాహిత్యం మౌనంగా ఉండకూడదు. కార్ల్ మార్క్స్ ఆలోచనలు ప్రపంచ సాహిత్యంపై గాఢమైన ప్రభావం చూపాయి. వర్గపోరాటం, శ్రమ విలువ, దోపిడీ వంటి అంశాలు అనేక రచనలకు ఆధారమయ్యాయి. మన దేశంలో అభ్యుదయ రచయితల ఉద్యమం కూడా ఈ భావజాలం ప్రభావంతోనే బలపడింది. నేటి ప్రపంచాన్ని చూడండి. సాంకేతికత అభివృద్ధి చెందుతోంది. కానీ, అదే సమయంలో ధనికులు మరింత ధనవంతులు, పేదలు మరింత పేదలుగా మారుతున్నారు. ఇలాంటి సమయంలో అసమానతలను ప్రశ్నించే సాహిత్యం అత్యంత అవసరం. వామపక్ష సాహిత్యం అం ద్వేషాన్ని ప్రచారం చేయడం కాదు; సమానత్వం, న్యాయం, మానవ గౌరవం కోసం నిలబడడం.

**ప్రశ్న: ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల జీవితం సాహిత్యంలోకి ఎలా వచ్చింది?**

**ఏటుకూరి:** ఎంతోకాలం సాహిత్యం పాలకుల గొంతుకగా ఉండేది. తర్వాత అది మధ్యతరగతి భావజాలాన్ని ప్రతిబింబించింది. కానీ సమాజంలో అత్యంత అణచివేతకు గురైన వర్గాల అనుభవాలు కనిపించలేదు. ఆ లోటును భర్తీ చేసినవే దళిత, బహుజన, ఆదివాసీ సాహిత్య ఉద్యమాలు. ఈ సాహిత్యం కేవలం బాధలను చెప్పడంతో ఆగలేదు. చరిత్రను మరో కోణంలో చదివించింది. శతాబ్దాలుగా అణచివేతకు, నిర్లక్ష్యానికి గురైన మనుషుల అనుభవాలను సాహిత్య కేంద్రంగా తీసుకొచ్చింది. దళిత సాహిత్యం వల్ల తెలుగు సాహిత్యంలో కొత్త భాష వచ్చింది, కొత్త ప్రతీకలు వచ్చాయి, కొత్త జీవితం ప్రవేశించింది.

**ప్రశ్న: కొందరు దళిత సాహిత్యం ఒక వర్గానికే పరిమితమని అంటుంటారు. మీ అభిప్రాయం?**

**ఏటుకూరి:** అది సరైన అవగాహన కాదు. దళిత సాహిత్యం ఒక వర్గం కోసం మాత్రమే కాదు. అసమానతను ప్రశ్నించే మానవతా సాహిత్యం. ఒక దళితుడి బాధను అర్థం చేసుకోవడమంటే, సమాజంలోని అన్యాయాన్ని అర్థం చేసుకోవడం. మంచి సాహిత్యానికి కులం ఉండదు. కానీ కులవ్యవస్థ వల్ల ఏర్పడిన బాధను మాత్రం అది నిర్లక్ష్యం చేయకూడదు. దళిత సాహిత్యం మన సమాజం దాచిపెట్టిన వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చింది. అదే దాని చారిత్రక ప్రాధాన్యం.

**ప్రశ్న: స్త్రీవాద సాహిత్యం గురించి మీరు ఏమంటారు?**

**ఏటుకూరి:** స్త్రీవాద సాహిత్యాన్ని కొందరు పురుష వ్యతిరేక సాహిత్యంగా అపార్థం చేసుకుంటారు. కానీ అది అసలు సిసలైన అర్థం కాదు. స్త్రీని కూడా సంపూర్ణ మనిషిగా చూడాలని, ఆమెకు సమాన హక్కులు, సమాన అవకాశాలు ఉండాలని చెప్పేదే స్త్రీవాదం. శతాబ్దాలుగా సాహిత్యంలో స్త్రీ పాత్రను ఎక్కువగా పురుష రచయితలే నిర్మించారు. స్త్రీ స్వయంగా తన అనుభవాన్ని చెప్పడం ప్రారంభించినప్పుడు కొత్త ప్రపంచం కనిపించింది. కుటుంబం, వివాహం, మాతృత్వం, ఉద్యోగం, శరీర రాజకీయాలు, స్వేచ్ఛ, వ్యక్తిత్వం వంటి అంశాలు సాహిత్యంలో కొత్త కోణాన్ని తెచ్చాయి. సమాజంలో సగం జనాభా అనుభవాలను ప్రతిబింబించే సాహిత్యం లేకుండా ఏ సాహిత్య చరిత్రా సంపూర్ణం కాదు.

**ప్రశ్న: ఇటీవల 'ఎల్‌జిబిటిక్యు' సాహిత్యం గురించి ఎక్కువగా చర్చ జరుగుతోంది. దీనిని ఎలా చూడాలి?**

**ఏటుకూరి:** సాహిత్యం అంటేనే మనిషి అనుభవాల చరిత్ర. ఆ అనుభవాల్లో లింగ వైవిధ్యం కూడా ఒక భాగం. చాలా కాలం పాటు ఎల్‌జిబిటిక్యు వ్యక్తుల జీవితాలు సాహిత్యంలో కనిపించలేదు. కనిపించినా అపహాస్యంగా లేదా ప్రతికూలంగా చూపించడం జరిగింది. ఇప్పుడు వారు తమ అనుభవాలను తామే రాస్తున్నారు. ఇది సాహిత్య విస్తరణకు సంకేతం. ఒక రచనతో ఏకీభవించవచ్చు, విభేదించవచ్చు. కానీ ఒక వర్గం ఉనికినే నిరాకరించడం సాహిత్య స్వభావం కాదు. సాహిత్యం మనిషిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలేతప్ప, తీర్పు చెప్పడానికి కాదు. అయితే ఏ సాహిత్యమైనా కళాత్మకత, సాహిత్య విలువలను కోల్పోవద్దు. కేవలం నినాదం గొప్ప సాహిత్యాన్ని సృష్టించదు. అనుభవం కళగా మారినప్పుడే అది చిరస్థాయిగా నిలుస్తుంది.

**ప్రశ్న: అంటే సాహిత్యం నిరంతరం విస్తరిస్తూ ఉంటుందా?**

**ఏటుకూరి:** అవును. ప్రారంభంలో చెప్పుకున్నట్టు సాహిత్యం నిరంతరం మారుతూ, అనంతంగా విస్తరిస్తూ ఉంటుంది. ఇదే సాహిత్య సౌందర్యం. ఒకప్పుడు దేవుళ్లు కేంద్రంగా ఉన్నారు. తర్వాత రాజులు వచ్చారు. తరువాత ప్రేమ, ప్రకృతి, ఆపై సామాన్య మనిషి, శ్రమజీవి, మహిళ, దళితుడు, ఆదివాసీ, ఇప్పుడు లింగ వైవిధ్య అనుభవాలు కూడా సాహిత్యంలోకి వచ్చాయి. ఈ మార్పుల వల్ల సాహిత్యం బలహీనపడలేదు. మరింత బలపడింది. మరింత ప్రజాస్వామ్యబద్ధమైన రూపాన్ని సంతరించుకుంది. మంచి సాహిత్యం ఎప్పుడూ కొత్త స్వరాలకు తలుపులు తెరుస్తుంది. ఎందుకంటే, సమాజం నిరంతరం మారుతుంది. మనిషి మారుతాడు. అతని ప్రశ్నలు మారుతాయి. ఆ ప్రశ్నలకు సమాధానాలు వెతికే ప్రయాణమే సాహిత్యం. అందుకే సాహిత్యం కాలాన్ని అనుసరించదు. కాలాన్ని ప్రశ్నిస్తుంది, కాలాన్ని ప్రభావితం చేస్తుంది. అదే దాని శాశ్వత శక్తి.

**ప్రశ్న: చివరిగా... మీ దృష్టిలో ఒక గొప్ప సాహిత్య కృతి ఎలా ఉండాలి?**


**ఏటుకూరి:** నా అభిప్రాయం ప్రకారం గొప్ప సాహిత్య కృతి మూడు లక్షణాలను కలిగి ఉండాలి. మొదటిది కళాత్మకత, రెండోది సామాజిక బాధ్యత, మూడోది శాశ్వత మానవీయ విలువలు. ఈ మూడింటిలో ఏ ఒక్కటి లేకపోయినా ఆ రచన సంపూర్ణంగా నిలబడదు. చాలామంది సాహిత్యం సమాజానికి అద్దం కావాలని అంటారు. అది నిజమే. కానీ అద్దం కేవలం ఉన్నదాన్ని మాత్రమే చూపిస్తుంది. గొప్ప సాహిత్యం మాత్రం మనిషి ఎలా ఉండాలో కూడా చూపించాలి. అందుకే నేను ఎప్పుడూ చెప్పే మాట ఏమిటంటే, సాహిత్యం దర్పణమే కాదు, దివిటీ కూడా కావాలి. చీకటిలో దారి చూపని వెలుగు ఎంత పనికిరాదో, మార్పును సూచించని సాహిత్యం కూడా అంతే అసంపూర్ణం.

– బిఎల్

## చదవాల్సిన పుస్తకం

### జనం నుంచి జనంలోకి..

కవులు ఉంటారు... రచయితలు ఉంటారు.. సాహితీ విమర్శకులు ఉంటారు... రాశిలో తక్కువ అయినప్పటికీ, సాహిత్య పరిశోధకులు కూడా ఉంటారు. అందరినీ కలిపితే మాత్రం ఏటుకూరి ప్రసాద్ అవుతారు. ఆయన గురించి ప్రస్తావించడం మహాసముద్రాన్ని చిన్న పాత్రలో పట్టించే ప్రయత్నమే. జనం నుంచి వచ్చిన ఆయన, జనం పాటలే రాశారు. కార్మిక, కర్షక వర్గాల అభ్యున్నతికి పరితపించారు. అసలుసిసలైన కమ్యూనిస్టు కాబట్టి, ఆయన ప్రతి అక్షరంలోనూ ప్రగతిశీల భావాలు ఆవిష్కృతమవుతాయి. ప్రతి పదంలోనూ ఎర్రజెండా రెపరెపలు వినిపిస్తాయి. సాహిత్యాన్ని కాలంతో సంభాషించే వేదికగా మలచిన ఏటుకూరి రాసిన వేలాది పాటల నుంచి కొన్నింటిని ఎంపిక చేసుకొని, పుస్తకరూపంలోకి తీసుకురావడం ఒక సాహసమే. అలాంటి సాహసోపేతమైన కార్యాన్ని సాధ్యం చేసిన ఘనత నవచేతన పబ్లిషింగ్ హౌస్‌కు దక్కుతుంది. 'జనం నుంచి జనంలోకి' పేరుతో వెలువడిన పుస్తకంలో ప్రతి పాటా ఏటుకూరి భావ సౌందర్య ఆత్మను, శ్రామిక సంబంధ బాధ్యతను గుర్తుచేస్తాయి. సాహితీ ప్రపంచంలో విభిన్న పాత్రలను సమన్వయంతో నిర్వహిస్తూ, పాటలను భావోద్వేగాల ప్రపంచంగానూ, ఆలోచనల ప్రజాక్షేత్రంగానూ మలచిన వ్యక్తిగా ఏటుకూరిని తెలుగు సాహిత్యం చిరకాలం గుర్తుంచుకుంటుంది.





'ఇదిరా లోకం ఇది మనలోకం
అందరూ బతికే లోకం
మన అందరి ముందరిలోకం
తల్లో చెల్లో నలిగిపోయినా
ఎవరో భారతనారి
రెక్కలమ్మినా డొక్కలు నిండక
తనువే అమ్మితివా
చావూ తబతుకుల సంఘర్షణలో
బలి కావాలసినదేనా' అంటూ 'లోకం పోకడ'ను

వివరిస్తారు ఒక పాటలో.

చెమటే మేఘాలై చెలరేగే నింగినిండా
శ్రమజీవుల కన్న కలలు
నెలనింద పండా..
నల్లదొరల దోపిడిపై
లేచే తెలుగు పడికిళ్లు
సోషలిజానికి తెరచును
తెలుగుల వాకిళ్లు' అని

'ఎర్రనవ్వు'తో అంటారు మరో పాటలో.

'ఎర్రజెండా' గొప్పతనాన్ని వివరిస్తూ,

'అమెరికా నడిబొడ్డులోపల
శ్రామికుల పోరాటమందున రక్తధారలో ముంచి ఎత్తగ
రాగ రంజితమైనదేదిరా' అంటూ అరుణ పతాక ఉద్భవాన్ని వివరిస్తారు. 'రేబవళ్లూ కష్టపడ్డా, కూలిగించలు దక్కనీక, శ్రమను దోచే వెట్టిచాకిరి'కి ఎదురుతిరగమని ప్రబోధిస్తారు. బాధలను సమస్యలను వల్లెవేయడం కాదు.. 'మార్పుల పంటలు' కూడా పండించారు. వస్తుంది వస్తోందిరోయ్, మంచి రోజు వస్తోంది. మలంచి రోజులొచ్చే ముందొచ్చే ఎర్రెర్ర గాలి వీస్తోంది వీస్తోందిరోయ్' అంటూ ఆశావాదాన్ని వినిపిస్తారు. చెమటచుక్కలన్ని చేరి సింధువుగా మారిపోతాయని, పోరాటం సాగించి దోపిడీ దొంగల దీవులను ముంచెత్తుతాయని ఆశాజన భవిష్యత్తును వివరిస్తారు. శ్రమజీవుల రక్తంతో ఎరుపెక్కిన 'ఎర్రబాట'లో నడవాలని కోరుతారు. సరైన దారి ఏదో కూడా ఒక పాటలో వివరిస్తూ,

'నింగి తాకు చెట్లపైన
నేల వేళ్ల పోరాటం
కలిగినోళ్ల జులుంపైన
తిరుగుబాటు పోరాటం' అంటారు. వేళ్లను ఆధారంగా చేసుకొని ఎదిగే చెట్లు మిడిపోతూ, చివరికి వేళ్లనే చిన్నచూపు చూడడం అనేది శ్రమ జీవుల స్వేదంతో ఎదిగిన కార్పొరేటు దొరలతో పోల్చడం గొప్ప ప్రయోగం. 'నడిమి తరగతి' ప్రజల గురించి ఆలోచించిన అతి తక్కువ మంది కవుల్లో ఏటుకూరి ఒకరు. ఇలా చెప్పూపోతే, అనంతంగా కొనసాగుతునే ఉంటుంది. సూక్ష్మంగా చెప్పాలంటే, ఈ పుస్తకంలోని 93 పాటలు, 13 నృత్య గీతలు, 6 నృత్య నాటికలు వేటికవే ప్రత్యేకం. కార్మిక పక్షపాతుల నుంచి మధ్య తరగతి సామాన్యుల వరకూ.. రైతు నేస్తాల నుంచి వామపక్ష భావజాలాన్ని ప్రేమించవారి వరకూ.. గాయకుల నుంచి నృత్యకారుల వరకూ... ప్రతి ఒక్కరినీ 'జనంనుంచి జనంలోకి' పాటలు అలరిస్తాయి. ఆలోచింప చేస్తాయి. భవిష్యత్తును నిర్ణయించుకునే ధైర్యం నెగళ్లను వెలిగిస్తాయి. అందుకే ఇది చదవాల్సిన పుస్తకం. పాటుకోవాల్సిన పాటల సాగరం.

(ఏటుకూరి ప్రసాద్ గారికి అక్షరాంజలి)

**పుస్తకం పేరు**

**జనం నుంచి జనంలోకి..**


రచయిత : ఏటుకూరి ప్రసాద్ , వెల: రూ. 100/

ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

## ఒక్కరోజులో అద్భుతాలు ఏవీ జరగవు

సాహిత్యం అనేది కాలం రాసిన మనిషి ఆత్మకథ. ఏ ఒక్క రచన లేదా పుస్తకం ఒక్క రోజులో విప్లవాన్ని తీసుకురాదు. మార్పును శాసించదు. కానీ ఒక ఆలోచనను నాటుతుంది. ఆ ఆలోచనే తరువాత ఉద్యమంగా, సంస్కరణగా, చట్టంగా, సామాజిక మార్పుగా రూపాంతరం చెందుతుంది. హ్యారియట్ బీచర్ స్టో రాసిన 'అంకుల్ టామ్స్ కేబిన్' అమెరికాలో బానిసత్వంపై ప్రజల దృష్టిని మలిచింది. రష్యాలో గోర్కీ రచనలు కార్మిక వర్గ చైతన్యానికి బలం చేకూర్చాయి. మన దేశంలో గురజాడ, శ్రీశ్రీ, చలం, కాళోజీ, దాశరథి వంటి రచయితల సాహిత్యం సామాజిక చర్చలకు దారితీసింది. కాబట్టి సాహిత్యం నేరుగా ప్రభుత్వాలను మార్చకపోయినా, మనుషుల మనస్సులను మార్చుతుంది. మనస్సులు మారితే సమాజం కూడా మారుతుంది. ఇక్కై ప్రస్తుతం ప్రపంచంలో ధనికులు మరింత ధనవంతులు, పేదలు మరింత పేదలవుతున్నారని చర్చ జరుగుతోంది. ఇలాంటి పరిస్థితిలో సాహిత్యం పాత్ర ఏమిటి? అనే అత్యంత కీలకమైన ప్రశ్న తలెత్తుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అసమానతలు పెరుగుతున్నాయి. కొద్దిమంది వద్ద అపార సంపద కేంద్రీకృతమవుతుండగా, కోట్లాది మంది ప్రాథమిక అవసరాల కోసం పోరాడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సాహిత్యం మౌనంగా ఉండకూడదు. అసమానతను ప్రశ్నించడం, శ్రమకు గౌరవం ఇవ్వడం, మనిషి గౌరవప్రదమైన జీవితం గడపాలనే ఆకాంక్షను బలపరచడం సాహిత్యం బాధ్యత. అందుకే అభ్యుదయ, వామపక్ష సాహిత్యం ఇప్పటికీ తన ప్రాసంగికతను కోల్పోలేదు. ఏ భావజాలమైనా ద్వేషాన్ని కాదు, మానవత్వాన్ని పెంపొందించాలి. ఒక సిద్ధాంతం మనిషి కంటే పెద్దదిగా మారితే అది సాహిత్యం కాదు.. ప్రచార పత్రం మాత్రమే అవుతుంది. భావజాలం ఉండాలి. కానీ, అది కళాత్మకతను దెబ్బతీయకూడదు. ఈ విషయాన్ని చాలా మంది రచయితలు మరిచిపోతారు. గొప్ప ఆలోచన ఉండడం మాత్రమే గొప్ప సాహిత్యానికి సరిపోదు. అదే విధంగా కేవలం అందమైన భాష కూడా సరిపోదు. ఈ రెండూ కలిసినప్పుడే గొప్ప రచన పుడుతుంది. ఏదిఏమైనా సాహిత్యం నిరంతరం మార్పులకు లోనవుతునే ఉంటుంది. ఉదాహరణకు, నేటి డిజిటల్ యుగంలో ప్రచండ వేగంతో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సహజంగా, ప్రతి కొత్త సాంకేతిక మార్పు వచ్చినప్పుడు ఇలాంటి ఆందోళనలు వ్యక్తమవుతాయి. ముద్రణా యంత్రం వచ్చినప్పుడు కూడా ఇలాగే భయపడ్డారు. రేడియో వచ్చినప్పుడు పుస్తకాలు చదవడం తగ్గిపోతుందని అనుకున్నారు. టెలివిజన్ వచ్చినప్పుడు కూడా అదే వాదన వినిపించింది. సోషల్ మీడియా ఒక సాధనం మాత్రమే. దానిని ఎలా ఉపయోగిస్తామన్నదే ముఖ్యం. ఒకవైపు పైపైన చదివే అలవాటు పెరిగిందనేది నిజం. మరోవైపు వేలాది కొత్త రచయితలకు తమ రచనలను ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం కూడా లభించింది. ఇక్కడ, ఒక రచయిత సమాజం కోసం రాయాలా? లేక తన సంతృప్తి కోసం రాయాలా? అనే ప్రశ్న ఉద్భవించక మానదు. కానీ, నిజం చెప్పాలంటే, ఈ రెండూ పరస్పర విరుద్ధాలు కావు. నిజమైన రచయిత తన అంతరంగం నుంచి రాస్తాడు. కానీ ఆ అంతరంగం సమాజంతో విడిపోని సం బంధం కలిగి ఉంటుంది. మనిషి ఒంటరిగా జీవించడు. అందుకే వ్యక్తిగత అనుభవం కూడా చివరికి సామాజిక అనుభవంగానే మారుతుంది. గొప్ప రచయిత తన వ్యక్తిగత బాధను మానవజాతి బాధగా, తన వ్యక్తిగత ఆనందాన్ని మానవజాతి ఆనందంగా మలచగలడు.

## రచయిత చదువరి కావాలి..



రచయిత అనేవాడు ఎక్కువగా చదవాలి. ఒకే భావజాలానికి పరిమితం కాకూడదు. ప్రపంచ సాహిత్యాన్ని చదవాలి. తెలుగు సాహిత్య చరిత్రను తెలుసుకోవాలి. విభిన్న అభిప్రాయాలను వినాలి. విభేదించే వారినీ చదవాలి. జీవితాన్ని పరిశీలించాలి. పుస్తకాల నుంచి మాత్రమే గొప్ప సాహిత్యం పుట్టదు. రైతును చూడాలి. కూలీని కలవాలి. కార్మికుడితో మాట్లాడాలి. మహిళల అనుభవాలను వినాలి. పిల్లల ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలి. ప్రకృతిని ఆస్వాదించాలి. సమాజాన్ని గమనించాలి. భాషను ప్రేమించాలి. సరళమైన భాష అం బలహీనమైన భాష కాదు. లోతైన భావాలను కూడా సులభంగా చెప్పగలిగిన రచయితే గొప్ప రచయిత. అంతేకాదు, రచయితకు ఓపిక అవసరం. ఒక రచనతోనే గొప్ప రచయిత కాలేం. రచన ఒక నిరంతర సాధన. ప్రతిరోజూ చదవాలి, రాయాలి, సవరించాలి. రచయితలే చాలా మంది విమర్శకులుగా మారిపోతుంటారు. వర్గాలుగా చీలిపోయి, పరస్పరం నిందించుకోవడం పెరిగిపోతున్నది.

మరోవైపు సాహితీ విమర్శకుల పరిస్థితి కూడా దాదాపు ఇదే రీతిలో కొనసాగుతున్నది. విమర్శ అంటే తప్పులను వెతకడమే అన్న భాయం బలపడుతున్నది. కానీ, ఇది నిజం కాదు. విమర్శ అంటే తప్పులు వెతకడం కాదు. మంచి విమర్శ ఒక రచనలోని బలాన్ని, బలహీనతను సమతుల్యంగా విశ్లేషిస్తుంది. విమర్శ లేకపోతే సాహిత్యం ఎదగదు. అలాగే రచయిత విమర్శను శత్రుత్వంగా కాకుండా అభివృద్ధికి అవకాశంగా స్వీకరించాలి. అదే సమయంలో విమర్శకుడికి కూడా బాధ్యత ఉంది. వ్యక్తిని కాదు, రచనను విశ్లేషించాలి. సిద్ధాంతం కాదు, సాహిత్య విలువలను కూడా పరిశీలించాలి. మారుతున్న పరిస్థితులను పరిశలోకి తీసుకోవాలి. ఎందుకంటే, సమాజం నిరంతరం మారుతూ ఉంటుంది. నిన్న నిజం అనుకున్నది నేడు కాకపోవచ్చు. కొత్త ఆలోచనలు... కొత్త సిద్ధాంతాలు వెలుగులోకి రావచ్చు. వర్తమానమే నిరంతరం మారుతున్న తరుణంలో, సాహిత్యం భవిష్యత్తును ఊహించడం అసాధ్యం.కృత్రిమ మేధస్సు, వాతావరణ మార్పులు, వలసలు, డిజిటల్ జీవితం, లింగ వైవిధ్యం, ప్రపంచ అసమానతలు వంటివన్నీ రేపటి సాహిత్యంలో ప్రధాన అంశాలవుతాయి. మార్పు అనివార్యం. అయితే ఎంత మార్పు వచ్చినా సాహిత్యపు అసలు హృదయం మాత్రం మారదు. మనిషి నవ్వు, కన్నీరు, ప్రేమ, బాధ, న్యాయం కోసం పోరాటం వంటి అంశాలే సాహిత్యానికి శాశ్వత మూలాలు. ఈ అంశాలతో కూడినదే మంచి లేదా ఉత్తమ సాహిత్యంగా చెప్పుకోవచ్చు. కేవలం సమస్యను మాత్రమే చూపదు. ఆశను సజీవంగా ఉంచుకుతుంది. కేవలం చీకటిని వర్ణించడంతో ఆగకుండా, వెలుగువైపు నడిపిస్తుంది. మనిషిని మరింత మానవీయుడిగా, మరింత స్వేచ్ఛావంతుడిగా, మరింత సమానత్వ భావన కలిగిన వ్యక్తిగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తుంది. అదే సాహిత్య శాశ్వత ధర్మం. అదే రచయితకు ఉన్న అత్యున్నత సామాజిక బాధ్యత.

## ఈ వారం కవితలు

### ఎండగట్టే కాలం !



కరువు ఛాయలతో భూమి
మసకబారిపోనుంది
అరువు దొరకని దీనావస్థలో
సగటు దిగులు కొండెక్కనుంది
ఎల్‌నినో బుసలుతో
సమాజం ఉలిక్కిపడింది
పొడిబారిన నేల తల్లడిల్లుతూ
కడుపు కోతతో తరుక్కుపోయింది

ఊపిరాడని విత్తనం
సంచిలోనే అసువులుబాసింది
దున్నకమే కరువైన నాగలి
మూలకు ఒరిగిపోయింది

చెదిరిపోతున్న వాన మబ్బుల్తో
ఆకాశం ప్రశాంతమైంది
ఉపరితల ఆవర్తన వత్తిడితో
ఉష్ణోగ్రతకు పట్టు దొరికింది

చినుకు తడి లేని చేను
నీరింకిన కళ్ళతో దుఃఖాన్ని
లోలోపల దిగమింగుకుంటోంది
మొక్కకు పురుడోసుకోలేని భూమి
రేయింబవళ్ళు అంగలార్చుతోంది
భూమి పగుళ్ల మధ్యలో రైతు గోడు
నలిగిపోతూ ఆవిరైపోతోంది
పంట నమ్మకం కోల్పోయి

ఆకాశం వైపు చూడ్డమే పనైంది

ఎండగట్టే కాలం వస్తుందేమోనని
మనిషి మనిషిలో దిగులు
దెయ్యమై పీడించడం మొదలైంది
కార్తి కర్పూరమై కరిగిపోతున్నాది

అదును అటకెక్కి కూర్చున్నది
తల పైకెత్తి చూసి చూసి
అలసిన బ్రతుకు సొలిసిపోయింది

నరెద్దుల రాజారెడ్డి
సెల్ : 9666016636


### మానవత్వమా నువ్వెక్కడ..?

పెరిగిన సాంకేతిక పరిజ్ఞానానికి
పెముడి సరుకుగా పెట్టుబడి అయి
పోయిందేమో మానవత్వం...
అందమైన భవంతుల కింద
కనుమరుగైందేమో మానవత్వం...

డబ్బుతో ముడి పడి పోయే
బంధాల తాకిడి మధ్యలో
నలిగి పోయిందేమో మానవత్వం...
మనిషి కష్టం గురించి ఆలోచించే
సమయం లేక సోషల్ మీడియాలో
మానవత్వం వెతుకుతున్న ఈ తరం...
గత చరిత్రలో రాజులు, శ్రీమంతులు

కరువు కాటకాలలో పేదవారికి
తోడ్పాటును అందించి మానవత్వం
చాటుకుంటే వర్తమానంలో
ఈర్ష్య అసూయలతో మానవత్వం
మరిచి అధిపత్యం చెలాయిస్తున్నారు...

కార్పొరేట్ సంస్థలకు మానవత్వం
అమ్ముడుపోయిందేమో అనే
విధంగా లాభాలకై శ్రమ దోపిడీ...
మానవత్వం మరిచి రాబడికై
కార్మికులను పీడిస్తున్న కంపెనీలు...
మనీమైండ్ సెట్‌తో పిల్లల
పెంపకం చివరికి ఒంటరి అవుతూ



ఆత్మీయ పలుకరింపులకై ఆతృతగా
ఎదురు చూస్తున్న వృద్ధ తల్లిదండ్రులు.
మానవత్వమా నువెక్కడని
అడుగుతుంది ఓ ఆత్మీయ స్పర్శ...

మిద్దె సురేష్, 9701209355

## బిఆర్ఎస్ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం: వేముల

కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో రైతుల పేరుతో ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని బిఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ప్రభుత్వ విప్ వేముల వీరేశం విమర్శించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తోందని ఆయన ఆరోపించారు. తెలంగాణ ప్ర జలు ఇప్పటికే బిఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పారని, ఇప్పటికైనా వాస్తవాలను అంగీకరించి తప్పుడు ప్రచారం మానుకోవాలని వేముల వీరేశం ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. తెలంగాణ ఉద్యమం పేరుతో ప్రజల భావోద్వేగాలను ఉపయోగించుకుని అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆయన ఆరోపించారు. రైతులకు సం కెళ్లు వేసి అవమానిం చారని, నేరెళ్ల ఘటనలో దళితులపై దౌర్జన్యాలు జరిగాయని, ప్రగతి భవన్‌ను ప్రజలకు దూరం చేశారని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని వేముల వీరేశం విమర్శించారు.

# యువజన ఉద్యమాలను బలోపేతం చేద్దాం

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి

సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో యాదగిరిగుట్టలో ఎఐవైఎఫ్ మహాసభలు







**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్టలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో జరగనున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని మాజీ యువజన నాయకులు, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశం ఎఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ అధ్యక్షతన జరగగా, ఈ మహాసభలను చారిత్రాత్మక విజయంగా నిర్వహించేందుకు ఆహ్వాన సంఘ సమావేశంను స్థానిక గుండ్లపల్లిలోని కెఎం గ్రాండ్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ యువజన నాయకులు, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మహాసభల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించి, విస్తృత కార్యాచరణ రూపొందించేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆహ్వాన సంఘ విస్తరణ, ప్రచార కార్యక్రమాలు, నిధుల సేకరణ, వసతిభోజన ఏర్పాట్లు, స్వచ్ఛంద కార్యకర్తల బాధ్యతలు, మహాసభల విజయానికి చేపట్టాల్సిన కార్యాచరణ వంటి కీలక అంశాలపై చర్చించి బాధ్యతలను కేటాయిస్తామని తెలిపారు. ప్రతి జిల్లా, మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి మహాసభలను ప్రజల మహాసభలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అదే విధంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎఐవైఎఫ్ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు ఇటి నర్సింహా మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగం, విద్యా సమస్యలు, మాదకద్రవ్యాల వ్యాప్తి, కాంట్రాక్టీకరణ ఔట్‌సోర్సింగ్, రాజ్యాంగ విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం, మహిళల భద్రత, యువత ఉపాధి వంటి ప్రజా సమస్యలపై ఎఐవైఎఫ్ ఉద్యమాలను మరింత బలోపేతం చేసే దిశగా ఈ మహాసభలు కీలక నిర్ణయాలు తీసుకుంటాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా యువతను సంఘటితం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలను మరింత విస్తరించడమే మహాసభల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అదే విధంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, శాసనసభ్యుడు నెల్లికంటి సత్యం మాట్లాడుతూ యువజన సమస్యల పరిష్కారానికి ఎఐవైఎఫ్ వంటి అభ్యుదయ యువజన సంఘాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. యువతలో సామాజిక చైతన్యం, రాజ్యాంగ విలువలు, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు మహాసభలు దోహదపడాలని పేర్కొన్నారు. రాష్ట్ర 3వ మహాసభలను ఉద్య మ స్ఫూర్తికి ప్రతీకగా, యువత ఆకాంక్షలకు వేదికగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త మహాసభల విజయాన్ని తన బాధ్యతగా భావించి విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ పేరబోయిన మహేందర్, వెంకటేశ్వర్లు, సత్య ప్రసాద్, యుగంధర్, కొండల్, బాల కృష్ణ, సల్మాన్ బేగ్, ప్రవీణ్, సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, చెడే చంద్రయ్య, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోదా శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ కొల్లూరి రాజయ్య, ఎండి ఇమ్రాన్, చెక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, బచ్చన గోని గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, చిగుర్ల లింగం, ఏషాల అశోక్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, ఉప్పల శాంతి కుమార్, పేర బోయిన బంగారి, గాదెగాని మాణిక్యం, అన్యమైన వెంకటేష్, పేరబోయిన పెంటయ్య, ఆరే పుష్ప గోపగాని రాజు, గుండు వెంకటేష్, అనంతుల నరసింహా, సంగి అరవింద్, పేర బోయిన రాజేష్‌తో పాటు యువజన, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## భూదాన్ భూములకు ప్రత్యేక డిజిటల్ రికార్డులు

33 జిల్లాల్లో సమగ్ర సర్వే నిర్వహించాలి

తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షుడు ఆర్.శంకర్ నాయక్ విజ్ఞప్తి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని భూదాన్ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండలం, గ్రామం, సర్వే నంబర్, విస్తీర్ణం, హద్దులు, ప్రస్తుత స్థితి, జియోట్యాగింగ్ తదితర వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఈ వివరాలను తెలంగాణ ఆన్‌లైన్ భూ రికార్డుల్లో ప్రత్యేక 'భూదాన్' కేటగిరీగా నమోదు చేస్తే అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలను సమర్థంగా అడ్డుకోవచ్చని తెలిపారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఆదివారం నిర్వహించిన సర్వోదయ మండలి రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో భూదాన్ భూములపై ప్రత్యేక సర్వే నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అనేక భూదాన్ భూములు ఆక్రమణలు, సరిహద్దు వివాదాలు, అక్రమ లావాదేవీలు, అసంపూర్ణ రెవె న్యూ రికార్డుల వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసి, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఆర్‌డిఓలు, తహసీల్దార్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ అధికారులు, గ్రామస్థాయి రెవెన్యూ సిబ్బంది భాగస్వామ్యంతో సమగ్ర సర్వే చేపట్టాలని కోరారు. సర్వేలో అక్రమాలు వెలుగులోకి వచ్చిన చోట ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి భూములను స్వాధీనపరుచుకోవాలని, భూదాన్ భూముల పరిరక్షణ కోసం రాష్ట్రస్థాయి పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భూదాన్ ఉద్యమానికి తెలంగాణ జన్మభూమి కావడంతో ఈ చారిత్రక వారసత్వాన్ని భావితరాలకు అందించే బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరగా భూదాన్ యజ్ఞ బోర్డు ను ఏర్పాటు చేసి, అర్హులైన పేదలకు భూదాన్ భూములని పంపిణి చేయాలని ఆర్.శంకర్ నాయక్ కోరారు.

**రంగారెడ్డి జిల్లా తెలంగాణ సర్వోదయ మండలి నూతన కార్యవర్గం ఎన్నిక:** తెలంగాణ సర్వోదయ మండలి రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షుడిగా సాంబ మల్లేశం, ఉపాధ్యక్షుడిగా దాసరి మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా వి.బాలు నాయక్, సహాయ కార్యదర్శిగా ఎస్.కొండాలయ్య, కోశాధికారిగా పి.సూర్యం, ప్రతినిధిగా రఘు ఎన్నికయ్యారు. మండలి మహిళా విభాగం అధ్యక్షురాలుగా నాగజ్యోతి, ఉపాధ్యక్షురాలుగా ఏ.రాధా, యువజన విభాగం అధ్యక్షులు దయానంద్ కుమార్, కార్యదర్శిగా కె.శివకుమార్‌లను ఎన్నుకున్నట్లు ఆర్.శంకర్ నాయక్ ప్రకటించారు. సమావేశంలో తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. గిరిప్రసాద్, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు ఎస్.యాదమ్మ, ఉపాధ్యక్షురాలు విజయ, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఎస్.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నీళ్లు ఇవ్వాలి

కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎంకు తమ రక్తం ఎంత కావాలంటే అంత పంపిస్తామని, కానీ రైతులకు నీళ్లు ఇవ్వాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. రక్తదాహం తీర్చుకుని ఎండుతున్న పొలాలకు జలదాహం తీర్చాలన్నారు. ఈ మేరకు కెటిఆర్ తన ట్విట్టర్(ఎక్స్)లో పోస్ట్ చేశారు. పేగులు తెగే వరకు రాష్ట్రం కోసం పోరాడిన వాళ్లమని, రైతుల కోసం ఎంత రక్తమైనా ధారపోయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. నెత్తురు ఇస్తేనే నీళ్లు ఇస్తామనడం కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వం కోరుతుంటే తమ నెత్తురును ధారపోస్తామన్నారు. నీళ్లు అడిగితే నెత్తురు చల్లుతా అని చెబుతావా రక్తపిశాచి? అని కెటిఆర్ పేర్కొన్నారు. ఇంకా రక్తదాహం తీరలేదా అని ప్రశ్నించారు. తెలంగాణ రక్తం రుచిమరిగిన తోడేలు కాంగ్రెస్ పార్టీకి ఇంకెంత రక్తం కావాలన్నారు. 1952లో ఏడుగురు యువకులను కాల్చి చంపారని,1969లో 369 మంది ముద్దుబిడ్డలపై తూటాలు కురిపించి రక్తం పారించిన ఖూనీకోర్లు 'మీరు' అని అన్నారు.

## పంప్‌హౌస్‌ల నుంచి నీటిని ఎత్తకపోతే

# విద్యుత్ ఉత్పత్తి నిలిచి రాష్ట్రం అంధకారం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎం పంతాలకు పోయి పంప్‌హౌజ్‌ల నుంచి నీటిని ఎత్తకపోతే విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయి రాష్ట్రం అంధకారమవుతుందని బిఆర్ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ప్రస్తుతం నదిలో లక్ష క్యూసెక్కుల వరద ప్రవహిస్తుందని, కన్నెపల్లి మోటార్లు 93.5 మీటర్ల ఎత్తులో నడు స్తాయని , నీటిమట్టం 97.5 మీటర్ల ఎత్తులో ఉన్నదని, గేట్లు మూయాల్సిన అవసరమే లేదన్నారు. ముఖ్యమంత్రి మాటలు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయని, ఆయనది సైకోమనస్తత్వమని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎ.జీవన్‌రెడ్డి,సునీతాలక్షారెడ్డి, సత్యవతిరాథోడ్, ఎంఎల్‌ఎ కాలేరు వెంకటేశ్‌తో కలిసి హరీశ్‌రావు మాట్లాడుతూ తక్షణమే కన్నెపల్లి, దేవాదుల మోటార్లు పూర్తిస్థాయిలో ఆన్‌చేసి రాష్ట్రాన్ని కరువు బారి నుంచి కాపాడాలని, ఈ క్రెడిట్ మొత్తం సిఎం తీసుకోవచ్చని సూచించారు. రిటైర్డ్ ఇంజనీర్లు నీళ్లు ఎత్తాలని ప్రభుత్వానికి సూచిస్తే, వారిని జైలులో పెడుతామని సిఎం బెదిరిస్తున్నారన్నారు. ఏనాడు కూడా రిటైర్డ్ ఇంజనీర్లు మేడిగడ్డ ఫీజబుల్ కాదని చెప్పలేదన్నారు. నీటిపారుదల శాఖకు చెందిన అధికారులు కూడా కేవలం రూ. 8.5 కోట్ల ఖర్చుతో ఒక కాఫర్ డ్యామ్ నిర్మించి, ఆ నీటిని ఎల్లంపల్లికి తీసుకువెళ్లొచ్చని ప్రభుత్వానికి లేఖ రాసినట్టు హరీశ్‌రావు వివరించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు 20 ఏళ్ల క్రితమే కాంగ్రెస్ కట్టిందనేది పచ్చి అబద్ధమన్నారు. 2004లో ఆ ప్రాజెక్టు శంకుస్థాపన శిలాఫలకంపైన మంత్రిగా తన పేరు కూడా ఉన్నదన్నారు. 2016 సంవత్సరం తర్వాతనే ఆ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో 20 టిఎంసి వినియోగంలోకి వచ్చిందన్నారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీళ్లు ఆపితే భద్రాచలం మునిగిపోతుందనడం శుద్ధ అబద్ధమన్నారు. అన్నారంలో 5 టిఎంసిలు, సుందిళ్లలో 3.8 టిఎంసిలు మొత్తం 8.8 టిఎంసిలు నిలిపితే, ఒకవేళ రెండు బ్యారేజీలకు ఒకే సారి ఇబ్బంది వచ్చినా కిందకు వెళ్లేది కేవలం 1.10 లక్షల క్యూసెక్కుల నీరు మాత్రమేనని, ఈ నీటితో భద్రచలంకు ఎటువంటి ప్రమాదం ఉండబోదన్నారు. దేవాదుల లో పది మోటర్లు ఉంటే కేవలం నాలుగు మాత్రమే ఎందుకు ఉపయోగిస్తున్నారని ప్రశ్నించారు. ఎక్స్‌పర్ట్స్‌ను, ఆర్మీ ఇంజనీర్లను తీసుకొచ్చామని గొప్పలు చెబుతున్న సిఎం రేవంత్ రెడ్డికి ఏ సీజన్‌లో పనులు చేయాలో కూడా తెలియదన్నారు. రాష్ట్రంలో కరువు చాయలు అలుముకుంటున్నాయన్నారు. ఎండిన ప్రతి పంటకు, రాలిన రైతు కన్నీరు చుక్కకు, ఆగిన ప్రతి గుండెకు, ప్రజల కష్టాలకు సిఎంను తెలంగాణ స మాజం దోషిగా నిలబెడుతుందని హెచ్చరించారు. హింసను ప్రేరేపించే విధంగా సిఎం మాట్లాడారని, హిట్లర్ తరహా హం తక భాష మాట్లాడుతున్న సిఎంకు హిట్లర్‌కు పట్టిన గతే పడుతుందన్నారు.విషయంలేనివారు, ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నవారే ఇలా మాట్లాడుతారని, జారుడు బండ నుంచి జారుతున్నారన్నారు. నీటమైన వ్యాఖ్యలు చేసిన సిఎం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈటల రాజేందర్‌ను తాను కలువక నెలలు, సంవత్సరాలు గడుస్తున్నాయన్నారు. గత ప్రభుత్వంలో ఈటల మంత్రిగా పని చేశారని, ఆ యనకు ఉన్న అవగాహనతో మాట్లాడారని హరీశ్‌రావు అ న్నారు. జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి సూచనలు చేసిన రిటైర్డ్ ఇంజనీర్లను జైలులో పెడుతామని సిఎం బెదిరిస్తున్నారన్నారు. ఇది వరకు 290 టిఎంసిల వరద వచ్చినా భద్రాచలంకు ఏం కాలేదన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ మళ్లీ ప్రారంభించాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు పవర్ బిల్లులు దండగా అనడం కొందరు దేశద్రోహులు, మరి కొందరు మూర్ఖపు అధికారులు చెబుతున్న మాట అని అన్నారు. శాసనసభ సమావేశాల్లో తమను చూసే ప్రభుత్వం పారిపోతుందని, ఇక కెసిఆర్ వస్తే తట్టుకుంటారా? అని ప్రశ్నించారు.

## కాళేశ్వరం అంశంపై..

# హరీశ్‌రావుది తప్పుడు ప్రచారం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టుపై బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు వరుసగా అసత్య ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టమైన వివరాలు వెల్లడిస్తున్నప్పటికీ, బిఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్ర యత్నం చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతిన్న తర్వాత రాష్ట్ర రైతులకు క్షమాపణ చెప్పడానికి బదులుగా బిఆర్ఎస్ నేతలు రాజకీయ ఆరోపణలు చే యడం బాధాకరమన్నారు. చదువుకున్నది పాలిటెక్నిక్ అయినప్పటికీ పెద్ద ఇంజనీర్‌లా హరీశ్‌రావు మాట్లాడుతున్నారని ఎద్దేవా చే శారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 2004 జూలై 28న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారని, 2004–2009 మధ్య బ్యారేజ్‌తో పాటు ప్రధాన కాలువల నిర్మాణం పూర్తయిందని గుర్తుచేశారు. అయినప్పటికీ ఎల్లంపల్లి నిర్మాణాన్ని కూడా తమ ఘనతగా చెప్పుకునేందుకు బిఆర్ఎస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ప్రారంభించాలంటే ముందుగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీటి నిల్వ ఉండాల్సిందేనని ఆది శ్రీనివాస్ తెలిపారు. బిఆర్ఎస్ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం రైతులను తప్పుదోవ పట్టించే ప్రయ త్నం చేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం నిలిపివేయాలని హరీశ్‌రావుకు సూచించారు.

## రిటైర్డ్ ఇంజినీర్ల వ్యాఖ్యల వెనుక హరీష్ ప్రోత్సాహం

టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజీ అంశాలపై కొందరు రిటైర్డ్ ఇంజినీర్లు చేస్తున్న వ్యాఖ్యల వెనుక హరీష్ రా వు ప్రోత్సాహం ఉందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌డిఎస్‌ఎ నివేదిక ఆధారంగానే రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. కాళేశ్వరం అంశంపై గత 30 నెలలుగా మౌనంగా ఉన్న రిటైర్డ్ ఇంజినీర్లు ఇప్పుడు ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ మంత్రి హరీష్ రా వు కసబ్ లాంటి వ్యక్తి అని ఆరోపించారు. బావబామ్మర్దులు కెటిఆర్, హరీష్‌రావు ఇద్దరు కలిసి బట్టలు లేకుండా జపం చేసిన బిఆర్ఎస్ పార్టీ తెలంగాణలో మళ్లీ అధికారంలోకి రాలేదని అన్నారు. పదవి, డబ్బు కోసం ఏదైనా చేసే వ్యక్తిగా హరీష్ రావు వ్యవహరించారని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న సమయంలో తన, మన అనే తేడా లే కుండా వ్యవహరించారని, మానవత్వం లే కుండా పాలన సాగించారని వి మర్శించారు.

హరీష్ రావు వ్యాఖ్యలు అబద్ధాలు, నిరాధార ఆరోపణలతో నిండి ఉన్నాయని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అ న్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీయడంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఎం త బాధ్యులో హరీష్ రావు కూడా అంతే బాధ్యులని ఆరోపించారు. చిల్లర రాజకీయాలు చేసే హరీష్ రావుకు సిఎం రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని అన్నారు. ఇకనైనా హరీష్ రావు చిల్లర వ్యాఖ్యలు, వ్యక్తిగత విమర్శలకు స్వస్తి చెప్పి నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలని మెట్టు సాయికుమార్ సూచించారు

---

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టర్, జనగాం గారి ప్రాథమిక ప్రకటన

**ఫారం-VI**

(చట్టం-30/2013లోని సెక్షన్ 11(1) సబ్ రూల్-1 రూల్ 19 ప్రకారం)

యస్.డి.సి. ఫైల్ నెం. సి/73/2022-1 తేది: 06.07.2026
కలెక్టర్, ఫైల్ నెం. జి2/1500/2022 తేది: 10.07.2026
గెజిట్ నెం. జెఎన్/ఎల్ఎ/37/2026 తేది: 11.07.2026,

ఈ దిగువ నిర్దిష్ట పరచిన జనగాం జిల్లా, కొడకండ్ల మండలము, మొండ్రాయి గ్రామములో ఉన్న భూమి మొత్తం విస్తీర్ణం **ఎ. 16.15 గుంటలు** దేవాదుల ప్రాజెక్ట్‌లో (జె.సి.ఆర్.జి.ఎల్.ఐ.పి) భాగంగా 1 ఎల్ ఆఫ్ 6 ఆర్ డిస్ట్రిబ్యూటరీ ఆఫ్ చెన్నూర్ మెయిన్ కెనాల్ ఆఫ్ చెన్నూర్ ట్యాంక్ **కి. మీ 0.056 నుండి కి. మీ 2.925 వరకు** కెనాల్ నిర్మాణ నిమిత్తం ఈ దిగువన చూపిన భూమి అవసరము అయి ఉన్నందని భావించినందున భూసేకరణ పునరుద్ధరణ, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 30/2013 లోని సెక్షన్ 11 (1) అనుసరించి ప్రకటన జారీ చేయనైనది.

అంతేకాక, పై నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను న్యాయమైన పరిహారం మరియు పారదర్శక హక్కు, పునరావాసం మరియు పునర్నిర్మాణ చట్టం, 2013 లోని అధ్యాయం-2 (సామాజిక ప్రభావ మదింపు) మరియు అధ్యాయం-3 (ఆహార భద్రతకు సంబంధించిన ప్రత్యేక నిబంధనలు) అమలులో నుండి, తెలంగాణ సవరణ చట్టం, 2016 (చట్టం 21 ఆఫ్ 2017) ద్వారా చేర్చబడిన సెక్షన్-10ఎ ప్రకారం, జి.ఓ.ఎం.ఎస్. నెం. 63, రెవెన్యూ శాఖ, తేది: 29.07.2017 ప్రకారం మినహాయించబడినందున, ఈ భూసేకరణకు అధ్యాయం-2 మరియు అధ్యాయం-3 నిబంధనలు వర్తించవు.

ఈ భూసేకరణ కారణంగా మొత్తం (1) కుటుంబము మాత్రమే నిర్వాసితులయ్యే అవకాశం ఉన్నందున, ప్రభావిత కుటుంబాల పునరావాసం మరియు పునర్నిర్మాణం కోసం అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జనగామ గారిని అడ్మినిస్ట్రేటర్‌గా నియమించారు.

అందువల్ల, దిగువ షెడ్యూల్‌లో జనగాం జిల్లా, కొడకండ్ల మండలము, మొండ్రాయి గ్రామములో సుమారు **ఎకరాలు 16.15 గుంటల** భూమిని పై ప్రజాప్రయోజనం కొరకు భూసేకరణ చేయుటకు ఈ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయబడుచున్నది.

**అనుబంధము**

**1 ఎల్ ఆఫ్ 6 ఆర్ డిస్ట్రిబ్యూటరి ఆఫ్ చెన్నూర్ మెయిన్ కెనాల్ ఆఫ్ చెన్నూర్ ట్యాంక్**

గ్రామము: మొండ్రాయి మండలం: కొడకండ్ల జిల్లా: జనగాం

| క్ర. సం. | సర్వే నెం. | టైటిల్ రకం | భూమి రకం మెట్ట/తరి | భూసేకరణ చేయు విస్తీర్ణము | ఆసక్తి కలిగియున్న వ్యక్తుల పేరు మరియు చిరునామా | రిమార్కులు |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 1 | 20 | పట్టా | ఖుష్కి | 0.09 | మల్లబోయిన పవన్ కుమార్ తండ్రి సోమ నర్సయ్య | |
| | | మొత్తం | | 0.09 | | |
| 2 | 19 | పట్టా | ఖుష్కి | 0.09 | | |
| 3 | 19 | పట్టా | ఖుష్కి | 0.15 | కనుకు శేకర్ తండ్రి సోమయ్య | |
| 4 | 19 | పట్టా | ఖుష్కి | 0.06 | పరిపెల్లి మహేష్ తండ్రి అయిలయ్య | |
| 5 | 19 | పట్టా | ఖుష్కి | 0.07 | ననుబాల ఉప్పలయ్య తండ్రి ఎల్లయ్య | |
| 6 | 19 | పట్టా | ఖుష్కి | 0.02 | ననుబాల బాలమల్లు తండ్రి బయ్యాలు | |
| 7 | 19 | పట్టా | ఖుష్కి | 0.01 | ననుబాల ఉప్పలయ్య తండ్రి ఎల్లయ్య | |
| 8 | 19 | పట్టా | ఖుష్కి | 0.01 | ననుబాల అంజయ్య తండ్రి మారయ్య | |
| | | మొత్తం | | 1.01 | | |
| 9 | 11 | పట్టా | ఖుష్కి | 0.01 | | |
| 10 | 11 | పట్టా | ఖుష్కి | 0.03 | మిట్ట సోమయ్య తండ్రి కొండయ్య | |
| 11 | 11 | పట్టా | ఖుష్కి | 0.10 | మిట్ట సాయిలు తండ్రి అబ్బయ్య | |
| 12 | 11 | పట్టా | ఖుష్కి | 0.12 | పోతుగంటి బిక్షం తండ్రి సాయిలు | |
| | | మొత్తం | | 0.26 | | |
| 13 | 12 | పట్టా | ఖుష్కి | 0.04 | ననుబాల వెంకన్న తండ్రి సోమ్మల్లు<br>ననుబాల నరేశ్ తండ్రి సోమ్మల్లు | |
| 14 | 12 | పట్టా | ఖుష్కి | 0.02 | ననుబాల నాగరాజు తండ్రి కొమురయ్య | |
| 15 | 12 | పట్టా | ఖుష్కి | 0.05 | ననుబాల వెంకన్న తండ్రి సోమ్మల్లు<br>ననుబాల నరేశ్ తండ్రి సోమ్మల్లు | |
| 16 | 12 | పట్టా | ఖుష్కి | 0.02 | ననుబాల యాకయ్య తండ్రి బాలయ్య | |
| 17 | 12 | పట్టా | ఖుష్కి | 0.05 | ననుబాల యాకయ్య తండ్రి బాలయ్య | |
| 18 | 12 | పట్టా | ఖుష్కి | 0.11 | ననుబాల నాగరాజు తండ్రి కొమురయ్య | |
| 19 | 12 | పట్టా | ఖుష్కి | 0.01 | ననుబాల వెంకన్న తండ్రి సోమ్మల్లు<br>ననుబాల నరేశ్ తండ్రి సోమ్మల్లు | |
| | | మొత్తం | | 0.30 | | |
| 20 | 18 | పట్టా | ఖుష్కి | 0.01 | ననుబాల అంజయ్య తండ్రి కొమురయ్య | |
| 21 | 18 | పట్టా | ఖుష్కి | 0.02 | ననుబాల యాకయ్య తండ్రి సోమయ్య | |
| 22 | 18 | పట్టా | ఖుష్కి | 0.01 | చేలివేరు వెంకటయ్య తండ్రి అయిలయ్య | |
| | | మొత్తం | | 0.04 | | |
| 23 | 13 | పట్టా | ఖుష్కి | 0.22 | చేలివేరు పరమేష్ తండ్రి వెంకన్న<br>చేలివేరు ప్రవీణ్ కుమార్ తండ్రి వెంకన్న | |
| | | మొత్తం | | 0.22 | | |
| 24 | 14 | పట్టా | ఖుష్కి | 0.02 | చేలివేరు పరమేష్ తండ్రి వెంకన్న<br>చేలివేరు ప్రవీణ్ కుమార్ తండ్రి వెంకన్న | |
| | | మొత్తం | | 0.02 | | |
| 25 | 446 | పట్టా | ఖుష్కి | 0.02 | | |
| 26 | 446 | పట్టా | ఖుష్కి | 0.12 | | |
| 27 | 446 | పట్టా | ఖుష్కి | 0.01 | | |
| 28 | 446 | పట్టా | ఖుష్కి | 0.13 | కొమ్ము మల్లయ్య తండ్రి బాలమల్లు | |
| 29 | 446 | పట్టా | ఖుష్కి | 0.05 | కనుకు అంజయ్య తండ్రి చంద్రయ్య | |
| 30 | 446 | పట్టా | ఖుష్కి | 0.02 | కొమ్ము ముత్తయ్య తండ్రి వీరయ్య | |
| 31 | 446 | పట్టా | ఖుష్కి | 0.02 | కొమ్ము మల్లయ్య తండ్రి బాలమల్లు | |
| 32 | 446 | పట్టా | ఖుష్కి | 0.01 | | |
| 33 | 446 | పట్టా | ఖుష్కి | 0.03 | | |
| | | మొత్తం | | 1.01 | | |
| 34 | 445 | పట్టా | ఖుష్కి | 0.01 | అయిలబోయిన రమేష్ తండ్రి పెద్ద యాకయ్య | |
| | | మొత్తం | | 0.01 | | |
| 35 | 440 | పట్టా | ఖుష్కి | 0.01 | అయిలబోయిన రమేష్ తండ్రి పెద్ద యాకయ్య | |
| 36 | 440 | పట్టా | ఖుష్కి | 0.12 | | |
| 37 | 440 | పట్టా | ఖుష్కి | 0.01 | ఐలబోయిన అంజయ్య తండ్రి శివరాములు | |
| 38 | 440 | పట్టా | ఖుష్కి | 0.04 | కొమ్ము ముత్తయ్య తండ్రి వీరయ్య | |
| 39 | 440 | పట్టా | ఖుష్కి | 0.06 | | |
| 40 | 440 | పట్టా | ఖుష్కి | 0.02 | | |
| | | మొత్తం | | 0.26 | | |
| 41 | 451 | పట్టా | ఖుష్కి | 0.08 | | |
| 42 | 451 | పట్టా | ఖుష్కి | 0.10 | కొమ్ము అంజయ్య తండ్రి యాదగిరి | |
| 43 | 451 | పట్టా | ఖుష్కి | 0.10 | | |
| 44 | 451 | పట్టా | ఖుష్కి | 0.09 | | |
| | | మొత్తం | | 0.37 | | |
| 45 | 450 | పట్టా | ఖుష్కి | 0.01 | ననుబోతు మల్లయ్య తండ్రి సోమనర్సయ్య | |
| | | మొత్తం | | 0.01 | | |
| 46 | 452 | పట్టా | ఖుష్కి | 0.06 | కొమ్ము యాదగిరి తండ్రి సోమల్లు | |
| | | మొత్తం | | 0.06 | | |
| 47 | 428 | పట్టా | ఖుష్కి | 0.01 | మరగాని ఉపేందర్ తండ్రి యాకయ్య | |
| 48 | 428 | పట్టా | ఖుష్కి | 0.01 | | |
| | | మొత్తం | | 0.02 | | |
| 49 | 453 | పట్టా | ఖుష్కి | 1.06 | కోల అంజయ్య తండ్రి సోమయ్య | |
| | | మొత్తం | | 1.06 | | |
| 50 | 414 | పట్టా | ఖుష్కి | 0.07 | ననుబాల నరేష్ తండ్రి సోమ్మల్లు | |
| 51 | 414 | పట్టా | ఖుష్కి | 0.06 | ననుబాల వెంకన్న తండ్రి సోమ్మల్లు | |
| 52 | 414 | పట్టా | ఖుష్కి | 0.05 | పెరుమాండ్ల సోమయ్య తండ్రి రామస్వామి | |
| | | మొత్తం | | 0.18 | | |
| 53 | 454 | పట్టా | ఖుష్కి | 0.04 | బొబ్బల శ్రీనివాస్ తండ్రి రాములు | |
| 54 | 454 | పట్టా | ఖుష్కి | 0.13 | బొబ్బల వెంకటేష్ తండ్రి యాదగిరి | |
| | | మొత్తం | | 0.17 | | |
| 55 | 412 | పట్టా | ఖుష్కి | 0.06 | | |
| 56 | 412 | పట్టా | ఖుష్కి | 0.04 | | |
| 57 | 412 | పట్టా | ఖుష్కి | 0.11 | | |
| 58 | 412 | పట్టా | ఖుష్కి | 0.03 | | |
| | | మొత్తం | | 0.24 | | |
| 59 | 287 | పట్టా | ఖుష్కి | 0.06 | | |
| 60 | 287 | పట్టా | ఖుష్కి | 0.02 | | |
| 61 | 287 | పట్టా | ఖుష్కి | 0.04 | | |
| 62 | 287 | పట్టా | ఖుష్కి | 0.01 | | |
| 63 | 287 | పట్టా | ఖుష్కి | 0.02 | రోడ్డు | |
| 64 | 287 | పట్టా | ఖుష్కి | 0.10 | | |
| | | మొత్తం | | 0.25 | | |
| 65 | 288 | పట్టా | ఖుష్కి | 0.30 | కసోజు నాగలక్ష్మి భర్త వెంకన్న<br>వంగరి రాజశేకర్ తండ్రి రాజమౌళి | |
| | | మొత్తం | | 0.30 | | |
| 66 | 397 | పట్టా | ఖుష్కి | 0.10 | పెరుమాండ్ల సోమయ్య తండ్రి రామస్వామి | |
| 67 | 397 | పట్టా | ఖుష్కి | 0.01 | పెరుమాండ్ల పర్వయ్య తండ్రి అంతయ్య | |
| 68 | 397 | పట్టా | ఖుష్కి | 0.24 | తోట సుధాకర్ తండ్రి దామోదర్ | |
| 69 | 397 | పట్టా | ఖుష్కి | 0.10 | తోట సోమయ్య తండ్రి నారాయణ | |
| 70 | 397 | పట్టా | ఖుష్కి | 0.08 | పెరుమాండ్ల సోమయ్య తండ్రి రామస్వామి | |
| 71 | 397 | పట్టా | ఖుష్కి | 0.15 | తోట నరేందర్ తండ్రి సీతారాములు | |
| 72 | 397 | పట్టా | ఖుష్కి | 0.18 | తోట కమలాకర్ తండ్రి రాములు | |
| 73 | 397 | పట్టా | ఖుష్కి | 0.03 | తోట నరేందర్ తండ్రి సీతారాములు<br>తోట కమలాకర్ తండ్రి రాములు<br>తోట కరుణాకర్ తండ్రి సీతారాములు | |
| | | మొత్తం | | 2.09 | | |
| 74 | 396 | పట్టా | ఖుష్కి | 0.12 | తోట సుధాకర్ తండ్రి దామోదర్ | |
| | | మొత్తం | | 0.12 | | |
| 75 | 395 | పట్టా | ఖుష్కి | 0.05 | తోట నరేందర్ తండ్రి సీతా రాములు<br>తోట కమలాకర్ తండ్రి సీతా రాములు<br>తోట కరుణాకర్ తండ్రి సీతా రాములు | |
| 76 | 395 | పట్టా | ఖుష్కి | 0.09 | తోట నరేందర్ తండ్రి సీతారాములు | |
| 77 | 395 | పట్టా | ఖుష్కి | 0.01 | | |
| 78 | 395 | పట్టా | ఖుష్కి | 0.11 | తోట మహేందర్ తండ్రి నారాయణ | |
| | | మొత్తం | | 0.26 | | |
| 79 | 394 | పట్టా | ఖుష్కి | 0.02 | తోట నరేందర్ తండ్రి సీతారాములు<br>తోట కల్యాకర్ తండ్రి సీతారాములు<br>తోట కమలాకర్ తండ్రి సీతారాములు<br>తోట కరుణాకర్ తండ్రి సీతారాములు | |
| 80 | 394 | పట్టా | ఖుష్కి | 0.05 | తోట కమలాకర్ తండ్రి సీతారాములు | |
| 81 | 394 | పట్టా | ఖుష్కి | 0.04 | తోట కరుణాకర్ తండ్రి సీతారాములు | |
| 82 | 394 | పట్టా | ఖుష్కి | 0.15 | గోనెల్ల చక్రపాణి తండ్రి దశరథ | |
| 83 | 394 | పట్టా | ఖుష్కి | 0.01 | తోట కమలాకర్ తండ్రి సీతారాములు | |
| | | మొత్తం | | 0.27 | | |
| 84 | 400 | పట్టా | ఖుష్కి | 0.02 | | |
| | | మొత్తం | | 0.02 | | |
| 85 | 391 | పట్టా | ఖుష్కి | 0.23 | కసోజు గోవర్ధర్ తండ్రి యాదగిరి<br>కసోజు శ్రీనివాస్ తండ్రి యాదగిరి<br>కసోజు కమలాకర్ తండ్రి యాదగిరి | |
| 86 | 391 | పట్టా | ఖుష్కి | 0.01 | కసోజు నాగలక్ష్మి భర్త వెంకన్న | |
| 87 | 391 | పట్టా | ఖుష్కి | 0.06 | కసోజు సోమరాములు తండ్రి నాదం | |
| | | మొత్తం | | 0.30 | | |
| 88 | 390 | పట్టా | ఖుష్కి | 0.06 | | |
| 89 | 390 | పట్టా | ఖుష్కి | 0.23 | | |
| 90 | 390 | పట్టా | ఖుష్కి | 0.06 | | |
| | | మొత్తం | | 0.35 | | |
| 91 | 389 | పట్టా | ఖుష్కి | 0.13 | | |
| 92 | 389 | పట్టా | ఖుష్కి | 0.13 | బెల్లం సరిత భర్త రవీందర్ | |
| | | మొత్తం | | 0.26 | | |
| | | పూర్తి మొత్తం | | 16.15 | | |

**వృక్షములు/నిర్మాణములు**

గ్రామము: మొండ్రాయి మండలం: కొడకండ్ల జిల్లా: జనగాం

| వ. నెం. | సర్వే నెం. | విస్తీర్ణం | ఆసక్తి కలిగియున్న వ్యక్తుల పేరు మరియు చిరునామా | వృక్షములు రకము | సంఖ్య | నిర్మాణములు రకం | సంఖ్య | రిమార్కులు |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1 | 20 | 0.09 | మల్లబోయిన సోమనర్సయ్య తండ్రి బాలయ్య | | | పైప్‌లైన్ | 1 | |
| 2 | 19 | 0.09 | | వేప చెట్టు | 1 | పైప్‌లైన్ | 1 | |
| 3 | 19 | 0.15 | కనుకు షేకర్ తండ్రి సోమయ్య | తాటి చెట్టు | 1 | | 1 | |
| 4 | 19 | 0.06 | పరిపెల్లి మహేష్ తండ్రి అయిలయ్య | | | పైప్‌లైన్ | 1 | |
| 5 | 19 | 0.07 | ననుబాల ఉప్పలయ్య తండ్రి ఎల్లయ్య | తాటి చెట్టు<br>వేప చెట్టు | 1<br>1 | | | |
| 6 | 19 | 0.02 | ననుబాల బాలమల్లు తండ్రి బయ్యాలు | తాటి చెట్టు<br>వేప చెట్టు | 3<br>1 | పైప్‌లైన్ | 1 | |
| 7 | 19 | 0.01 | ననుబాల ఉప్పలయ్య తండ్రి మల్లయ్య | తాటి చెట్టు<br>అల్లనేరేడు చెట్టు<br>జామ చెట్టు<br>టేకు చెట్టు<br>చింత చెట్టు<br>జామాయిల్ చెట్టు<br>వేప చెట్టు | 1<br>1<br>2<br>1<br>1<br>1<br>3 | పైప్‌లైన్ | 2 | |
| 8 | 11 | 0.01 | | | | పైప్‌లైన్ | 1 | |
| 9 | 11 | 0.03 | మిట్ట సోమయ్య తండ్రి కొండయ్య | తాటి చెట్ల | 7 | పైప్‌లైన్ | 1 | |
| 10 | 11 | 0.12 | పోతుగంటి బిక్షం తండ్రి సాయిలు | | | పైప్‌లైన్ | 1 | |
| 11 | 11 | 0.02 | ననుబాల యాకయ్య తండ్రి బాలయ్య | | | పైప్‌లైన్ | 1 | |
| 12 | 12 | 0.05 | ననుబాల యాకయ్య తండ్రి బాలయ్య | | | పైప్‌లైన్ | 1 | |
| 13 | 12 | 0.11 | ననుబాల నాగరాజు తండ్రి కొమురయ్య | తాటి చెట్టు | 1 | పైప్‌లైన్ | 1 | |
| 14 | 12 | 0.01 | ననుబాల నరేశ్ తండ్రి సోమ్మల్లు<br>ననుబాల వెంకన్న తండ్రి సోమ్మల్లు | తుమ్మ చెట్టు<br>వేప చెట్టు<br>నమిలినార చెట్టు | 1<br>1<br>1 | | | |
| 15 | 18 | 0.01 | చేలివేరు వెంకటయ్య తండ్రి అయిలయ్య | వేప చెట్టు | 1 | పైప్‌లైన్ | 1 | |
| 16 | 13 | 0.22 | చేలివేరు పరమేష్ తండ్రి వెంకన్న<br>చేలివేరు ప్రవీణ్ కుమార్ తండ్రి వెంకన్న | వేప చెట్టు<br>సంద్ర చెట్టు | 1<br>1 | పైప్‌లైన్ | 200 మీటర్స్ | |
| 17 | 14 | 0.02 | చేలివేరు పరమేష్ తండ్రి వెంకన్న<br>చేలివేరు ప్రవీణ్ కుమార్ తండ్రి వెంకన్న | వేప చెట్టు | 4 | పైప్‌లైన్ | 1 | |
| 18 | 446 | 0.13 | కొమ్ము మల్లయ్య తండ్రి బాలమల్లు | తుమ్మ చెట్టు | 1 | | | |
| 19 | 446 | 0.02 | కొమ్ము ముత్తయ్య తండ్రి వీరయ్య | | | పైప్‌లైన్ | 1 | |
| 20 | 446 | 0.01 | | | | పైప్‌లైన్ | 1 | |
| 21 | 440 | 0.01 | అయిలబోయిన అంజయ్య తండ్రి శివరాములు | | | బోరు | 1 | |
| 22 | 440 | 0.04 | కొమ్ము ముత్తయ్య తండ్రి వీరయ్య | | | పైప్‌లైన్ | 1 | |
| 23 | 440 | 0.06 | | | | పైప్‌లైన్<br>బోరు | 1<br>1 | |
| 24 | 440 | 0.02 | | | | పైప్‌లైన్ | 1 | |
| 25 | 451 | 0.08 | | | | పైప్‌లైన్ | 1 | |
| 26 | 451 | 0.10 | కొమ్ము అంజయ్య తండ్రి యాదగిరి | | | పైప్‌లైన్<br>బోరు | 1<br>1 | |
| 27 | 451 | 0.09 | | తాటి చెట్టు | 1 | | | |
| 28 | 452 | 0.06 | కొమ్ము యాదగిరి తండ్రి కొమురయ్య | | | పైప్‌లైన్ | 1 | |
| 29 | 428 | 0.01 | | చీమ చింత చెట్టు | 1 | | | |
| 30 | 453 | 1.06 | కోల అంజయ్య తండ్రి సోమయ్య | టేకు చెట్లు<br>వేప చెట్టు<br>తుమ్మ చెట్టు | 75<br>3<br>1 | | | |
| 31 | 414 | 0.06 | ననుబాల వెంకన్న తండ్రి సోమ్మల్లు | తాటి చెట్టు | 1 | | | |
| 32 | 412 | 0.11 | | తుమ్మ చెట్టు | 1 | | | |
| 33 | 412 | 0.03 | | వేప చెట్టు | 1 | | | |
| 34 | 287 | 0.02 | | కొబ్బరి చెట్టు<br>మునగ చెట్టు | 5<br>1 | రేకుల ఇల్లు | 1 | |
| 35 | 288 | 0.30 | కసోజు నాగలక్ష్మి భర్త వెంకన్న<br>వంగరి రాజశేకర్ తండ్రి రాజమౌళి | తాటి చెట్టు | 1 | ఫెన్సింగ్ | 1 | |
| 36 | 397 | 0.10 | పెరుమాండ్ల సోమయ్య తండ్రి రామస్వామి | | | పైప్‌లైన్ | 1 | |
| 37 | 397 | 0.24 | తోట సుధాకర్ తండ్రి దామోదర్ | | | పైప్‌లైన్ | 1 | |
| 38 | 397 | 0.10 | తోట సోమయ్య తండ్రి నారాయణ | టేకు చెట్లు<br>మామిడి చెట్లు<br>తాటి చెట్టు | 30<br>15<br>1 | పైప్‌లైన్ | 1 | |
| 39 | 397 | 0.03 | తోట నరేందర్ తండ్రి సీతారాములు<br>తోట కల్యాకర్ తండ్రి సీతారాములు<br>తోట కమలాకర్ తండ్రి సీతారాములు<br>తోట కరుణాకర్ తండ్రి సీతారాములు | చింత చెట్టు<br>వేప చెట్టు<br>సంద్ర చెట్టు | 2<br>4<br>10 | | | |
| 40 | 395 | 0.05 | తోట నరేందర్ తండ్రి సీతారాములు<br>తోట కల్యాకర్ తండ్రి సీతారాములు<br>తోట కమలాకర్ తండ్రి సీతారాములు<br>తోట కరుణాకర్ తండ్రి సీతారాములు | వేప చెట్టు | 2 | | | |
| 41 | 394 | 0.02 | తోట నరేందర్ తండ్రి సీతారాములు<br>తోట కల్యాకర్ తండ్రి సీతారాములు<br>తోట కమలాకర్ తండ్రి సీతారాములు<br>తోట కరుణాకర్ తండ్రి సీతారాములు | వేప చెట్టు | 4 | | | |
| 42 | 391 | 0.23 | కసోజు గోవర్ధన్ తండ్రి యాదగిరి<br>కసోజు శ్రీనివాస్ తండ్రి యాదగిరి<br>కసోజు కమలాకర్ తండ్రి యాదగిరి | వేప చెట్టు | 1 | | | |
| 43 | 390 | 0.06 | కసోజు సోమరాములు తండ్రి నాదం | తుమ్మ చెట్టు | 1 | | | |
| 44 | 390 | 0.23 | | తాటి చెట్టు | 1 | | | |
| 45 | 389 | 0.13 | బెల్లం సరిత భర్త రవీందర్ | తాటి చెట్టు | 2 | | | |

ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాసం మరియు పునరుద్ధరణ చట్టం, 2013 (నెం. 30/2013) లోని నియమాలలోని సెక్షన్ 11 (1) ప్రకారం సంబంధిత భూ యజమానులకు సరైన భూ నష్టపరిహారం చెల్లించడానికి నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, జనగాం మరియు భూ సేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్, యల్.ఎ. ఆర్ & ఆర్ యూనిట్-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్, జనగాం గారి కార్యాలయంలో ఉంచినది. ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం /జిల్లా కలెక్టర్, జనగాం గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ యల్.ఎ. ఆర్ & ఆర్ యూనిట్-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్, జనగాం గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూ సేకరణకు సంబంధించి సెక్షన్ 12 ప్రకారం పైన తెలిపిన భూములలోని ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టుటకు అనుమంతిచ నైనది.

సెక్షన్ 11(4) భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, జనగాం గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారి చేసిన తేదీ నుండి ఆ ప్రకటనలో ఉపహరించబడిన భూములకు సంబంధించి కొనుగోలు చేసిన అమ్మకం తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు. భూసేకరణ విషయములో సంబంధిత భూ యజమానులకు ఏమైనా అభ్యంతరములున్న యెడల చట్టంలోని 15 విభాగం ప్రకారం జిల్లా కలెక్టర్/భూ సేకరణ అధికారి యల్ ఇ. ఆర్ & ఆర్ యూనిట్-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్, జనగాం గార్లకు ఇట్టి ప్రకటన జారిచేసిన (60) దినముల లోపల వారి అభ్యంతరములు లిఖితపూర్వకంగా తెలియజేయవలసియుంది.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ భూసేకరణ, యల్.ఎ.ఆర్. & ఆర్ యూనిట్-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్ | సం/- అదనపు కలెక్టర్ జనగాం | సం/- జిల్లా కలెక్టర్ జనగాం

DIPR R.O. NO. 462/LA-PP-Advt/PUB/2026-27

## అర్హుల పేర్లు పోకుండా జాగ్రత్త వహించాలి



ప్రజాపక్షం/వర్ధన్నపేట : వర్ధన్నపేట నియోజకవర్గంలోని బిఎల్‌ఏలు, ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులతో పర్వతగిరి మండల కేంద్రంలోని జేఆర్‌అర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సర్ (ఎస్ఐఆర్) సమీక్ష సమావేశంలో వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొని కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.బిఎల్ఏలు పూర్తి సమయాన్ని కేటాయించి ఓటర్ల హక్కులను కాపాడాలనీ పిలుపునిచ్చారు.ఈ ప్రక్రియలో అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చడం, అనర్హులను తొలగించడం, అవసరమైన మార్పులు, చేర్పులు చేపట్టి ఖచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించే దిశగా కృషి చేయాలన్నారు.ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొని ఎన్యూమరేషన్ ఫారం నింపేలా బూత్ ఏజెంట్లు ప్రజలకు అవగాహన కల్పించి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.బూత్ ఏజెంట్లకు సర్ కిట్లను అందజేశారు.అనంతరం పర్వతగిరి మండల అధ్యక్షురాలిగా నూతనంగా ఎన్నికైన ఇస్లావత్ సావిత్రిని ఎమ్మెల్యే నియామక పత్రాన్ని అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి,జిల్లా ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు,పర్వతగిరి సర్పంచ్ శంకర్,సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేశ్వర రావు, ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ గొడుగు బిక్షపతి, చౌటుపల్లి పిఏసిఎస్ చైర్మెన్ గొర్రె దేవేందర్, పర్వతగిరి గ్రామశాఖ అధ్యక్షులు కుసం రామచంద్రు,మండల ముఖ్య నాయకులు,సీనియర్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రవేశ పరీక్షకు 75 మంది హాజరు



ప్రజాపక్షం/భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎంపిక కాబడిన 3 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు కాటారం, చిట్యాల యంగ్ ఇండియా ఇన్సిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష 2026 27 కు 108 మంది దరఖాస్తు చేసుకోగా 75 మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి యం.రాజేందర్ మరియు జిసిడిఓ వి.శైలజ తెలియజేశారు. ఆదివారం రోజు ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నము 01:00 వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు, ప్రతి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 20 మంది విద్యార్థులు చొప్పున మొత్తము 60 సీట్లకు ఈ ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేయనున్నారు. మూడు పరీక్షా కేంద్రాలలో మౌలిక సదుపాయాలు త్రాగునీరు, విద్యుత్తు, వైద్య సదుపాయాల ఏర్పాట్లతోపాటు, పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసు బంధోబస్తు నిర్వహించినట్లు తెలిపారు. ఇట్టి ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక కాబడిన విద్యార్థినులకు జాతీయస్థాయిలో నిర్వహించే వివిధ రకాల పోటీ పరీక్షలకు అనుగుణంగా తర్ఫీదు ఇవ్వనున్నట్లు వారు తెలియజేశారు. పూర్తి రెసిడెన్షియల్ సౌకర్యాలతో పాటుగా నాణ్యమైన విద్యతో, కల్చరల్, స్పోర్ట్స్, ఒకేషనల్, యోగ విద్యా బోధన కూడా జరుగుతుందన్నారు.

## మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధి పనులకు ఎంపి చామల శంకుస్థాపన



ప్రజాపక్షం/జనగామ : జనగామ పట్టణంలోని శ్రీ మల్లికార్జునస్వామి ఆయల అభివృద్ధి పనులకు భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరన్‌కుమార్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ప్రహారిగోడ నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. జనగామ పట్టణంలో జరిగే అభివృద్ధి పనుల్లో తాను పాల్గొనడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు లకావత్ దన్వంతి, జనగామ మున్సిపల్ ఛైర్ పర్సన్ కడకంచి బాలమని శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ దన్వంతి, మున్సిపల్ మాజీ చైర్మన్ వేమళ్ల సత్యానారాయణరెడ్డి, మాజీ వైస్ ఛైర్మన్ కంచె రాములుతో పాటు పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## హ్యామ్‌లో స్టేషన్‌ఘనపూర్‌కు రూ.171.82 కోట్లు మంజూరు: ఎమ్మెల్యే



ప్రజాపక్షం/జనగామ : ఆర్‌అండ్‌బి హ్యామ్ రోడ్ల కోసం స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలోని 8 రోడ్లకు 171.82 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. యాదాద్రి సర్కిల్ ఫేజ్1 రోడ్ల శంకుస్థాపన ఆదివారం జరిగింది. రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆలేరు మండలం వంగపల్లి వద్ద ప్రారంభించగా స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. అనంతరం ఆయన జనగామలో మాట్లాడుతూ హ్యామ్ రోడ్లలో స్టేషన్‌ఘనపూర్‌కు 171.82 కోట్లు మంజూరు కావడం హర్షనీయమన్నారు. ఇందులో 46.03 కోట్లతో చిన్నపెండ్యాల నుండి తరిగొప్పుల వరకు, 13.20 కోట్లతో నెల్లుట్ల నుండి నాంచారి మడూర్ వరకు , 40.77 కోట్లతో స్టేషన్‌ఘనపూర్ నుండి వర్ధన్నపేట వరకు, 16.94 కోట్లతో రఘునాథపల్లి నుండి కంచెనపల్లి వరకు మొత్తం 116.94 కోట్లతో రోడ్ల వెడల్పు , నిర్మాణం జరగనుందన్నారు. మొదటి దశలోనే 171.82 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయన్నారు. త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. స్టేషన్‌ఘనపూర్‌లో రోడ్లను విస్తరించడంతో పాటు ప్రజలకు సౌకర్య వంతంగా ఉండేటట్లు చేస్తామని తెలిపారు.

# ఉమ్మడి వరంగల్ వరప్రదాయిని 'దేవాదుల ఎత్తిపోతలు'

**నేటి నుండి నెల రోజుల వరకు పంపులు ఆగకుండా నడుస్తాయి**

**ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



ప్రజాపక్షం/హనుమకొండ : రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రైతుల పంటలను కాపాడే ప్రయత్నం చేస్తున్నామని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని ధర్మసాగర్ రిజర్వాయర్ లోకి గోదావరి ఎత్తిపోతల పథకం ద్వారా నీటి పంపింగ్‌ను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ అధికారులు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులతో కలిసి గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రస్తుతం గోదావరి నుండి ఎన్ని పంపులు నడుస్తున్నాయి, ఇంకా పంపింగ్ చేయాల్సిన మోటార్లు ఎన్ని, పంపింగ్ చేయడానికి తీసుకోవాల్సిన చర్యలు ఏంటి అనే విషయాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ దేవాదుల ఎత్తిపోతల పథకం ఉమ్మడి వరంగల్ జిల్లా వరప్రదాయినిగా మారిందని తెలిపారు. 2003లో ఉమ్మడి రాష్ట్రంలో నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో నేను నాటిన చిన్న మొక్క నేడు మహా వృక్షంగా ఎదిగి ఉమ్మడి వరంగల్ జిల్లాలో 6లక్షల ఎకరాలకు సాగు నీరు, త్రాగు నీరు అందిస్తోందని కొనియాడారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ప్రారంభించిన నాటి నుండి పూర్తి అయ్యే వరకు ప్రత్యక్ష రాజకీయాలలో ఉండడం అదృష్టంగా భావిస్తున్నానని వెల్లడించారు. తన రాజకీయ జీవితమంలో అత్యంత సంతృప్తి కలిగించింది కూడా దేవాదుల పథకమే అని పేర్కొన్నారు. రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలే వేసుకోవాలని ఒకవేళ వారి సాగు చేయాల్సి వస్తే ఆన్ అండ్ ఆఫ్ పద్ధతి పాటించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులు అర్థం చేసుకొని రైతులు సహకరించాలని కోరారు. దేవాదుల ఎత్తిపోతల పథకం పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని దేవాదుల పంపింగ్ ను నిరంతరం సమీక్షిస్తున్నారని తెలిపారు. నేటి నుండి నెల రోజుల పాటు నిరంతరాయంగా దేవాదుల లోని అన్ని ఫెజ్ ల ద్వారా పంపింగ్ జరుగుతుందని అన్నారు. ఈ నెల రోజులలో ధర్మసాగర్, స్టేషన్ ఘనపూర్, నవాబ్ పేట, అశ్వరావు పల్లి, చిటకోడూరు, బొమ్మకూరు రిజర్వాయర్లు నింపే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు. రైతులు పంట సాగు చేసుకోవడానికి 15రోజులలో కాలువల ద్వారా సాగు నీరు విడుదల చేస్తామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పంపింగ్ ద్వారా ఉమ్మడి జిల్లాలో 3లక్షల ఎకరాలకు సాగు నీరు ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వానికి, నీటి పారుదల శాఖ అధికారులకు రైతులు సహకరించాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఈ సుధీర్, ఎస్ఈ సీతారాం, జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నీటి పారుదల శాఖ అధికారులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 'సర్' ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి: కలెక్టర్



ప్రజాపక్షం/వరంగల్: వరంగల్ జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు. బీఎల్‌వోలు ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, ధృవీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలోని నర్సంపేట, వరంగల్ ఈస్ట్, వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 7,76,953 మంది ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ దాదాపు 100 శాతం పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు 2,99,149 ఫారాలు (38.50 శాతం) డిజిటలైజేషన్ పూర్తికాగా, మిగిలిన ఫారాలను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నర్సంపేట నియోజకవర్గంలో 54.23 శాతం, వరంగల్ ఈస్ట్‌లో 26.25 శాతం, వర్ధన్నపేటలో 36.37 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించుటకు వివిధ మండలాల ప్రత్యేక అధికారులకు ఎస్ఐఆర్ నిర్వహణపై పర్యవేక్షణ అధికారులుగా బాధ్యతలు అప్పగించినట్లు వారు పేర్కొన్నారు. జిల్లాలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడానికి అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## కాంగ్రెస్ విజయానికి కార్యకర్తలు సమష్టిగా కృషి

**మంత్రి కొండా సురేఖ సమక్షంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మీసాల ప్రకాష్**



ప్రజాపక్షం/ఖిలా వరంగల్: వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మీసాల ప్రకాష్ ఆదివారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. వరంగల్ సిటీ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేసిన మీసాల ప్రకాష్ ఈ బాధ్యత దక్కడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ విజయానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం కమ్యూనిటీ హాళ్లు, స్మశానవాటికల ప్రహారీలు, అండర్ డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి తెలిపారు. ప్రజల నుండి వచ్చే వినతులు, ఫిర్యాదులను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొండా మురళీధర్‌రావు నాయకత్వంలో వరంగల్ తూర్పును ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడంలో మీసాల ప్రకాష్ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

**వరంగల్ క్లబ్ ఈసి సభ్యుడు పల్లం రవికి సన్మానం**

వరంగల్ క్లబ్ కార్యవర్గ(ఈసి) సభ్యునిగా ఎన్నికైన మాజీ కార్పొరేటర్ పల్లం రవిని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సన్మానించారు. వరంగల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజాసేవలో పల్లం రవి చూపుతున్న నిబద్ధత అభినందనీయమన్నారు. వరంగల్ క్లబ్ అభివృద్ధితో పాటు సభ్యుల సంక్షేమానికి ఆయన సమర్థవంతంగా సేవలందిస్తారనే విశ్వాసం వ్యక్తం చేశారు. పల్లం రవి మాట్లాడుతూ తనను గెలిపించిన వరంగల్ క్లబ్ సభ్యులందరికి కృతజ్ఞతలు తెలిపారు. తన విజయాన్ని అభినందించిన మంత్రి కొండా సురేఖకు ధన్యవాదాలు తెలిపారు. సభ్యుల ఆశయాలకు అనుగుణంగా పారదర్శకంగా పనిచేస్తూ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, వరంగల్ క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం

**1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతీ చిన్నారి 'ఆల్బెండజోల్' మాత్ర తీసుకోవాలి**

**కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**



ప్రజాపక్షం/హనుమకొండ: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జూలై 13 (సోమవారం) జిల్లావ్యాప్తంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి సంబంధించి వైద్య, విద్య, మహిళా, శిశు సంక్షేమ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి అవసరమైన సూచనలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మొత్తం 2,08,441 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 1–2 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు అర మాత్ర, 2 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల వారికి ఒక పూర్తి మాత్ర అందజేయనున్నట్లు తెలిపారు. ఆల్బెండజోల్ మాత్రలు పూర్తిగా సురక్షితమైనవని, వాటివల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని స్పష్టం చేశారు. పిల్లలను నులి పురుగుల బారిన పడకుండా కాపాడేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.నులి పురుగుల సంక్రమణ వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, మలబద్ధకం, వాంతులు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలోని 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారి ఆల్బెండజోల్ మాత్రను తప్పనిసరిగా తీసుకునేలా తల్లిదండ్రులు సహకరించి, జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ విజ్ఞప్తి చేశారు.

## 'నేడు' భూపాలపల్లిలో సింగరేణి భరోసా యాత్ర

**హాజరు కానున్న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి**

ప్రజాపక్షం/భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ రావు మండలం లోని ఓసి 2 సింగరేణి కి కేంద్రం ప్రభుత్వం కేటాయించిన సందర్భంగా నేడు భూపాలపల్లి లో సింగరేణి భరోసా యాత్ర లో భాగంగా నేడు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నరపరాజు రామచంద్రరావు తో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందు పట్ల కీర్తి రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఏ నిశిధర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో ని విల్ కన్వెన్షన్ హాల్, గొర్లవీడు రోడ్డు లో నిర్వహించే సింగరేణి భరోసాను పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. జిల్లాలోని రాష్ట్ర,జిల్లా, మండల, మోర్చా అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, శక్తి కేంద్రాల ఇంచార్జీలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## పేదల సొంతింటి కలకు ఊతమిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు



ప్రజాపక్షం/ములుగు: సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు పథకం ములుగు జిల్లాలో పురోగతి సాధిస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో గృహ రహిత పేద కుటుంబాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాన్ని కొనసాగిస్తోంది. జిల్లా అధికారుల వివరాల ప్రకారం, తొలి విడతలో జిల్లాకు 5వేలకు పైగా ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో ఇప్పటికే 1315 మంది లబ్దిదారులు గృహ ప్రవేశాలు పూర్తి చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గృహ సదుపాయం కల్పించడంపై రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు అర్హులైన కుటుంబాలను గుర్తిస్తూ గృహాల మంజూరు ప్రక్రియ కొనసాగుతోంది. రాఘవపట్నం గ్రామ పంచాయతీ పరిధిలోని ఇప్పలగడ్డను పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. అక్కడ 90 మంది గిరిజన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించారు. నిర్మాణంలో ఉన్న గృహ సముదాయానికి స్థానికులు సీతక్క కాలనీగా పేరు పెట్టుకున్నారు. జంపన్నవాగు వరదల ప్రభావానికి గురయ్యే కొండాయి గ్రామంలోని కుటుంబాలకు సురక్షిత ప్రాంతాల్లో ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రమాదకర ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలకు శాశ్వత నివాసం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది.తొలి విడత పనులు కొనసాగుతుండగానే రెండవ విడతకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. జిల్లాలో మరో 3430 గృహరహిత కుటుంబాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అర్హత నిర్ధారణ అనంతరం వీరికి కూడా ఇళ్ల మంజూరు ప్రక్రియ చేపట్టనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల అమలుపై తరచూ సమీక్షలు నిర్వహిస్తూ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలోని ప్రతి అర్హ పేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నట్లు వెల్లడించారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూశాం. ఇప్పుడు ప్రభుత్వ ఇళ్లు మంజూరు చేయడంతో కుటుంబంతో కలిసి సురక్షితంగా జీవిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇంటితో ఇప్పుడు మా కుటుంబానికి భద్రత, పిల్లల భవిష్యత్తుపై నమ్మకం పెరిగిందని తెలిపారు.

## నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

**కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

ప్రజాపక్షం/ములుగు: ములుగు కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని దేవాదుల ప్రాజెక్టు సందర్శించనున్న నేపథ్యంలో అధికారులు మంత్రుల పర్యటన సమావేశానికి హాజరు కావాల్సి ఉంటుందని, సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి వినతులను స్వీకరించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం రద్దయిన విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు. సోమవారం యధావిధిగా ప్రజావాణి కా ర్యక్రమం ఉంటుందని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

## కోడి చెరువు ప్రాంతంలో చిరుత ఆనవాళ్లు

**రైతుల్లో ఆందోళన**

**అడుగుల ముద్రలతో కలకలం**



ప్రజాపక్షం/గూడూరు:మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్ర సమీపంలోని కోడి చెరువు ప్రాంతంలో చిరుతపులి సంచరించినట్లు అనుమానాలు వ్యక్తమవడంతో స్థానిక రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల ఈ ప్రాంతంలో గుర్తు తెలియని జంతువు కదలికలు అనంతరం కనిపించిన అడుగులు ముద్రలు కలకలం రేపుతున్నాయి. వెంటనే అటవీశాఖ అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించి అవి నిజంగా చిరుతపులి అడుగులేనా లేదా ఇతర అటవి జంతువుల ఆనవాళ్లా అనే విషయాన్ని నిర్ధారించాలని రైతులు కోరుతున్నారు. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం గత శనివారం సాయంత్రం 7 నుంచి 8 గంటల మధ్య ఓ రైతు తన వ్యవసాయ క్షేత్రం వైపు వెళ్లాడు ఈ క్రమంలో పక్కనే ఏపుగా పెరిగిన జీలుగు మొక్కల మధ్య నుంచి భారీ శబ్దం వినిపించడంతో పాటు ఏదో పెద్ద జంతువు వేగంగా కదలినట్లు





గుర్తించాడు అదే సమయంలో ఆప్రాంతంలోని పక్షులు ఒక్కసారిగా గట్టిగా అరుస్తూ చెట్లపై నుంచి ఎగిరిపోవడంతో పరిస్థితి మరింత అనుమానాస్పదంగా మారింది. దీంతో భయాందోళనకు గురైన రైతు వెంటనే అక్కడి నుంచి ఇంటికీ చేరుకుని గ్రామస్థులకు విషయం తెలియజేశాడు. ఆదివారం ఉదయం మరికొంతమంది రైతులతో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా తడి నేలపై పెద్ద పరిమాణంలో అడుగుల ముద్రలు కనిపించాయి. వాటిని పరిశీలించిన అనుభవం ఉన్న రైతు ఇవి చిరుతపులి అడుగులు అయ్యి ఉండవచ్చని అభిప్రాయం వ్యక్తం చేయడంతో రైతుల్లో భయం మరింత పెరిగింది. అటవీశాఖ అధికారులు వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించి అవసరమైతే కెమెరా ట్రాపులు ఏర్పాటు చేసి వాస్తవ పరిస్థితి వెల్లడించాలని వారు కోరుతున్నారు. స్పష్టత వస్తే ప్రజల్లో నెలకొన్న భయాందోళనలు తొలిగిపోతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు.

**పులికి హాని కలిగించొద్దు...**

గూడూరు రేంజ్ అటవీ అధికారి ప్రసాద్ రావు మాట్లాడుతూ గూడూరు రేంజ్ పరిధిలో చిరుత ఆనవాళ్లు కనిపించాయనే సమాచారం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి అవి నిజంగా చిరుతపులి అడుగులా లేదా విషయాన్ని నిర్ధారిస్తామని చెప్పారు. ఒకవేళ అవి చిరుతపులి ఆనవాళ్లేనని తేలినా ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. అడవి జంతువులకు ఎలాంటి హాని కలిగించరాదని అలా చేసిన వారిపై అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం చిరుత అడవి ప్రాంతంలోకి వెళ్లి ఉండే అవకాశమూ ఉందని కాబట్టి ఎలాంటి పుకార్లను నమ్మకుండా అప్రమత్తంగా ఉంటూ అధికారులకు సహకరించాలని రేంజ్ ఆఫీసర్ ప్రసాద్ రావు విజ్ఞప్తి చేశారు.

## విద్యకు చేయూతే ట్రస్ట్ లక్ష్యం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రతిభ గల విద్యార్థుల విద్యాభ్యాసానికి చేయూతనివ్వడమే పరిత సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని ట్రస్ట్ చైర్మన్ పరిత పుల్లయ్య తెలిపారు. విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ట్రస్ట్ కృషి చేస్తుందని పుల్లయ్య తెలిపారు. ఖమ్మం నగరానికి చెందిన ఆకుల నూహిత సాయి బియస్సి నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతుంది. నూహిత సాయి తల్లి అనురాధ ఇండ్లలో పనిచేసుకుంటూ కుమార్తెను చదివిస్తుంది. ఉన్నత విద్యాభ్యాసం కోసం ఆర్థిక సహాయం అందించాలని ట్రస్ట్‌ను సంప్రదించినట్లు పుల్లయ్య తెలిపారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో ఆకుల నూహిత సాయి విద్యాభ్యాసం కోసం రూ. 20వేలు ఆర్థిక సహాయాన్ని ట్రస్ట్ ఆధ్వర్యంలో కుంచకూరి సతీష్, ఝాన్సీ దంపతుల సౌజన్యంతో అందజేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కుంచకూరి సతీష్, ఝాన్సీ కుమారి, పోష్య సాయి, విశ్రాంత ఉపాధ్యాయులు అబ్దుల్ షరీఫ్, విద్యార్థిని తల్లి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## 26న జిపి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ




**ప్రజాపక్షం/రఘునాథపాలెం:** గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘం (ఎఐటియుసి) రాష్ట్ర మూడవ మహాసభ ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు జిపి వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య తెలిపారు. గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘం మండల జనరల్ బాడీ సమావేశం బానోత్ మంగీలాల్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య, జిల్లా నాయకులు గుగులోత్ రాందాస్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిట్టల మల్లయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రతి నెల గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులకు ఒకటిన వేతనాలు చెల్లించాలని ఆదేశాలు ఇచ్చినా క్రింది స్థాయి అధికారులు చెల్లించడం లేదన్నారు. ఇట్టి విషయాన్ని డిపివో, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. రాష్ట్ర మహాసభలలో సమస్యలపై చర్చించి తీర్మానాలు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 26న రాష్ట్ర మూడవ మహాసభ గణేష్ గార్డెన్‌లో జరుగుతుందని గ్రామ పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శి బానోత్ మంగీలాల్, మేళ్లచెరువు రాజగోపాల్, మండల నాయకులు పెనుగురి సీతారాములు, బొంత రేణుక, విజయలక్ష్మి , కళావతి, వీరయ్య, కృష్ణ, సర్దార్, లాలు, సైదులు, కోటేశ్వరరావు, వస్త్రం, బాబు పాల్గొన్నారు.

## చలో కొత్తగూడెం పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ ఖమ్మంఅర్బన్:** లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌ఎస్) నంగారా భేరీ ఆధ్వర్యంలో ఆగస్టు తొమ్మిదిన కొత్తగూడెంలో నిర్వహించే ప్రపంచ ఆదివాసీ (గిరిజన) దినోత్సవ సభ పోస్టర్‌ను ఆదివారం మండల పరిధిలోని చెరువుకొమ్ముతండాలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ నాయక్ మాట్లాడుతూ గిరిజన ఆదివాసీల హక్కుల సాధనే లక్ష్యంగా సభ జరుగుతుందని తెలిపారు. ఈ సభలో గిరిజన రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, రిజర్వేషన్ల పరిరక్షణ, జల్ జంగాల్ జమీన్ పై ఆదివాసీల హక్కులు, అటవీ హక్కుల చట్టం అమలు, విద్యా, ఉపాధి, ఆరోగ్యం, గృహం, సాగు, జీవనోపాధి, గిరిజన సంస్కృతి, భాషా సాంప్రదాయాల పరిరక్షణ, యువతకు ఉపాధి అవకాశాలు, గిరిజన మహిళా సాధికారత పై చర్చించడం జరుగుతుందన్నారు. రిజర్వేషన్లతో పాటు పలు సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఆగస్టు 9న ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగే ప్రపంచ ఆదివాసీల (గిరిజన) దినోత్సవ సభలో గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కృష్ణానాయక్, జిల్లా అధ్యక్షులు నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు జంపానాయక్, బిసి నాయకులు బీరప్ప, నాగేశ్వరరావు నాయక్, ఉప సర్పంచ్ వెంకన్న, బాలు నాయక్, మల్లేష్, ఈశ్వర్, సాయి, హర్ష పాల్గొన్నారు.

## నిధి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ శిక్షణా సెంటర్ ప్రారంభం



**ప్రజాపక్షం/ ఖమ్మంఅర్బన్:** ఖమ్మం నగరంలోని టిటిడిసి ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన నిధి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆదివారం ఛైర్మన్ అండ్ ఫౌండర్ రామోజీ ఉప్పలచారి కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది నిరుద్యోగులను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా తీర్చిదిద్దిన తమ సంస్థ నూతనంగా టిటిడి ఎదురుగా నూతనంగా సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడేందుకు అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ నాలెడ్జ్, ఆధునీక సాంకేతిక నైపుణ్యాలను అందిస్తూ ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడేలా కృషి చేస్తామన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా మెరుగైన శిక్షణ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల నిర్వాహకులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## రోస్టర్ విధానంలో...
# మాలలకు తీవ్ర అన్యాయం

మంత్రి వివేక్ వెంకటస్వామి




**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:** రోస్టర విధానం కారణంగా మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, బొగ్గు గనుల శాఖా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం భద్రాచలం పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావుతో కలిసి శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం చర్లరోడ్‌లోని గిరిజన భవన్‌లో ఎస్‌సి వర్గీకరణ రోస్టర్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ నిర్వహించిన మాలల మహార్యాలీ, బహిరంగ సభలో మంత్రి పాల్గొని మాట్లాడారు. రోస్టర్‌లో జరుగుతున్న అన్యాయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినట్లు చెప్పారు. సిఎం ఆదేశాల మేరకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో క్యాబినేట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జరిగే క్యాబినేట్ సబ్ కమిటీ సమావేశంలో మాలలకు జరుగుతున్న అన్యాయంపై చర్చిస్తామన్నారు. గ్రూప్ 3 నియామకాల్లో మాలలకు 5 శాతం రిజర్వేషన్ ఉన్నప్పటికీ రోస్టర విధానం ప్రకారం కేవలం 2.8 శాతం మాత్రమే కేటాయిస్తున్నారు. దీంతో ప్రభుత్వం విడుదల చేసిన 100 ఉద్యోగాల్లో మాలలకు రావాల్సిన ఉద్యోగాలు దక్కడం లేదన్నారు. మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈవిషయంపై సామాజిక సంక్షేమశాఖ మంత్రి అట్లూరి లక్ష్మణరావు, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతో కూడా చర్చించామని తెలిపారు. అనంతరం ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో మంత్రి సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బుడగం శ్రీనివాస్, రత్నం రమాకాంత్, కొండిశెట్టి కృష్ణమూర్తి, చింతిర్యాల రవికుమార్, రాజీవ్, రాము, వెంకటరెడ్డి, తిరుపతిరావు, సుధాకర్, దుర్గారావు, రామకృష్ణ, బషీర్, శ్రీను విజయ్, భాను, రాజేష్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కెఎల్ఆర్ వర్ధంతి వేడుకలు



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఏజెన్సీ ప్రాంతంలో విద్యా వ్యాప్తికి కే. లక్ష్మారెడ్డి చేసిన కృషి మరువలేనిదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా అన్నారు. కేఎల్ఆర్ విద్యా సంస్థల అధినేత, ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు కాటిరెడ్డి లక్ష్మారెడ్డి 15వ, వర్ధంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మాడ్ గణేష్‌తో కలిసి స్థానిక కేఎల్ఆర్ ఘాట్ లక్ష్మారెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జరిగిన వర్ధంతి సభలో సాబీర్‌పాషా మాట్లాడుతూ కొత్తగూడెం, పాల్వంచ ఏజెన్సీ ప్రాంతంలో విద్యా వ్యాప్తికి లక్ష్మారెడ్డి చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. మొదటి నుండి పోరాట పటిమ కలిగిన వ్యక్తిగా, విద్యార్థి నాయకుడిగా, పేద విద్యార్థుల సమస్యలు తెలిసిన వ్యక్తిగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో అనేక విద్యా సంస్థలను స్థాపించి పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందజేసిన లక్ష్మారెడ్డి సేవలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. పేద వర్గాల కష్టాలు తెలిసిన మహోన్నత వ్యక్తి లక్ష్మారెడ్డి ఎందరో పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపి వారికి ఉజ్వల భవిష్యత్‌ను అందించారని చెప్పారు.

## మాటిస్తే మడమ తిప్పని కూనంనేని

• పాల్వంచలో వేగంగా సాగుతున్న రోడ్లు, డ్రైన్లు • హర్షం వ్యక్తం చేస్తున్న పాల్వంచ వాసులు





**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:** పాల్వంచ పట్టణ ప్రజల దశాబ్దాల నాటి కష్టాలను ఇబ్బందులను స్వయంగా గుర్తించిన కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ధ్యేయంగా ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా పాల్వంచలోని పోలీస్ పెట్రోల్ బంక్ నుండి మణికంఠ బుక్ షాపు వరకు సుమారు 300 మీటర్ల వరకు అధ్వాన్నంగా మారిన రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనుల కోసం రూ. 38 లక్షల భారీ డిఎంఎఫ్‌టి నిధులను ఆయన ప్రత్యేకంగా మంజూరు చేశారు. నిధుల మంజూరు ప్రక్రియ నుండి పనుల రూపకల్పన వరకు ప్రతి దశలోనూ ఎంఎల్‌ఏ స్వయంగా పర్యవేక్షించి ప్రజల ఇబ్బందులను తొలగించడమే లక్ష్యంగా ముందడుగు వేశారు. సాంకేతిక కారణాల వల్ల పనుల ప్రారంభంలో కొంత జాప్యం జరిగినప్పటికీ అధికారులతో నిరంతరం సమీక్షలు జరిపి పనులను పట్టాలెక్కించారు. ఎంఎల్‌ఏ కూనంనేని చిత్తశుద్ధితో పనులు శరవేగంగా సాగుతున్నాయి. పనులను అతిత్వరలో పూర్తి చేయించి అందుబాటులోనికి తేనున్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూనంనేని చేస్తున్న కృషి, పట్టుదలతో సాధిస్తున్న అభివృద్ధి ఇక్కడ జరుగుతున్న పనులే నిదర్శనం. పనులను వేగంగా పూర్తి చేసి ప్రజల కష్టాలను శాశ్వతంగా తీర్చిడమే ధ్యేయ్యంగా సాగుతున్న పనులపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సమితి సింగారం అభివృద్ధికి శ్రీకారం

రూ.25 లక్షల సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పాయం శంకుస్థాపన



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలంలోని సమితి సింగారం గ్రామపంచాయతీ అంబేద్కర్ సెంటర్‌లో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టనున్న సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు ఆదివారం పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రూ.25 లక్షలతో చేపట్టనున్న సైడ్ డ్రైన్ నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం వర్షపు నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురా లు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు స భ్యులు, మండల ముఖ్య నాయకులు, మహిళా నా యకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## యువతను విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ

**ప్రజాపక్షం/కొణిజర్ల :** ప్రపంచదేశాల్లో ఎక్కడాలేని విధంగా భారతదేశంలో అత్యధికంగా 60 శాతం యువత ఉందని అలాంటి యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ ఆరోపించారు. అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మండల మహాసభ మండల పరిదిలోని తనికెళ్లలో యాసా లక్ష్మీ నరసింహారావు(పెద్దబ్బాయి) భవన ప్రాంగణంలో ఆదివారం నరేష్, కరుణాకర్, కౌశిక్ అధ్యక్షతన జరిగింది. తొలుత సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యర్రా బాబు, జిల్లా నాయకులు దొండపాటి రమేష్ సంఘం జెండాను ఆవిష్కరించారు18 ఏళ్లకే ఓటుహక్కు కావాలని చంద్ర రాజేశ్వరరావు ఆధ్వర్యంలో పోరాడి యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు సాధించిన ఘనత ఏఐవైఎఫ్ కే దక్కుతుందని స్పష్టంచేశారు. భద్రాచలంలో బీడి ఫ్యాక్టరీ, పాల్వంచలో ఎరువుల కర్మాగారం, బయ్యారంలో ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటు చేసి ఉంటే యువతకు ఉద్యోగాలు దక్కేయని అన్నారు. అనంతరం ఏఐవైఫ్ మండల అధ్యక్షుడిగా కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా తుప్పతి కౌశిక్, కోశాధికారిగా మాదుగ కిరణ్‌తోపాటు సహాయ కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, 15 మంది ఆఫీస్ బేరర్స్ తోపాటు 25 కమిటీ సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు, సిపిఐ తనికెళ్ల గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, స్వర్ణ రమేష్, పాపగంటి సుదర్శన్, లేడిబోయిన గోపాల్‌రావు, మాచర్ల నాగభూషణం, మేకల మల్లిఖార్జున్, ఏఐవైఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై యువత పోరాడాలి

ఎఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై యువత పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం గ్రామంలో ఏఐవైఎఫ్ మండల మహాసభ బానోత్ రవి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో ముఖ్య అతిథిగా ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పనలో పాలకులు నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తున్నారన్నారు. ప్రపంచ దేశాల్లో ఎక్కడలేనివిధంగా భారతదేశంలో అత్యధికంగా 60 శాతం యువశక్తి ఉందన్నారు. అటువంటి యువశక్తిని సద్వినియోగం చేసుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంట్ సాక్షిగా ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి హామీ ఇచ్చి నేటికీ ఆ హామీని నెరవేర్చలేదన్నారు. తెలంగాణలో గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కానీ లక్షలాది ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి వాటిని అమలు చేయలేదన్నారు. కేవలం పోలీస్ శాఖలో తప్ప ఏ శాఖలోనూ నోటిఫికేషన్లు జారీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖల్లో కేవలం ఉద్యోగ విరమణలు తప్ప నూతన నియామకాలు జరగడం లేదని ఎద్దేవా చేశారు. యువతను కేవలం ఓటు బ్యాంకు, రాజకీయాల కోసం వాడుకుంటున్నారన్నారు. నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు లేక నిరాశకు లోనై చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారన్నారు. పాలకుల వ్యతిరేక విధానాలపై యువత పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రావణ్, గిరిజన సమాఖ్య జిల్లా సమితి సభ్యులు బానోత్ నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు నాదెండ్ల పుల్లయ్య, సీనియర్ నాయకులు బోడా చిన్నా నాయక్, కిరణ్, రావెళ్ల సురేష్, బానోత్ రవి, గుగులోత్ హరి, యువకులు పాల్గొన్నారు.

**ఏఐవైఎఫ్ మండల కమిటీ ఎన్నిక :**
ఏఐవైఎఫ్ రఘునాథపాలెం మండల నూతన కమిటీని 16 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా కుంచా గోపిచంద్, అధ్యక్షులుగా గుండ్ల అశోక్, వర్కింగ్ కార్యదర్శిగా బానోత్ పవన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాజేష్ లతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## టిజిఒ అధ్యక్షుడిని కలిసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** టిజిఒ రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ ఎంప్లాయిస్ జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావును నూతనంగా ఏర్పాటైన ఖమ్మం జిల్లా ఔట్ సోర్సింగ్ ఉ ద్యోగుల జెఎసి ప్రతినిధులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఏలూరి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. పలు కీలక అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రంలో పని చేస్తున్న వేలాది మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించిన ఏజెన్సీలో భారీ స్థాయిలో అక్రమాలు జరుగుతున్నాయని ప్రభుత్వ ం గుర్తించిన చర్యలు తీసుకోకుండా ఏజెన్సీల కొనసాగింపు ఉత్తర్వులు ఇస్తున్నారని ఆ వ్యవస్థను రద్దు చేసి ఉద్యోగుల జీతాలను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా చూడాలన్నారు. ప్రసూతి సెలవులపై వెళ్లే మహిళా ఉద్యోగులకు జీ తం లేకుండా సెలవులు మంజూరు చేస్తూ వారి స్థానాల్లో కొత్త నియామకాలు చేపట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. వివిధ శాఖల్లో, ప్రాంతాల్లో భిన్నమైన వేతనాలు చెల్లిస్తున్నారన్నారు.

## వైరా రిజర్వాయర్‌కు 550 క్యూసెక్కుల గోదావరి జలాలు విడుదల

ప్రవాహానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



**ప్రజాపక్షం/వైరా:** ఏన్కూరు మండలం తిమ్మారావుపేట గ్రామ సమీపంలోని సాగర్ కాల్వ ఎస్కేప్ లాకులను ఎత్తి వైరా రిజర్వాయర్‌కు 550 క్యూసెక్కుల గోదావరి జలాలను ఆదివారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, ఖమ్మం జిల్లా సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి గంగమ్మకు హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మాట్లాడుతూ వైరా నియోజకవర్గ రైతులకు ప్రతి ఏడాది సాగునీటి సమస్య తలెత్తుతుండటంతో సకాలంలో నీరు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.100కోట్ల వ్యయంతో సీతారామ ప్రాజెక్టు పరిధిలో రాజీవ్ లింక్ కెనాల్ నిర్మాణాన్ని చేపట్టిందన్నారు. గోదావరి జలాలను సాగర్ కాల్వలోకి తరలించి అక్కడి నుంచి అనుసంధాన వాగుల ద్వారా వైరా రిజర్వాయర్‌కు చేరవేస్తున్నట్లు తెలిపారు. దీంతో వైరా ఆయకట్టు రైతులకు సంవృద్ధిగా సాగునీరు అందడంతో రెండు పంటలు సాగు చేసే అవకాశం కలుగుతుందని, భవిష్యత్తులో సాగునీటి కొరత సమస్య ఉండదని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగు నీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చ్యలు చేపట్టిందనానరు. గోదావరి జలాల తరలింపుతో వేలాది ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు. గోదావరి జలాల విడుదల సందర్భంగా పెద్ద సంఖ్యలో రైతులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారావు, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, తాటిపూడి సర్పంచ్ జవ్వాజి అశ్విని, శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, పమ్మి అశోక్, ఫణితి సైదులు, వుంద్రు శ్యామ్‌బాబు, శీలం చంద్రశేఖర్ రెడ్డి, వీరంశెట్టి సీతారాములు, తేలూరి వీరయ్య, తాతా నిర్మల, ఫణితి శ్రీను, ఐవి నాగేశ్వరరావు, వేములు రత్నాకర్, తోటకూర శ్రీకాంత్, ధర్మారావు, ప్రతిభా భారతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలన చెత్త సినిమాలా మారింది

కాళేశ్వరం, రైతు సమస్యలు, సింగరేణి,
ఎన్నికల హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు




**ప్రజాపక్షం/అశ్వాపురం:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను పూర్తిగా విస్మరించి దిశాహీన పాలన సాగిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి కంటే వివాదాల వైపు నడిపిస్తోందని మాజీ మంత్రి పువ్వాల అజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. అశ్వాపురంలో నూతనంగా ప్రారంభమైన బీఆర్ఎస్ మండల కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎంఎల్‌ఏ రేగా కాంతారావుతో కలిసి ఆయన ప్రభుత్వ విధానాలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడి తప్పిందని, రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం దురదృష్టకరమని పువ్వాడ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రభుత్వం కావాలనే అపోహలు సృష్టిస్తోందని పువ్వాడ ఆరోపించారు. రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం సమర్పించిన నివేదిక ప్రకారం మేడిగడ్డ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని చెప్పినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద సరిపడా నీటి మట్టం ఉన్నప్పటికీ, రోజుకు రెండు టీఎంసీల చొప్పున నీటిని ఎత్తిపోసి గోదావరి బేసిన్‌లోని రిజర్వాయర్లను నింపే అవకాశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వదులుకుంటోందని విమర్శించారు. భద్రాచలం ముంపుకు కాళేశ్వరం కారణమనే ప్రచారం పూర్తిగా అసత్యమని, పోలవరం ప్రాజెక్టు ప్రభావమే భవిష్యత్తులో పెద్ద సవాలుగా మారుతు ందని అన్నారు.

**ప్రజా సమస్యలపై పోరాటం మరింత ఉధృతం:రేగా కాంతారావు**

ఈసందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంఎల్‌ఏ రేగా కాంతారావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అన్ని వేదికల్లో నిలదీస్తామని అన్నారు. పినపాక నియోజకవర్గ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, రైతుల సమస్యలు, సింగరేణి కార్మికుల హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం ప్రజల మధ్య ఉంటుందని స్పష్టం చేశారు.

# పురుగుల అన్నం..పుచ్చిపోయిన కూర'గాయాలు'!

● విద్యార్థినుల ప్రాణాలతో చెలగాటం మెట్‌పల్లి సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో నాసిరకం భోజనంపై తీవ్ర ఆందోళన ● జరగరాని ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?


**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు పురుగులు పట్టిన బియ్యం, పాడైపోయిన కూరగాయలతో భోజనం అందిస్తున్నారనే ఆరోపణలు వెలుగులోకి రావడంతో శనివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నాసిరకం ఆహారం తీసుకోవడంతో కొందరు విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు సమాచారం. ఈ ఘటనతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకుని నిరసనకు దిగారు.

**తింటే తినండి... లేకపోతే వదిలేయండి :** పాత్రికేయులు విద్యార్థినులతో మాట్లాడగా, రోజూ అన్నంలో పురుగులు వస్తున్నాయని, తాగునీటిలో కూడా పురుగులు కనిపిస్తున్నాయని వారు ఆర్గోపించారు. ఈ విషయాన్ని వార్డెన్ దృష్టికి తీసుకెళితే, తింటే తినండి... లేకపోతే వదిలేయండి..,మళ్లీ ఇలాంటి ఫిర్యాదులు చేస్తే గుణపాఠం చెబుతాం అంటూ భోజనం వడ్డించే సిబ్బంది బెదిరించినట్లు విద్యార్థినులు తెలిపారు.

**తల్లిదండ్రులకు, పాత్రికేయులకు నిర్లక్ష్య సమాధానం :** విద్యార్థినులు ఈ విషయాన్ని తమ తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు పాఠశాలకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి. మాధురిని వివరణ కోరేందుకు వెళ్లిన పాత్రికేయులతో ఆమె తొలుత దురుసుగా ప్రవర్తించినట్లు, తల్లిదండ్రులతో కూడా నిర్లక్ష్యంగా మాట్లాడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.విషయాన్ని వెంటనే మెట్‌పల్లి ఎంఈఓ కనకతార, మెట్‌పల్లి ఎమ్మార్వో నీత, ఆర్‌ఐ కాంతయ్య దృష్టికి తీసుకెళ్లగా వారు పాఠశాలను సందర్శించి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నుంచి వివరణ తీసుకున్నారు. విద్యార్థినులు, తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని, సమగ్ర విచారణ చేపడతామని హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులుఆందోళనను విరమించారు.

**ముందే హెచ్చరించినా మారని నిర్లక్ష్యం :** ఇదిలా ఉండగా, విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న మెట్‌పల్లి ఎంపీడీవో మహేందర్ రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ అంజిత్ రెడ్డి నాలుగు రోజుల క్రితమే పాఠశాలను సందర్శించి వార్డెన్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు పలు సూచనలు చేసినట్లు తెలిసింది. అయినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించకపోవడంతో వార్డెన్, కాంట్రాక్టర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి :** విద్యార్థినుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌పై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, సంబంధిత కాంట్రాక్టర్‌ను మార్చి నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.జగిత్యాల జిల్లా కలెక్టర్ స్వయంగా ఆకస్మిక తనిఖీ నిర్వహించి పాఠశాలలోని పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని




వారు కోరుతున్నారు.జరగరాని ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? ఇలాంటి నిర్లక్ష్యం వల్ల ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే దానికి బాధ్యత ,,ఎవరు వహిస్తారు? ప్రాణాలు పోతే తిరిగి వస్తాయా? అంటూ తల్లిదండ్రులు ప్రశ్నించారు. తమ పిల్లల భద్రతకు హామీ కల్పించాలని, బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. పేరెంట్స్ కమిటీ ఏర్పాటు ఎందుకు లేదు? గత విద్యా సంవత్సరం ముగిసి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ పేరెంట్స్ కమిటీని ఏర్పాటు చేయకపోవడం వల్ల పాఠశాల నిర్వహణలో పర్యవేక్షణ లోపించి, ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, సోషల్ వెల్ఫేర్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపి, విద్యార్థినుల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

రాజేశంను సన్మానించిన సిపిఐ నేతలు



**ప్రజాపక్షం/గజ్వేల్:** గజ్వేల్ చేనేత కార్మిక సంఘం నూతన అధ్యక్షునిగా ఎన్నికైన స్వర్గం రాజేశంను ఆదివారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బట్టు దయానంద రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ సత్కరించారు.కమ్యూనిస్టు భావజాలాలు ఉన్న సిపిఐ పట్టణ కార్యదర్శి స్వర్గం రాజేశంను పార్టీలకు అంతీతంగా, నూతన అధ్యక్షునిగా, ఏకగ్రీవంగా ఎన్నుకున్న గజ్వేల్ పద్మశాలి సంఘ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.నిరుపేద పద్మశాలి చేనేత కార్మికులను ప్రభు త్వం ఆదుకోవాలని, అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని అన్ని రకాలుగా ఆదుకోవాలని స్పష్టం చేశారు. అయితే కార్పొరేట్ కంపెనీలు రావడంతో నిరుపేద చేనేత కార్మికుల జీవన ఉపాధి కోల్పోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని చేనేత కార్మికులను ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గజ్వేల్ మండల సహాయ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు విజయ్, కొండకింది పోచయ్య, వెంకట చారి పాల్గొన్నారు.

## హమాలీలకు కూలీ.. పెంచకుండా వెట్టి చాకిరీ!

20 నుండి ఆందోళన యూనియన్ హెచ్చరిక



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** గోదావరిఖని హోల్ సేల్ కూరగాయల మార్కెట్ లో పని చేస్తున్న హమాలీలకు కూలీ రేట్లు పెంచాలని పలుమార్లు హోల్ సేల్ వ్యాపారులకు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించలేదని కరీంనగర్ జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్(ఏఐటియుసి) అధ్యక్షులు ఎం.ఎ. గౌస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సమస్యపై కరీంనగర్ డిప్యూటీ లేబర్ కమీషనర్ కి ఫిర్యాదు చేయగా,ఇరుపక్షాలు చర్చించుకోవాలని సూచించారని, కానీ నెలలు గడిచినా వ్యాపారులు చర్చలకు రావడం లేదని తెలిపారు. హోల్ సేల్ వ్యాపారులు లేబర్ కమీషనర్ గారి సూచనలను కూడా బేఖాతరు చేస్తూ హమాలీలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. రైతులను, ఆసాములను హమాలీ కూలీలపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయ డం సరైన పద్ధతి కాదన్నారు. హోల్ సేల్ వ్యాపారులు వెంటనే హమాలీల కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిచో జూలై 20 నుండి గోదావరిఖని హోల్ సేల్ మార్కెట్ ముందు ఆందోళన కార్యక్రమాలు,ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.

## దుద్దెడ చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా వడ్లకొండ శ్రీనివాస్



**ప్రజాపక్షం/కొండపాక :** కొండపాక మండలం దుద్దెడ సహకార సంఘం అధ్యక్షుడిగా దుద్దెడకు చెందిన వడ్లకొండ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సంఘంలో 9 మంది డైరెక్టర్ల ఎన్నిక శుక్రవారం జరిగాయి. సంఘ కార్యాలయంలో చైర్మన్ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. ఛైర్మన్ పదవికి శ్రీనివాస్ ఒకరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్టుఎన్నికల అధికారి సతీష్ రెడ్డి తెలిపారు. సిరిసినగండ్ల గ్రామానికి చెందిన గంగుల గణేష్, ప్రధాన కార్యదర్శిగా మర్పడగ గ్రామానికి చెందిన లగిశెట్టి ఆంజనేయులు, కోశాధికారిగా దుద్దెడ గ్రామానికి చెందిన బొజ్జ నరేందర్, సహాయ కార్యదర్శిగా కొండపాక గ్రామానికి చెందిన పులగం కిష్టయ్య, కార్యవర్గ సభ్యులుగా బొజ్జ లలిత, వైద్యుల లక్ష్మీనారాయణ ,గడ్డమీది సత్తవ్వ, రాజగిరి వీరేశం పాలకమండలి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి, రాష్ట్ర చేనేత కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ విరుపాక శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించి ఘనంగా సన్మానించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మాట్లాడుతూ, తమపై నమ్మకంతో అప్పగించిన స్థానానికి చేనేతల అభ్యున్నతికి, చేనేత పని రాష్ట్రస్థాయిలో గుర్తించేలా కృషి చేస్తామని తెలిపారు. మరుగున పడిన చేనేత వృత్తికి వన్నె తెచ్చేలా తమ సంఘం అందరి సహకారంతో ముందుకు వెళ్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మడుపు భూమిరెడ్డి, లగిశెట్టి సాయిబాబా, ఆరెపల్లి మహదేవ్, నాయకులు గోనె శ్రీనివాస్, పెద్దంకుల శ్రీనివాస్ గౌడ్, బొజ్జ జగదీశ్వర్, బొజ్జ తిరుపతి ,వైద్యుల నందకుమార్, తాళ్ళ రాజేంద్రప్రసాద్,రాధాకృష్ణ,రాజు, వడ్లకొండ శ్రీహరి పాల్గొన్నారు.

## చర్లభూత్కూర్‌లో ఓటరు సహాయ కేంద్రం

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** కరీంనగర్ రూరల్ మండలంలోని చర్లభూత్కూర్ గ్రామంలో సర్ ఓటర్ సహాయ కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. కరీంనగర్ శాసన సభ్యులు గంగుల కమలాకర్ పిలుపుమేరకు కరీంనగర్ నియోజకవర్గంలోని చర్లభూత్కూర్ గ్రామంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటరు ప్రక్రియకు సంబంధించిన సహాయ కేంద్రాన్ని బూత్ ఇంఛార్జీలు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, సుంకిశాల సంపత్ రావులు ప్రారంభించారు. ఓటు హక్కు నమోదు ప్రక్రియకు సంబంధించి ఏలాంటి సమస్యలున్నా సహాయ కేంద్రంలో సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మధుకర్, మాజీ ఎంపిటిసి బుర్ర తిరుపతి గౌడ్, వార్డు మెంబర్ తప్పెట్ల నరేశ్, బిఎల్ఎ, బిఎల్ఓలు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం..

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/పెగడపల్లి :** పెగడపల్లి మండల పరిధిలోని రాజారాంపల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మదాసు మల్లేశంకు చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న పెగడపల్లి మండల కాంగ్రెస్ నాయకులు వెంటనే స్పందించి విషయాన్ని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఘటనపై స్పందించిన మంత్రి బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించాలని సూచించారు.మంత్రి ఆదేశాల మేరకు స్థానిక సర్పంచ్ ఇస్లావత్ రమేష్ నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కడారి తిరుపతి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి భవిష్యత్తులో కూడా అన్ని విధాలా అండగా ఉంటామని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు.

## డిసిసి ఉపాధ్యక్షుడిగా నిశాంత్ రెడ్డి నియామకం



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గాన్ని విస్తరిస్తూ గొల్లపల్లి మండల నాయకులకు జిల్లాస్థాయి బాధ్యతలను పార్టీ అధిష్టానం అప్పగించింది.ఈ విస్తరణలో గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు ,మాజీ సర్పంచ్ ముస్కు నిశాంత్ రెడ్డి ని జిల్లా ఉపాధ్యక్షుడిగా,చిర్ర దిలీప్ ,తలగొండ విజయ్ లను జిల్లా కార్యదర్శులుగా నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది .ఈ నియామకం పట్ల గొల్లపల్లి కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షాతిరేకం వ్యక్తం అవుతుంది. తనపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వానికి ,సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ కు ,జిల్లా కాంగ్రెస్ కమిటీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని,పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యలపరిష్కారానికి అంకిత భావంతో పని చేస్తామని నూతనంగా నియమితులైన నాయకులు తెలిపారు.మండలం నాయకులకు జిల్లా స్థాయి పదవి దకడంపై వారికి పార్టీ నాయకులు కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

## లయన్స్ క్లబ్ సేవలు విస్తరింపజేస్తాం

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మల్లాపూర్ శ్రీ కనక సోమేశ్వర లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను మండల వ్యాప్తంగా మరింతగా విస్తరింప చేస్తామని క్లబ్ అధ్యక్షుడు రేవెల్లి తిరుపతి అన్నారు. ఆదివారం ముత్యంపేట గ్రామంలో ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేయగా పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కాగా మెట్పల్లి మైత్రి హాస్పిటల్ వైద్యులచే పరీక్షలు నిర్వహించి సూచనలు అందజేశారు. జిల్లా వైస్ గవర్నర్ చంద్రప్రకాష్, జోనల్ చైర్మన్ గంగాధర్, చైర్మన్ తిరుపతి,కార్యదర్శి మండ స్వామి, నాగిరెడ్డి,సభ్యులు ప్రసాద్,విష్ణు, ఉన్నారు.

## విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్

కేంద్రీయ విద్యాలయం నాణ్యమైన, విద్యకు ప్రతీకలు

ఎంపి ధర్మపురి అరవింద్



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ తెలిపారు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని చలగల్ వాలంతరీ వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణానికి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్,జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సంయుక్తంగా కలిసి భూమిపూజ నిర్వహించారు.కేంద్రీయ విద్యాలయం కోసం కేటాయించిన భూమి గతంలో రైతులకు చెందినదని, భూమి కేటాయింపులో కొన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ నిరంతర కృషితో రాష్ట్ర ప్రభుత్వం వాలంతరీ వ్యవసాయ క్షేత్రంలోని ఐదు ఎకరాల భూమిని కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిందన్నారు. విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, జగిత్యాల అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ధర్మపురి నియోజకవర్గానికి కూడా మరిన్ని విద్యాసంస్థలు తీసుకురావాలని ఎంపీ ధర్మపురి అరవింద్‌ను కోరారు.1983లో కేవలం 20 కేంద్రీయ విద్యాలయాలతో ప్రారంభమైన వ్యవస్థ ప్రస్తుతం దేశ, విదేశాలలో 1,289 కేంద్రీయ విద్యాలయాల కు ఎంపీ విస్తరించిందన్నారు. ప్రస్తుతం 13,5 1, 446 మంది విద్యార్థులు చదువుకుంటుండగా, 42, 661 మంది బోధనా సిబ్బంది, సుమారు ఐదు వేల మంది బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారని ఎంపీ తెలిపారు. తెలంగాణకు మొత్తం 39 కేంద్రీయ విద్యాలయాలు మంజూరు కాగా, ప్రస్తుతం 37 పాఠశాలలు పనిచేస్తున్నాయని చెప్పారు. కేంద్రీయ విద్యాలయాలు నాణ్యమైన విద్య కు ప్రతీకలని పేర్కొంటూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, సైన్యం, వాయుసేన, నౌకాదళం, పోలీసు సిబ్బంది పిల్లలకు ప్రాధాన్యతతో పాటు స్థానిక విద్యార్థులకు కూడా ప్రవేశాల్లో అవకాశం ఉంటుందని ఎంపీ ధర్మపురి అరవింద్ వివరించా రు. రష్యా, నేపాల్, ఇరాన్ వంటి దేశాల్లో కూడా కేంద్రీయ విద్యాలయాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జగిత్యాలకు కేంద్రీయ విద్యాలయాన్ని మం జూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ, జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ ధర్మపురి అరవింద్ కోరారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో సైనిక్ స్కూల్ ఏర్పాటుతో పాటు జగిత్యాలకు కృషి విజ్ఞాన కేంద్రాన్ని తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్.దినేష్, జగిత్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, చలగల్ గ్రామ సర్పంచ్ జున్ను రాజేందర్, జగిత్యాల ఆర్.డి.ఓ. మధుసూదన్, జిల్లా, మండల అధికారులు,ప్రజా ప్రతినిధులు, ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## న్యూఓటరు ఎన్యూమరేషన్ మీ సేవల్లో ఉచిత నమోదు

కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన(సర్) కార్యక్రమంలో భాగంగా ఓటరు ఎన్యుమరేషన్ ఆన్లైన్ ప్రక్రియను మీ సేవ కేంద్రాల్లో ఉచితంగా సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని ప్రజల సౌకర్యార్థం మీ సేవ కేంద్రాల్లో ఓటరు ఎన్యుమరేషన్ ఆన్లైన్ ప్రక్రియను పూర్తిగా ఉచితంగా చేసే ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సేవకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.ఇంటర్నెట్ సౌకర్యం లేని వారు లేదా స్వ యంగా దరఖాస్తు చేయలేని వారు తమ సమీపంలోని మీ సేవ కేంద్రం లేదా బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఓ) సహాయంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్యుమరేషన్ సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు.సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ఓటర్లుద్వారా కూడా ఇంటి నుంచే స్వ యంగా ఎన్యుమరేషన్ సమర్పించుకోవచ్చని తెలిపారు. ఇందుకోసం పోర్టల్‌లో మొబైల్ నంబర్ లేదా (ఇపిఐసి )నంబర్‌తో లాగిన్ అయి, (సర్) (ఇఎఫ్) ఎంపికను ఎంచుకుని, రాష్ట్రం, ఓటరు వివరాలు నమోదు చేయాలని సూచించారు. 2002 ప్రత్యేక ఓటరు జాబితా (సర్)కు సంబంధించిన వివరాలను నమోదు చేయాలని తెలిపారు. 2002 ఓటరు జాబితాలో పేరు ఉన్న వారు తమ అసెంబ్లీ నియోజకవర్గం (ఎసి), పార్ట్ నంబర్, సీరియల్ నంబర్ వివరాలను నమోదు చేయాలని, ఒకవేళ 2002లో ఓటరుగా లేకపోతే పోర్టల్‌లోని సర్ సదుపాయం ద్వారా తల్లిదండ్రులు లేదా అర్హత కలిగిన సమీప బంధువుల 2002 సర్ వివరాలను గుర్తించి నమోదు చేయవచ్చని వివరించారు.వ్యక్తిగత వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా, మొబైల్ నంబర్ తదితర సమాచారాన్ని జాగ్రత్తగా పరిశీలించి అవసరమైతే సవరించాలని, అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేసి వివరాలను మరోసారి ధృవీకరించిన అనంతరం ఆన్లైన్లో సమర్పించాలని తెలిపారు. ఆన్లైన్లో ప్రక్రియ పూర్తయిన వెంటనే (ఎఆర్ఎన్)ను డౌన్‌లోడ్ చేసుకుని లేదా స్క్రీన్‌షాట్ రూపంలో భద్రపరచుకోవాలని సూచించారు.సద్వినియోగం చేసుకుని గడువులోగా ఎన్యుమరేషన్ ఆన్లైన్ లో సమర్పించాలని కోరారు. సందేహాలు ఉన్న వారు సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఓ), ఎన్నికల అధికారులను లేదా సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని సంప్రదించి అవసరమైన సహాయం పొందవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## నులిపురుగుల నిర్మూలనకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్

**ప్రజాపక్షం/సిద్దిపేట జిల్లా ప్రతినిధి :** జాతీయ నులిపురుగుల నిరూలన దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లాలో నేడు సోమవారం నిర్వహించే కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని సిద్దిపేట జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ సీఎచ్ ధనరాజ్ తెలిపారు. జిల్లాలో 1 నుండి 19 సంవంత్సరాల గల 2,12,569 మంది పిల్లలకు ఆల్బెండల్‌జోల్ మాత్రలు వేయడానికి 2,461 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆ రోజు మాత్రలు తీసుకోలేని వారికి జూలై 20న మాప్ ఆప్ డే నిర్వహిస్తామని తెలిపారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని తల్లిదండ్రులకు కలెక్టర్ హైమావతి విజ్ఞప్తి చేశారు.



## మేడిగడ్డ బ్యారేజ్ రిపేర్ చేయకుండానే నీళ్లు ఎత్తిపోయొచ్చు

● కక్ష సాధింపు చర్యలు మానుకొని..

రైతుల కోసం కన్నెపల్లి మోటార్లు ఆన్ చేయాలి

● రిటైర్డ్ ఇంజనీర్లను అవమానించడం సరికాదు

● మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులను ఆదుకోవాలంటే కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను వెంటనే ప్రారంభించి గోదావరి జలాలను రిజర్వాయర్లకు తరలించాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరీంనగర్ నగరంలోని ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాజీ మేయర్ , రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఓరుగంటి రమణారావు, ముత్యాల బలరాం రెడ్డి, ఏలేటి కృష్ణారెడ్డి పాల్గొన్నారు. తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, రైతులు పంటలు వేయాలా వద్దా అనే సందిగ్ధంలో ఉన్నారని కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఇలాంటి సమయంలో రాజకీయాలకు అతీతంగా రైతులకు నీటి భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను ప్రారంభించాలని కోరుతూ రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం, ముఖ్యంగా రిటైర్డ్ ఇంజనీర్ శ్యాంప్రసాద్ రెడ్డి ప్రభుత్వానికి లేఖ రాయడం సమంజసమైన సూచన అని పేర్కొన్నారు. రాష్ట్ర పరిస్థితులపై పూర్తి అవగాహన ఉన్న మాజీ ఇంజనీర్లు రైతుల ప్రయోజనాల కోసం ఇచ్చిన సలహాలను ప్రభుత్వం గౌరవించాల్సింది పోయి, వారిని జైలుకు పంపాలంటూ ముఖ్యమంత్రి మాట్లాడడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. అక్కడికి సుమారు 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని వివరించారు. దీని ద్వారా ఎల్లంపల్లి, మానేరు వంటి రిజర్వాయర్లకు నీటిని తరలించి రైతులకు ఉపయోగపడేలా చేయవచ్చని చెప్పారు. ఏడు జిల్లాల్లోని దాదాపు 40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మేడిగడ్డ బ్యారేజీని నిర్మించారని గుర్తు చేశారు. గోదావరి–ప్రాణహిత సంగమ ప్రాంతంలో నిర్మించిన ఈ బ్యారేజీ ద్వారా ఎప్పటికప్పుడు నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉందన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ప్రకారం మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేయవచ్చని, కుంగిన ఒక పిల్లర్‌కు సంబంధించిన బ్లాక్‌ను పునర్నిర్మించడానికి రూ. 300–400 కోట్లు మాత్రమే అవసరమని తెలిపారు.

## మెట్‌పల్లిలో మహిళ దారుణ హత్య.. శాంతినగర్‌లో కలకలం



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఆదివారం మహిళ దారుణ హత్యకు గురైన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.స్థానికుల కథనం ప్రకారం.. శాంతినగర్ కాలనీలో నివాసం ఉంటున్న కర్రె సునిత (34) అనే మహిళను గుర్తుతెలియని వ్యక్తులు మెడపై పదునైన ఆయుధంతో దాడి చేసి హత్య చేసి, అనంతరం అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం.ఘటనను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మెట్‌పల్లి సీఐ సురేష్ బాబు, ఎస్ఐ కిరణ్ కుమార్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు. హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టడంతో పాటు నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## శాశ్వత తొలగింపు వద్దు

# ‘సస్పెన్షన్’ మాత్రమే చేయాలి

- 30రోజులపాటు నిర్బంధంలో ఉన్న పిఎం, సిఎంల పదవి విషయంలో పార్లమెంటరీ కమిటీ సిఫార్సు



**న్యూఢిల్లీ :** ప్రతిపక్ష పార్టీలు వ్యక్తం చేసిన ఆందోళనల నేపథ్యంలో తీవ్రమైన నేరారోపణలపై ప్రధానమంత్రి, కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రులను వరుసగా 30 రోజులపాటు నిర్బంధిస్తే, వారిని పదవుల నుంచి శాశ్వతంగా తొలగించకుండా సస్పెండ్ చేయాలని ఒక పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేసింది. అలాంటి వ్యక్తులు నిర్దోషులుగా విడుదలైనా లేదా నిర్దిష్ట కాలపరిమితిలోగా విచారణ ముందుకు సాగకపోయినా, ఈ నిర్ణయాన్ని స్వయంచాలకంగా రద్దు చేసే నిబంధనను కూడా పార్లమెంటరీ కమిటీ ప్రతిపాదించింది. 130వ రాజ్యాంగ సవరణ బిల్లును పరిశీలిస్తున్న పార్లమెంట్ సంయుక్త కమిటీ రెండు నిర్దిష్ట, మూడు సాధారణ సిఫారసులను చేసింది. గత ఆగస్టులో ప్రవేశపెట్టిన ఈ బిల్లు ప్రకారం ప్రధానమంత్రి, మంత్రులు లేదా ముఖ్యమంత్రులు స్వచ్ఛందంగా పదవి నుంచి వైదొలగని పక్షంలో వారిని నిర్బంధించిన 31వ రోజున స్వయంచాలకంగా పదవి నుంచి తొలగించవచ్చు. తాము నడుపుతున్న ప్రభుత్వాలను అస్థిరపరిచే సాధనంగా ఈ బిల్లును ప్రతిపక్షాలు అభివర్ణించాయి. చాలా ప్రతిపక్ష పార్టీలు బిల్లును పరిశీలిస్తున్న సంయుక్త కమిటీ నుండి వైదొలిగాయి. ఈ వారం ఆమోదం పొందే అవకాశం ఉన్న తన నివేదికలో తొలగింపు అనే పదాన్ని ‘సస్పెన్షన్’తో భర్తీ చేయాలని ప్యానెల్ ప్రతిపాదించింది. అంటే, నిర్దిష్ట క్రిమినల్ ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రులను, న్యాయపరమైన విచారణల ఫలితం వెలువడే వరకూ శాశ్వతంగా తొలగించకుండా, సస్పెండ్ చేయాలి. గరిష్ఠంగా 5సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ జైలు శిక్ష విధించబడే నేరాలను ఈ పదం సూచించాలని పేర్కొంటూ, ‘తీవ్రమైన నేరపూరిత నేరాలు’ అనే పదాన్ని కూడా ఇది నిర్వచించింది. ఒక సన్‌సెట్ లేదా ‘ఆటోమేటిక్ రివర్సల్ క్లాజ్’ను ప్రవేశపెట్టాలని ప్రతిపాదిస్తూ, మంత్రి నిర్దోషిగా విడుదలైనా లేదా నిర్దిష్టకాలంలోగా విచారణ ముందుకు సాగకపోయినా సస్పెన్షన్ స్వయంచాలకంగా ముగిసిపోవాలని అది పేర్కొంది. కోర్టులచే నిర్దోషులుగా తేలిన వారికి ఈ రక్షణచర్య పున: నియామకాన్ని నిర్ధారిస్తుందని, అలాగే సస్పెన్షన్ శాశ్వతం కాదని పార్లమెంట్ సంయుక్త కమిటీ తెలియజేసింది. సుప్రీంకోర్టుకు అనుగుణంగా ఉన్నతస్థాయి రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారికి సంబంధించిన కేసులను ఫాస్ట్ ట్రాక్ లేదా ప్రత్యేక కోర్టులలో విచారించాలని సంయుక్త కమిటీ సిఫార్సు చేసింది. ప్రతిపాదిత చట్టంలో 5సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ జైలు శిక్ష విధించబడే నేరాలను జాబితా చేసే ప్రత్యేక షెడ్యూల్‌ను చేర్చాలి. సస్పెన్షన్‌కు దారితీసే నేరాలను స్పష్టంగా గుర్తించాలని ప్యానెల్ పేర్కొంది. ప్రభుత్వాలు జైలు నుండి నడపబడకుండా చూసే లక్ష్యంతో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. సిఫార్సులు ఆమోదం పొందితే, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతిపాదిత సవరణలతో కేంద్ర మంత్రివర్గాన్ని సంప్రదించి, ఆ తర్వాత లోక్‌సభలో అధికారిక సవరణలను ప్రవేశపెడుతుంది.

# కీలక పదవులన్నీ ఒకే పార్టీ చేతిలో ఉండొద్దు

కేరళలో ప్రతిపక్ష ఉపనేత పదవిని మాకు ఇవ్వాల్సిందే : సిపిఐ



**తిరువనంతపురం :** కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష ఉప నాయకుడు పదవి కోసం చేస్తున్న డిమాండ్ విషయంలో సిపిఐ పట్టుదలతో ఉంది. సిపిఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ కూటమిలో కీలక పదవులన్నీ ఒకే పార్టీ చేతిలో ఉండకూడదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం స్పష్టం చేశారు. ఎల్‌డిఎఫ్‌లో సిపిఐ(ఎం) తర్వాత సిపిఐ రెండవ అతిపెద్ద భాగస్వామ్య పక్షం. ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ ఓటమి తర్వాత నుంచి ఆ పార్టీ ఈ డిప్యూటీ ప్రతిపక్ష నాయకుడి పదవిని కోరుతోంది. ఆదివారం తిరువనంతపురంలో జరిగిన పి.కె. వాసుదేవన్ నాయర్ స్మారక సభలో బినోయ్ విశ్వం మాట్లాడుతూ ప్రతిపక్ష ఉపనాయకుడి విషయంలో సిపిఐలో ఎటువంటి వివాదం గానీ, సందేహం గానీ లేదని అన్నారు. ఆ పదవికి సిపిఐకి పూర్తి హక్కు ఉందని విశ్వం పేర్కొన్నారు. కూటమిలోని భాగస్వామ్య పక్షాల మధ్య బాధ్యతల సమాన పంపిణీని నిర్ధారించడం ద్వారా ఎల్‌డిఎఫ్‌ను బలహీనపరచడం కాకుండా, మరింత బలోపేతం చేయడమే తమ పార్టీ డిమాండ్ ఉద్దేశమని విశ్వం తెలిపారు. ‘గత సంప్రదాయాలను సాకుగా చూపి ఎవరూ దీని నుండి తప్పించుకోలేరు. ఒకవేళ సంప్రదాయాలను మార్చాల్సి వస్తే, వాటిని మార్చాల్సిందే. సంప్రదాయం ముఖ్యం కాదు, రాజకీయాలే ముఖ్యం. సంప్రదాయం ముఖ్యం కాదు, ఎల్‌డిఎఫ్ ముఖ్యం. ఎల్‌డిఎఫ్ ఒక నిజమైన కూటమిగా ముందుకు సాగాలి’ అని ఆయన అన్నారు. సిబ్బంది, జీతం, వాహనం లేదా అధికారిక నివాసం వంటి సౌకర్యాలు లేదా ఆ పదవికి ఉండే హోదా కోసం తాము ఈ పదవిని కోరడం లేదని ఆయన చెప్పారు. ‘ఇది పదవి హోదాకు సంబంధించిన విషయం కాదు. గతంలో సిపిఐ ముఖ్యమంత్రి పదవిని కూడా పంచుకుంది. కాబట్టి, కేవలం హోదా కోసం మేము డిప్యూటీ ప్రతిపక్ష నాయకుడి పదవిని కోరడం లేదు. కీలక పదవులన్నీ ఒకే పార్టీ వద్ద ఉండకూడదనే సూత్రమే ఇక్కడ ముఖ్యం’ అని ఆయన అన్నారు. ప్రస్తుతం, సిపిఐ(ఎం) సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. ఎల్‌డిఎఫ్‌లోని ముఖ్యమైన పదవులు, బాధ్యతలను కూటమిలోని భాగస్వామ్య పక్షాల మధ్య పంచుకోవాలని విశ్వం అన్నారు. ఈ అంశాన్ని లేవనెత్తిన విధానం గురించి ప్రస్తావిస్తూ, కూటమిలో చర్చించకుండానే సిపిఐ బహిరంగంగా ఈ విషయాన్ని ప్రస్తావించిందన్న వాదనలను విశ్వం తోసిపుచ్చారు. సిపిఐ మొదట ఈ విషయాన్ని బహిరంగంగా లేవనెత్తలేదని, ముందుగా ఎల్‌డిఎఫ్ అంతర్గత సమావేశాల్లో దీనిపై చర్చ జరిగిందన్నారు. తాము అధికారికంగా లేఖ పంపాము, దానికి సమాధానం కూడా వచ్చిందని చెప్పారు. ఆ తర్వాతే ఈ అంశం బహిరంగ చర్చకు వచ్చిందని, కేవలం బహిరంగంగా మాట్లాడటం వల్లే సిపిఐ ఈ డిమాండ్ చేస్తోందని అనడం సరికాదని పేర్కొన్నారు.కూటమిలోనూ, బహిరంగంగానూ సమస్యలను ఎప్పుడు, ఎలా లేవనెత్తాలో సిపిఐకి తెలుసునని ఆయన అన్నారు. పి.కె. వాసుదేవన్ నాయర్, అచ్యుత మీనన్, ఎం.ఎన్. గోవిందన్ నాయర్ వంటి నాయకుల నుంచి తమకు సంక్రమించిన రాజకీయ సంప్రదాయం ఇదేనని ఆయన వివరించారు. అంతకుముందు, ప్రతిపక్ష ఉప నాయకుడి నియామకానికి సంబంధించిన అంశం ‘ముగిసిన అధ్యాయం’ అని విజయన్ పేర్కొన్నారు, అంటే దీనిపై ఇకపై ఎటువంటి చర్చ అవసరం లేదని ఆయన సూచించారు.

# మోదీ అండదండలతో విశ్వాస ద్రోహం

రామాలయం విరాళాల చోరీపై బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌పై కాంగ్రెస్ ధ్వజం



**న్యూఢిల్లీ :** అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల చోరీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనంగా ఉండడం ఏమిటని కాంగ్రెస్ ప్రశ్నించింది. ఈ విశ్వాస ద్రోహానికి బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌లను దేశం ఎప్పటికీ క్షమించదని మండిపడింది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు, ఫోరెన్సిక్ ఆడిట్, జవాబుదారీతనం నిర్ధారించడం, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్న తమ పార్టీ డిమాండ్లను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ పునరుద్ఘాటించారు. ‘విరాళాల దొంగతనం: విశ్వాస ద్రోహం. శ్రీరామ మందిరంలో విరాళాల దొంగతనం వెలుగులోకి వచ్చి నెల రోజులు గడిచినా, ప్రతీదానికీ తానే ఘనత దక్కించుకునే ప్రధానమంత్రి మోదీ, జవాబుదారీతనం విషయానికి వస్తే మౌనంగా ఉన్నారు. రామ మందిర అంశాన్ని రాజకీయం చేసిన వారిని ప్రతిరోజూ కొత్త వాస్తవాలు బట్టబయలు చేస్తున్నాయి’ అని రమేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ విషయాన్ని పరిష్కరించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కూడా, ప్రతిరోజూ లక్షల రూపాయల కానుకలు మాయమవుతున్నాయని అంగీకరించక తప్పలేదని రమేశ్ అన్నారు. ‘శ్రీరామ ఆలయంలో విరాళాల దొంగతనం కేవలం కొద్దిమంది ఉద్యోగులకే పరిమితం కాదు; అయినప్పటికీ, రాముడి ఆశయానికి వ్యతిరేకంగా ఉన్న ఈ ప్రభుత్వం అసలు దోషులను కాపాడాలని చూస్తోంది’ అని ఆయన ఆరోపించారు. సిట్, ఎఫ్ఐఆర్, రాజీనామాలు కేవలం దేశాన్ని మోసం చేసే ప్రయత్నాలేనని కాంగ్రెస్ నిలకడగా చెబుతోందని రమేశ్ అన్నారు. ఈ విషయాన్ని అణచివేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు, చంపత్ రాయ్, ఇతర ఆలయ ట్రస్టీలు లోతైన రహస్యాలను దాచిపెట్టారని స్పష్టం చేస్తున్నాయని, అందుకే మోదీ ప్రభుత్వం వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు, వారి ప్రభావం చెక్కుచెదరకుండా ఉందని రమేశ్ ఆరోపించారు. ‘సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర, నిష్పక్షపాత దర్యాప్తు; ఫోరెన్సిక్ ఆడిట్; జవాబుదారీతనం నిర్ధారణ; దోషులపై కఠిన చర్యలు’ వంటి వాటిని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు. ‘ప్రధానమంత్రి గారూ, దేశం తెలుసుకోవాలనుకుంటోంది: ఈ మౌనం ఎందుకు? మోదీ అండతో పథకం ప్రకారం జరిపిన ఈ విశ్వాస ద్రోహానికి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లను దేశం ఎన్నటికీ క్షమించదు‘ అని రమేశ్ ఆరోపించారు. కాగా, కాంగ్రెస్ నాయకులు దేశవ్యాప్తంగా 26 చోట్ల విలేకరుల సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలలో వారు, విరాళాల చోరీపై సిట్ నివేదిక మంచుకొండలో ఒక చిన్న భాగం మాత్రమే అని పేర్కొన్నారు. అంతేకాకుండా, పెద్ద చేపలు స్వేచ్ఛగా తిరుగుతున్న తీరు చూస్తుంటే, వారికి ‘ప్రధానమంత్రి మోదీ పూర్తి రక్షణ, ఆశీస్సులు ఉన్నాయని తెలుస్తోందన్నారు. కాంగ్రెస్, ఇతర ప్రత్యర్థుల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న బిజెపి, విరాళాల దొంగతనం కేసులో తప్పు చేసినట్లు రుజువైన వారిని వదిలిపెట్టబోమని స్పష్టం చేసింది. రామమందిర నిర్మాణానికి ఎన్నడూ మద్దతు ఇవ్వని ప్రతిపక్ష పార్టీలు, హిందువులను విభజించడానికి ఈ అంశాన్ని వాడుకుంటున్నాయని ఆరోపించింది.

# సిఇఒ అధికారాల నిర్ణయం రామాలయ ట్రస్టుదే

సిఇఒ పనితీరులో ఎటువంటి ప్రభుత్వ జోక్యం ఉండదని: మిశ్రా





**అయోధ్య :** అయోధ్య ఆలయానికి నియమితులయ్యే మొట్టమొదటి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) బాధ్యతలు, అధికారాలను ఆలయ ట్రస్ట్ నిర్ణయిస్తుందని రామమందిర నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. ట్రస్ట్ పట్ల భక్తులకు ఉన్న విశ్వాసాన్ని కాపాడటమే సిఇఒ ప్రధాన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కొత్త సిఇఒ ఆర్థిక వ్యవహారాలను కూడా పర్యవేక్షిస్తారు అని అయోధ్యలో జరిగిన విలేకరుల సమావేశంలో మిశ్రా చెప్పారు. ట్రస్ట్ లేదా సిఇఒ పనితీరులో ఎటువంటి ప్రభుత్వ జోక్యం ఉండదని ఆయన స్పష్టం చేశారు. అయోధ్యను సందర్శించే భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం, ఆలయం పట్ల వారి నమ్మకాన్ని నిలబెట్టడం వంటివి కొత్త సిఇఒ ప్రాథమిక బాధ్యతలలో ఉంటాయని మిశ్రా తెలిపారు. ఒక రకంగా చెప్పాలంటే, ప్రభుత్వ జోక్యం లేకుండా సిఇఒ ట్రస్ట్‌కు సహాయకారిగా పనిచేస్తారు అని మిశ్రా అన్నారు. సిఇఒ పదవికి తగిన అభ్యర్థులను ట్రస్ట్‌కు సిఫార్సు చేయడానికి ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. చివరికి, సిఇఒకు ఎంత అధికారం అప్పగించాలనేది ట్రస్ట్ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని, మొత్తం వ్యవహారాలు ట్రస్ట్ పరిధిలోనే ఉంటాయని, అయితే సిఇఒ తన సిబ్బందిని స్వయంగా ఏర్పాటు చేసుకునే బాధ్యత కలిగి ఉంటారని మిశ్రా వివరించారు. సిఇఒ పదవికి అభ్యర్థులను పరిశీలించడానికి రిటైర్డ్ జస్టిస్ ప్రమోద్ కోహ్లీ, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ విష్ణుకాంత్ చతుర్వేది, మాజీ ఎన్ఐటి రాయ్‌పూర్ చైర్‌పర్సన్ సురేష్ హవారేలతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీని ట్రస్ట్ ఈనెల 6న ప్రకటించింది. రామమందిర ట్రస్ట్‌లో ఏవైనా మార్పులు ఉండే అవకాశం ఉందా అనే ప్రశ్నకు స్పందిస్తూ, ‘నా సమక్షంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదు’ అని మిశ్రా పేర్కొన్నారు. 6న జరిగిన ట్రస్ట్ సమావేశానికి తాను హాజరుకాలేదని కూడా ఆయన స్పష్టం చేశారు. 22న జరగనున్న సమావేశానికి హాజరవుతారా అని అడిగినప్పుడు మిశ్రా స్పందిస్తూ సమావేశం 22న ఉంది, కానీ దాని ఎజెండా (అజెండా) నాకు తెలియదని, ఒకవేళ ఆ విషయం నిర్మాణానికి సంబంధించినదైతే, తప్పక హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ఎజెండా తెలిసిన తర్వాత, సమావేశానికి హాజరవ్వాలా వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకుంటానన్నారు. 22 నాటి సమావేశంలో ఏయే అంశాలపై చర్చ జరగవచ్చనే దాని గురించి ప్రస్తావించినప్పుడు, ఆ విషయాన్ని ఆలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిని అడిగి తెలుసుకోవాలని మిశ్రా సూచించారు.

రామాలయ విరాళాల చోరీ...

# దోషులపై కఠిన చర్యలు

ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్, దేశవ్యాప్త సంతకాల సేకరణ ప్రారంభం

**న్యూఢిల్లీ :** అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల చోరీకి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) డిమాండ్ చేసింది. ఆదివారం దేశవ్యాప్త సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. అనంతరం, రోహిణిలోని జపనీస్ పార్కులో ఆ పార్టీ ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హనుమంతుని ఆశీస్సులతో ప్రారంభిస్తున్నామని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. మందిరంలో జరిగిన ఈ ‘చందాచోరీ’కి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాసిన లేఖలపై సంతకాలు చేసి, ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో భాగంగా, ప్రజలు తమ ఇళ్లలో, నివాస సముదాయాలలో, ఇతర ప్రాంతాలలో హనుమాన్ చాలీసా పారాయణాలు, హనుమాన్ హారతి నిర్వహించి, భక్తులను సమీకరించి, ప్రధానమంత్రికి రాసిన లేఖపై సంతకాలు చేసేలా వారిని ప్రోత్సహించాలని కేజ్రీవాల్ విజ్ఞప్తి చేశారు. ఈ సంతకాల సేకరణ కార్యక్రమం దేశవ్యాప్తంగా జరుగుతుందని, ఇది కేవలం ఆప్ కార్యకర్తలకు మాత్రమే పరిమితం కాదని ఆయన పేర్కొన్నారు. రామ భక్తులు, ఆరోపించబడిన పరిణామాల వల్ల బాధపడిన ప్రజలు ఈ ప్రచారంలో పాల్గొంటారని, సంతకాలతో కూడిన లేఖలను తర్వాత ప్రధానమంత్రికి పంపుతారని కూడా ఆయన అన్నారు. రామ మందిరానికి సంబంధించిన ఆరోపిత దుష్ప్రవర్తనకు బాధ్యులైన వారిని జవాబుదారీతనం నుండి కాపాడుతున్నారని కేజ్రీవాల్ ఒక ప్రకటనలో ఆరోపించారు. వారికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, ఆప్ చర్యను ఢిల్లీ బిజెపి విమర్శించింది. కేజ్రీవాల్ రాజకీయ భవిష్యత్తును పునరుద్ధరించడానికే సుందరకాండ పారాయణాలను నిర్వహించడం ఒక ‘రాజకీయ జిమ్మిక్కు’ అని ఢిల్లీ బిజెపి అధ్యక్షుడు హర్ష్ మల్హోత్రా ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కేజ్రీవాల్ మతపరమైన కార్యక్రమాలను వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. 2024లో ఆప్ ప్రభుత్వం ప్రకటించిన సుందరకాండ పారాయణ కార్యక్రమాలను ఎందుకు కొనసాగించలేదని ప్రశ్నించారు. ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లోని ఓటర్లను ప్రభావితం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని కూడా ఆయన ఆరోపించారు. రామమందిరం అంశంపై కేజ్రీవాల్ గతంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ఆయన హనుమంతుడు, సుందరకాండ పాఠం పేరుతో ‘కపట భక్తి‘ని ప్రదర్శిస్తున్నారని బిజెపి నాయకుడు ఆరోపించారు.



### శాంతిభద్రతలు పూర్తిగా విఫలం

మణిపూర్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఓ ఇబోబి సింగ్ ధ్వజం

**ఇంఫాల్ :** వచ్చే ఏడాది ప్రారంభంలో జరుగనున్న మణిపూర్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించడంలో చాలా కీలకమని మణిపూర్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఓ ఇబోబి సింగ్ అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలాయని ఆయన ఆరోపించారు. శనివారం ఇంపాల్ వెస్ట్ జిల్లాలోని కాంటో సబల్ వద్ద దాదాపు 600మందితో కూడిన అల్లరిమూక కనీసం మూడు పాడుబడిన ఇళ్లకు నిప్పుపెట్టిన ఘటనను సింగ్ ఖండించారు. ఆదివారం ఇక్కడి కాంగ్రెస్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇబోబి సింగ్ మాట్లాడుతూ ‘నిన్న కాంటో సబల్‌లో జరిగిన సంఘటన మాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. అయితే ఇలాంటి చర్యలు కొత్తేమీ కాదు. రాష్ట్రంలో అప్పుడప్పుడు దురదృష్టమైన, అవాంఛనీయ సంఘటనలు జరుగుతూనే ఉంటాయి’ అని చెప్పారు. కాంటో సబల్ ఒక సైనిక శిబిరానికి పక్కనే ఉందని, ఆ ప్రాంతంలో పెద్దయెత్తున కేంద్ర బలగాలను కూడా మోహరిస్తున్నారని తెలియజేశారు. పాడుబడిన ఇళ్లను తగులబెడుతున్నప్పుడు రాష్ట్ర బలగాలను, అగ్నిమాపక వాహనాలను కూడా ఆ ప్రాంతంలోకి అనుమతించడం లేదని సింగ్ ఆరోపించారు. మూడు సార్లు మణిపూర్ మాజీ ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన ‘రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన కొనసాగుతోందా? లేదా? అని మేం వాస్తవానికి ప్రశ్నించాలని అనుకుంటున్నాం’ అని అన్నారు.

# ఢిల్లీలో కాకుండా మరెక్కడ చేయాలి?

- బిజెపి వ్యాఖ్యలపై మండిపడ్డ జమ్ముకశ్మీర్ సిఎం అబ్దుల్లా
- ఈనెల 20న జంతర్‌మంతర్‌లో ఎన్‌సి నిరసనలు

**జమ్ము :** కేంద్రపాలిత ప్రాంతంగా ఉన్న జమ్ముకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా కల్పించడంలో జరుగుతున్న అస్పష్టమైన జాప్యంపై, ఢిల్లీలో కేంద్రానికి వ్యతిరేకంగా ఈనెల 20 నుండి కొత్త దశ నిరసనలు చేపట్టనున్నట్లు జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రకటించారు. ఆదివారం జమ్ములో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కేంద్రం రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తుందనే ఆశతో తమ పార్టీ రెండేళ్లు వేచి చూసిందని అబ్దుల్లా పేర్కొన్నారు.

‘మేము కేంద్ర ప్రభుత్వానికి తగినంత సమయం ఇచ్చాము. దాదాపు రెండేళ్లపాటు రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం చర్చలు జరిపాము. ఇప్పుడు మేము కొత్త వ్యూహాన్ని అనుసరిస్తాము’ అని అబ్దుల్లా అన్నారు. రాష్ట్ర హోదా కల్పనను కేంద్రం పదేపదే సరైన సమయం వరకు వాయిదా వేస్తుండటాన్ని ప్రశ్నించిన ముఖ్యమంత్రి, అసలు ఆ సరైన సమయం అంటే ఏమిటని, అంటే జమ్ము కశ్మీర్‌లో బిజెపి అధికారంలోకి రావడమేనా అని నిలదీశారు. ‘జంతర్ మంతర్ వద్ద ఎన్‌సీ (నేషనల్ కాన్ఫరెన్స్) చేపట్టిన నిరసనపై బిజెపి నాయకులు వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తున్నారు, ఇలాంటి నిరసనల వల్ల రాష్ట్ర హోదా రాదని అంటున్నారు... మరి ఢిల్లీలో కాకపోతే ఇంకెక్కడ నిరసన తెలపాలి? అని ఆయన ప్రశ్నించారు. ‘మన దేశంలోని ఒక ప్రాంతానికి సంబంధించిన నిర్ణయాలను మన జాతీయ రాజధానిలోనే తీసుకోలేకపోతే, మరి ఎక్కడ తీసుకోవాలి? అని ఆయన జోడించారు. జమ్ము కశ్మీర్‌లోనూ, అసెంబ్లీలోనూ రాష్ట్ర హోదా కోసం తాము చేసిన ప్రయత్నాలను బిజెపి నిరంతరం నీరుగార్చిందని, ఇప్పుడు దేశ రాజధానిలో చేస్తున్న నిరసన విషయంలోనూ అదే చేస్తోందని అబ్దుల్లా అన్నారు. ‘అయితే మేము ఏం చేయాలని వారు ఆశిస్తున్నారు? జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా కోసం అమెరికా వెళ్లి వైట్ హౌస్ బయట నిరసన తెలపాలా? మా దేశంలో ఇచ్చిన హామీని మా దేశ రాజధానిలోనే నెరవేర్చాలని మాత్రమే మేము కోరుతున్నాము’ అని ఆయన అన్నారు. రాజ్యాంగపరమైన హామీని నెరవేర్చడానికి బదులుగా, రాష్ట్ర హోదాను ఒక రాజకీయ అస్త్రంగా వాడుకోవడానికి బిజెపి దానిని ఎరగా ఉపయోగిస్తోందని నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఆరోపించారు. ‘ఒకవేళ అది కత్రా గడ్డపై మోదీ ఇచ్చిన హామీ అయితే, దానిని కచ్చితంగా నెరవేర్చాలి‘ అని రాష్ట్ర హోదా పునరుద్ధరణకు సంబంధించి ప్రధానమంత్రి చేసిన హామీని ప్రస్తావిస్తూ ఆయన అన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత వీలైనంత త్వరగా రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను కూడా అబ్దుల్లా గుర్తుచేశారు. రాష్ట్ర హోదాను నిలిపివేయడం ద్వారా కేంద్రం జమ్ముకశ్మీర్ ప్రజలను శిక్షిస్తోందని ఆయన ఆరోపించారు. ‘దేశం సవాళ్లను ఎదుర్కొన్నప్పుడల్లా జమ్ము ప్రజలు దేశానికి అండగా నిలిచారు. సరిహద్దు జిల్లాలు షెల్లింగ్ తీవ్రతను భరించాయి, ఉగ్రవాదం వల్ల నిరాశ్రయులైన వారికి జమ్ము తన ద్వారాలను తెరిచింది. ప్రజలు చేసిన నేరం ఏమిటి, వారికి ఇప్పటికీ రాష్ట్ర హోదాను నిరాకరిస్తున్నారా?’ అని అబ్దుల్లా అన్నారు. మహాత్మా గాంధీని స్మరించుకుంటూ, దేశ విభజన అనంతర హింసాకాండ సమయంలో జాతిపిత జమ్ముకశ్మీర్‌ను మత సామరస్యానికి ప్రతీకగా అభివర్ణించారని అబ్దుల్లా అన్నారు. హిందూ–ముస్లిం–సిక్కు ఐక్యత ఆదర్శాలను నిలబెట్టినందుకు ఇప్పుడు ఆ ప్రాంతాన్ని శిక్షిస్తున్నారా అని కూడా ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. జమ్ముకశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా తిరిగి లభించే వరకు నేషనల్ కాన్ఫరెన్స్ ప్రజాస్వామ్య, శాంతియుత మార్గాల ద్వారా తన పోరాటాన్ని కొనసాగిస్తుందని అబ్దుల్లా అన్నారు. ‘మేము మా సొంత దేశ రాజధాని తలుపులు తడుతూనే ఉంటాము. జమ్ముకశ్మీర్ ప్రజలకు చేసిన వాగ్దానాలను దేశ నాయకత్వానికి గుర్తు చేస్తూనే ఉంటాము. ఆ వాగ్దానాలను నిలబెట్టుకోవాలని మాత్రమే మేము కోరుతున్నాము’ అని ఆయన అన్నారు. రోడ్డు మార్గంలో జమ్ము చేరుకున్న ముఖ్యమంత్రి, ఢిల్లీలో నిరసన ప్రదర్శన కోసం ప్రజల అనుమతి కోరేందుకు తాను ఉదయం 6 గంటలకే శ్రీనగర్ నుండి బయలుదేరినట్లు తెలిపారు. ‘చర్చలు విఫలమవడంతో మేము రోడ్లపైకి రాక తప్పలేదు. మా డిమాండ్‌కు మద్దతుగా ఈనెల 20న జరిగే నిరసన మా ఆందోళనకు నాంది పలుకుతుంది’ అని అబ్దుల్లా అన్నారు.



‘ఉపా’ కేసులో

# ముగ్గురి అరెస్టు..

తీవ్రవాదులను కీర్తిస్తూ పుస్తకం ప్రచురించారని ఆరోపణ..

**జమ్ము :** ‘ఉపా’ కేసులో ముగ్గురు నిందితులను జమ్ము కౌంటర్ ఇంటెలిజెన్స్ వింగ్ (సిఐజె) అరెస్టు చేసింది. ‘పర్సనాలిటీస్ అండ్ లెజెండ్స్ ఆఫ్ జమ్ము అండ్ కశ్మీర్’ అనే పుస్తకం ప్రచురణ, పంపిణీకి సంబంధించి ముగ్గురు ప్రచురణకర్తలను సిఐజె అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ పుస్తకం తీవ్రవాదులు, వేర్పాటువాదులను కీర్తిస్తూ అతివాద భావజాలాన్ని ప్రచారం చేస్తోందని సిఐజె ఆరోపిస్తోంది. అరెస్టయిన నిందితుల్లో ఇద్దరు ఢిల్లీకి చెందినవారు కాగా.. మరొకరు జమ్ముకు చెందిన వ్యక్తిగా కేసు దర్యాప్తు అధికారులు తెలిపారు. ఢిల్లీకి చెందిన నిందితుల్లో ఒకరు పుస్తకం ప్రచురణకు సంబంధించిన డిజిటల్ రికార్డులను తొలగించి సాక్ష్యాలను నాశనం చేసేందుకు ప్రయత్నించారని అధికారులు ఆరోపిస్తున్నారు. అయితే, దర్యాప్తులో భాగంగా కీలకమైన ఆ డేటాను తిరిగి పొందినట్లు వెల్లడించారు. కాగా, ఢిల్లీ, జమ్ములోని ‘పర్సనాలిటీస్ అండ్ లెజెండ్స్ ఆఫ్ జమ్ము అండ్ కశ్మీర్’ ప్రచురణ సంస్థలపై కొన్ని రోజుల కిందట సిఐజె బృందాలు దాడులు నిర్వహించాయి. ఈ సందర్భంగా పుస్తకం ముద్రణ, సరఫరా, పంపిణీకి సంబంధించిన కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. తాజాగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురిని అరెస్టు చేశారు. మరోవైపు పుస్తక రచయితల కోసం అధికారులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. రచయితల్లో ఒకరైన సంతోశ్ మీనాను ప్రశ్నించేందుకు సిఐజె బృందం ఇప్పటికే రాజస్థాన్‌కు చేరుకుంది. అయితే, రెండో రచయితైన హిలాల్ అహ్మద్ ఆచూకీ ఇంకా లభించలేదని అధికార వర్గాలు తెలిపాయి. కాగా, ఈ కేసులో ఇప్పటికే విద్యాశాఖకు చెందిన ఎనిమిది మంది అధికారులను సస్పెండ్ చేశారు. పుస్తక ప్రచురణకు ఆమోదం తెలిపిన సమగ్ర శిక్షా డైరెక్టరేట్‌పైనా కౌంటర్ ఇంటెలిజెన్స్ వింగ్ దాడులు నిర్వహించింది. కాగా, ‘పర్సనాలిటీస్ అండ్ లెజెండ్స్ ఆఫ్ జమ్ము అండ్ కశ్మీర్’ పుస్తకంలో పలువురు ఉగ్రవాదులు, వేర్పాటువాదులను జమ్ముకశ్మీర్‌కు చెందిన ప్రముఖ వ్యక్తులుగా చిత్రీకరించే అధ్యాయాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 1984లో బర్మింగ్‌హామ్‌లో భారత దౌత్యవేత్త అయిన రవీంద్ర మహాత్రేను హత్య చేసిన మక్బూల్ భట్‌ను గ్లోరిఫై చేసేలా ఈ పుస్తకంలో ఉందని అధికారులు తెలిపారు. అలాగే సయ్యద్ అలీ షా గిలానీ, మస్రత్ ఆలం, మీర్వైజ్ ఉమర్ ఫరూఖ్‌తో సహా వేర్పాటువాదులను జమ్ముకశ్మీర్ గొప్ప వ్యక్తులుగా అభివర్ణించారని అధికారులు ఆరోపిస్తున్నారు.

‘రేపు’ సనత్‌నగర్ ఇఎస్ఐసి హాస్పిటల్ నుంచి...

# 7 బీమా ఆరోగ్య సంరక్షణ ప్రాజెక్ట్‌లు షురూ

వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న కేంద్రమంత్రి మాండవీయ

**న్యూఢిల్లీ :** కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ మంగళవారం తెలంగాణలోని సనత్‌నగర్ ఇఎస్ఐసి హాస్పిటల్ నుంచి దేశ వ్యాప్తంగా ఏడు ఉద్యోగుల రాష్ట్ర బీమా ఆరోగ్య సంరక్షణ ప్రాజెక్ట్‌లను ప్రారంభించనున్నారు. దాదాపు రూ.668 కోట్ల విలువైన ఈ వైద్య సౌకర్యాలు దేశ వ్యాప్తంగా సుమారు 53లక్షల మంది లబ్ధిదారుల ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీరుస్తున్నాయని కార్మిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కేంద్ర కార్మిక, ఉపాధి, యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి అయిన మన్‌సుఖ్ మాండవీయ సనత్‌నగర్‌లోని ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఇఎస్ఐసి) హాస్పిటల్ నూతన ఔట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్ (ఓపిడి) బ్లాక్‌ను స్వయంగా ప్రారంభించనున్నారు. అప్‌గ్రేడ్‌చేయబడిన అస్సాంలోని బెల్‌తోలా 200 పడకల ఇఎస్ఐసి హాస్పిటల్, తమిళనాడులోని శ్రీ పెరంబుదూర్‌లో ఉన్న 100 పడకల ఇఎస్ఐసి హాస్పిటల్, ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలోని ఎఎస్ఐఎస్ హాస్పిటల్, గుజరాత్ సురేందర్ నగర్‌లోని ఇఎస్ఐ డిస్పెన్సరీ, బ్రాంచి కార్యాలయం, రాజస్థాన్‌లోని భవానీ మండి ఇఎస్ఐ డిస్పెన్సరీ, కోటాలోని ఉద్యోగ్‌నగర్‌లోని బ్రాంచి ఆఫీస్ ఈ ఆరు పాజెక్ట్‌ల్లో ఉన్నాయి. ఈ ఆరు ప్రాజెక్ట్‌లను కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వర్చువల్ విధానంలో మంగళవారం ప్రారంభించబోతున్నారు. కేంద్ర కార్మిక, ఉపాధి, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరాంద్‌లాజే కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలోని భాగంగా తెలంగాణలోని సనత్‌నగర్ ఆసుపత్రిలో ఓపిడి బ్లాక్ అభివృద్ధికి సహకరించిన కార్మికులను, దేశానికి వారు అందించిన సేవకు గుర్తింపుగా కేంద్ర మంత్రి మాండవీయ వారిని సత్కరిస్తారు. కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ ఆయన ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఇఎస్ఐ) లబ్ధిదారులకు నగదు ప్రయోజనాలను కూడా పంపిణీ చేస్తారు. సనత్‌నగర్‌లోని ఇఎస్ఐసి మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఓపిడి బ్లాక్ ఒక మైలురాయి వంటి ఆరోగ్య సంరక్షణ కేంద్రం. ఇది హైదరాబాద్, మేడ్చల్–మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలతో సహా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా



ఉన్న 12, 30, 183 మంది బీమాదారులకు, లబ్ధిదారులకు సమగ్రమైన ఔట్ పేషెంట్ సేవలను అందిస్తుంది. ఈ ప్రారంభోత్సవం రాష్ట్రంలోని విస్తృతమైన ఇఎస్ఐ వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ఈ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను మొదట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పరిధిలోని హైదరాబాద్, సికిందరాబాద్ జంట నగరాల్లో అమలు చేశారు. బెల్‌టోలా లోని ఇఎస్ఐ హాస్పిటల్ అస్సాం, మేఘాలయలోని 47 జిల్లాలకు, అలాగే త్రిపుర, మిజోరం, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్‌లోని 41 జిల్లాలకు సేవలు అందిస్తుంది. ఈ సౌకర్యం ద్వారా 3.42 లక్షల మంది బీమా చేయబడిన వ్యక్తులు , మొత్తం సుమారు 13.27లక్షల మంది లబ్ధిదారులు లబ్ధి పొందుతారని అంచనా.

# బంగ్లాదేశ్‌లో వరద విలయం: 43 మంది మృతి

●నీట మునిగిన అనేక ప్రాంతాలు,మానవతాసంక్షోభం ●14,296 హెక్టార్లలో పంటలు ధ్వంసం ●10 లక్షలమందిపై వరద ప్రభావం ●నీట మునిగిన గిడ్డంగులు ●ఓడరేవుల్లో దిగుమతి సరుకు నష్టం



**ఢాకా:** బంగ్లాదేశ్‌లో అనేక రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు,ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. దీంతో 43 మంది మర ణించారు. లక్షలమంది వరదనీటిలో చిక్కుకుపోయారు. పలు ప్రాంతాలలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఆటుపోట్లు, ప్రజలు నీటి మునిగిపోవడం వంటి అనేక ఘటనల్లో మరో 39 మంది గాయపడ్డారు. అనేక ప్రాంతాలలో ఇళ్ళు పూర్తిగా నీట మునిగిపోయాయి. పలు మట్టి ఇళ్ళు కూలిపోయాయి. తీవ్రమైన తాగునీటి కొరత ఏర్పడింది. దీంతో దాదాపు 10 లక్షలమంది పైగా ప్రజలు తీవ్ర ప్రభావానికి గురయ్యారు. 14,296 హెక్టార్లలో పంటలు ధ్వంసమయ్యాయి. చాలా ఇళ్ళల్లో నడుములోతు నీరు నిలిచిపోవడంతో వంట చేసుకునే అవకాశం కూడా లేకుండాపోయింది. రెండు రోజులు గడచినాగానీ ప్రజలకు ప్రభుత్వ అధికారుల నుండి సహాయం లభించలేదు. దీం తో మానవతా సంక్షోభం తలెత్తింది. ప్రజలు నిరాశ్రయులై ప్రభు త్వం సమకూర్చిన తాత్కాలిక షెల్టర్లలో తలదాచుకుంటున్నా రు. దీంతో ఐదు రోజులుగా పాఠశాలలు మూసివేశారు. హెచ్ఎస్‌సి పరీక్షలు వాయిదా వేశారు. రైల్వే సేవలు నిలిచిపోయా యి. వారం రోజుల తర్వాత ఆదివారంనాడు ఈ ప్రాంతంలో ట్రాకులకు మర్మమతులు చేసి రైల్వే సేవలు పునరుద్ధరించారు.కాగా రాజధాని ఢాకాను భారీ వర్షాలు ముంచెత్తియి. నగరవీధులు నదులను తలపించాయి.. జనజీవనం అస్తవ్యస్తం గా మారింది. ఇప్పటివరకూ 37 వేలమంది ప్రజలు ప్రభుత్వ షెల్టర్లలో తలదాచుకున్నారు.బాధిత ప్రజలకోసం 1,727 సహాయ కేంద్రాలు ప్రారంభించినట్లు అధికారులు చెప్పారు.చట్టోగ్రామ్ ప్రాంతం లో తీవ్రనష్టం వాటిల్లింది. అక్కడ జల విలయం సంభవించింది. ఇళ్ళన్నీ నీట మునిగాయి. చిట్టాగాంగ్,సిల్హెట్ ప్రాంతాలను వరదలు కకావికలం చేశాయి. చట్టోగ్రామ్‌తో పాటు కాక్స్‌బజార్,రంగమతి,బందర్బన్,ఖగ్రాచారి ప్రాంతాలలో 8,66,000 మంది ప్రజలు వరదలవల్ల తీవ్రంగా నష్టపోయా రు. బన్స్‌ఖాలి ప్రాంతంలో 60,000 మంది ప్రజలు వరదనీటి బారిన పడ్డారు. చిట్టాగాంగ్‌లోని బంష్‌ఖలి,సత్కానియా,లోహగారా, చందనైష్ ,అన్వారా ఉపజిల్లాలు ముంపనకు గురయ్యాయి. నా 48 ఏళ్ళ జీవితంలో ఇంతటి ప్రకృతి విలయాన్ని, వరద బీభత్సాన్ని చూడలేదని బంష్‌ఖాలి ప్రాంత ఈస్ట్‌ల్హా గ్రామపౌరుడు రుహుల్ అమీన్ వ్యాఖ్యానించారు. ఈ వరద విలయంవల్ల మరణించినవారి అంత్యక్రియలు నిర్వహించడానికి కూడా అవకాశం లేకుండాపోయిందని,శ్మశాన వాటికలు నిలువెత్తు నీటిలో మునిగి ఉన్నాయని చెప్పారు. బుధవారం నుండి ఈ ఉపజిల్లాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మొబైల్‌ఫోన్ టవర్లు కూడా పనిచేయడం మానేశాయి. ఫోన్ రీచార్జింగ్‌కు అవకాశం లేకపోవడంతో సెల్‌ఫోన్ల ససహాయం కూడా బాధితులకు లేదు. బెన్‌పోల్ ఓడరేవులో పలు గిడ్డంగులు నీట మునిగాయి. దిగుమతి చేసుకున్న వస్తువులన్నీ తీవ్రనష్టానికి గురయ్యాయి. 1,091టన్నుల బియ్యం, ,34,470 పొడి ఆహారం ప్యాకెట్లు, మరో ,91,10 రూపాయలు నగదు ప్రజలకు పంపిణీ చేసినట్లు చట్టోగ్రామ్ డివిజనల్ కమిషనర్ మహ్మద్ జియావుద్దీన్ చెప్పారు. ఋతుపవనాల ప్రభావం,వరదలు,కొండవాగులవల్ల సంభవించిన ఆకస్మిక వరదలు జనజీవనాన్ని అతలాకుతం చేశాయని ఆయన చెప్పారు. బాధిత ప్రాంతాలకు వైద్య సహాయ బృందాలను తరలించాలని,నీటిశుద్ధి మాత్రలను ప్రతి ప్రాంతంలో సరఫరా చేయాలని వైద్యశాఖ డైరెక్టర్ జనరల్ కార్యాలయం సమీక్షా సమావేవంలో ఆదేశించింది. వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందువల్ల ఆదివారం నుండి తెరిపివచ్చి కొంత పరిస్థితి కుదుటపడే అవకాశాలు ఉన్నాయని జియావుద్దీన్ చెప్పారు.

## హోర్ముజ్‌పై పరాకాష్ఠకు చేరిన ఆధిపత్యపోరు

జలసంధి మూసేశాం: ఇరాన్ పెత్తనం లేదు

ఇరాన్– సెంట్‌కామ్ పరస్పర ప్రకటనలు



**దుబాయ్:** హోర్ముజ్ జలసంధిపై ఆధిపత్యంకోసం అమెరికా–ఇరాన్ మధ్య పోరు తారాస్థాయియి చేరింది. జలసంధిని మూసివేసినట్లు ఇరాన్ ప్రకటించగా, జలసంధిపై ఇ రాన్ పెత్తనం లేదని, వాణిజ్య నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయని అమెరికా సైనిక విభాగం సెంట్‌కామ్ ప్రకటించింది. మూడో విడత దాడుల తర్వాత సెంట్‌కామ్ ఎక్స్ వేదికగా ఒక ప్రకటన చేస్తూ అన్ని వాణిజ్య నౌకలూ చట్టబద్ధంగా రాకపోకలు సాగించేందుకు జలసంధి తెరచే ఉంటుందని స్పష్టం చేసింది. జలసంధిలో చట్టబద్ధంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా తమ బలగాలను మోహరించి ఉంచామని, నౌకలపై దాడులు జరగకుండా రక్షిస్తామని, ఇరాన్ దురాక్రమణ,వేధింపులు,బెదిరింపు లు, ఏకపక్ష ప్రకటనలు ఉన్నప్పటికీ ఈ జలసంధిపై ఇరా న్ పెత్తనం లేదని సెంట్‌కామ్ అధికారులు ప్రకటించారు. ఇస్లామాబాద్ ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించినందువల్ల, హోర్ముజ్‌లో అక్రమ మార్గాలను ప్రోత్సహిస్తున్నందువల్ల జలసంధిని మూసివేసినట్లు ఇరాన్ ఆదివారం తెల్లవారకముందుగానే ప్రకటన జారీ చేసింది. తమ అదేశాలకు విరుద్ధంగా ఒక వాణిజ్య నౌక ప్రయాణం చేసిందని, దానిని అడ్డుకున్నామని, హోర్ముజ్ తదుపరి తాము ఆదేశాలు జారీ చేసేవరకూ జలసంధి తెరుచుకోదని కూడా ఐఆర్‌జిసి ప్రకటించింది. తమ ఆదేశాలకు విరుద్ధంగా ఒక వాణిజ్య నౌక అక్రమ మార్గంలో ప్రయాణం చేసి వెళుతోందని దానిని అడ్డుకున్నామని ఐఆర్‌జిసి పేర్కొంది. ఇరాన్–అమెరికా మధ్య ప్రస్తుత వివాదానికి హోర్ముజ్ జ లసంధిలో కొత్త జలమార్గాలే ప్రధాన సమస్యగా మా రాయి. తమ ప్రాదేశిక జలాలలో తాము నిర్దేశించిన విధ ంగా తమ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతినౌకా ప్ర యాణం చేయాలని ఇరాన్ పట్టు పడుతుండగా, ఇరాన్ ని ర్దేశిత మార్గాలకు భిన్నంగా ప్రత్యామ్నాయ మార్గాలను వాణిజ్య నౌకలకు అమెరికా సూచిస్తోంది. తను కాదన, వేరే మార్గాలలో నౌకలు ప్రయాణం చేస్తే దాడులు తప్పవని, ఆ నౌకలకు ఎంత మాత్రం రక్షణ ఉండదని ఇరాన్ ఐఆర్‌జిసి హెచ్చరిక చేస్తున్నది. ఈ వివాదం నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. జలసంధిని మూసివేసినట్లు ఇరాన్ ప్రకటించిన కొద్ది గంటలకే అమెరికా మూడో విడత భారీస్థాయిలో ఇరాన్‌పై దాడులు చేసింది.

## అమెరికా సీనియర్ సెనేటర్ లిండ్సే గ్రాహం ఆకస్మిక మృతి

**వాషింగ్టన్:** అమెరికా కాంగ్రెస్‌లో రిపబ్లికన్ సీనియర్ సెనేటర్, అధ్యక్షుడు ట్రంప్ సన్నిహితుడు లిండ్సే గ్రాహం ఆకస్మికంగా మరణించారు. ఆయన వయసు 71 సంవత్సరాలు. కొద్దిపాటి ఆకస్మిక అనారోగ్యం కారణంగా మరణించినట్లు ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. సౌత్ కరోలినాకు చెందిన రాజకీయవేత్త లిండ్సే 2002లో మొదటిసారి సెనేటర్‌గా ఎన్నికయ్యారు. విదేశాంగ విధానంపై ఆయన చాలా శక్తిమంతంగా తన వాదనలను వినిపించేవారు. గ్రాహం లిండ్సే మొదట్లో ట్రంప్‌తో విభేదించారు. 2015లో ఆయన సిఎన్ఎన్‌తో మాట్లాడుతూ, ట్రంప్ జాతి విద్వేషాన్ని రెచ్చగొట్టే, విదేశీయులను ద్వేషించే మత ఛాందసవాది అని ఘాటుగా విమర్శించారు. ట్రంప్‌ను అధ్యక్ష పదవి అభ్యర్థిగా నామినేట్ చేస్తే మనం నాశనమైపోతాం అని కూడా ఆయన 2016లో లిండ్సే సోషల్ మీడియా ద్వారా పోస్టింగ్ పెట్టారు. తర్వాత మిత్రుడయ్యారు. గడచిన శుక్రవారం ఆయన ఉక్రేన్‌లో పర్యటించారు. ఆ దేశాధ్యక్షుడు జెలెన్స్కీతో సమావేశమయ్యారు. దేశానికి తిరిగి వచ్చాక కూడా ఆయనలో ఎలాంటి అనారోగ్య సమస్యలూ కనిపించలేదు. తర్వాత ఆకస్మికంగా మరణించారు. ఆయన మరణం పట్ల ట్రంప్ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. లిండ్సే నిజమైన దేశభక్తుడని అభివర్ణించారు.

## అణుబాంబులకంటే హోర్ముజ్ జలసంధే ముఖ్యం

మొజ్తాబా ఖమేనీ సలహాదారు రెజాయి



**టెహ్రాన్:** డజన్లకొద్దీ అణుబాంబుల కంటే హోర్మ్ముజ్ జలసంధే ఇరాన్‌కు ఎంతో ముఖ్యమైనదని, దా నిని కాపాడుకుంటామని ఆ దేశ సర్వాధినేత మొ జ్తాబా ఖమేనీ సలహాదారుడు మొహ్సెన్ రెజాయి ప్రకటించారు. హోర్ముజ్ జలసంధిని మూసివేశామని ఇరాన్ ప్రకటించగా, అమెరికా తిరస్కరించిం ది. ఈ నేపథ్యంలో రెజాయి ప్రకటన విడుదలైం ది. ఈ ప్రకటనల పోరుతో యుద్ధం ఎటువెళుతు ంది? ఎంఓయు ఒప్పందం భవిష్యత్తు ఏమిటి? అ నే ప్రశ్నలు యావత్ ప్రపంచాన్ని వేధిస్తున్న తరుణంలో అమెరికా–ఇరాన్ మధ్య తుది ఒప్పందానికి, పశ్చిమాసియాలో శాశ్వత శాంతి సాధనకు హోర్ముజ్ జలసంధి పెద్ద అడ్డంకిగా మారింది. కాగా, ఏకపక్ష నిర్ణయాలకు కాలం చెల్లిందని ఇరాన్ పార్లమెంటు స్పీకర్, అమెరికాతో శాంతి చర్చల్లో ప్రధాన అనుసంధానకర్త మొహ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ అమెరికాకు మరోసారి హెచ్చరిక చేశారు.''మేం మీకు ముందుగానే చెప్పాం, మీరు ఇచ్చినమాట నిలబెట్టుకోండి, లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోండి, వాస్తవిక పరిస్థితులు ఇప్పుడు మీ తలుపు తడుతున్నాయి, శత్రువులకు శిక్ష తప్పదు'' అని సోషల్ మీడియా వేదికగా పోస్టింగ్ పెట్టారు. దీనిపై అమెరికా కూడా ఘాటుగా స్పం దించింది. ''ఇరాన్ తప్పుడు నిర్ణయం తీసుకుంది, దానికి ఇప్పుడు మూల్యం చెల్లిస్తోంది'' అని అమెరికా రక్షణమంత్రి పెట్ హెగ్సెత్ ఆన్‌లైన్‌లో పోస్టి ంగ్ రాశారు. ఇస్లామిక్ రిపబ్లిక్ ప్రాదేశిక జలాల ను తప్పించుకుని వెళ్ళేందుకు ప్రత్యామ్నాయ మా ర్గంలో వెళుతున్న మూడు చమురు ట్యాంకర్లపై ఇరాన్ దాడులు చేసి ఒప్పందాన్ని ఉల్లంఘించడంవల్లే గడచిన ఐదురోజుల్లో మూడు విడతలుగా దాడులు చేసినట్లు పేర్కొన్నారు.కాగా గల్ఫ్ అరబ్ దేశాలపై ఆదివారం ఇరాన్ చేసిన దాడులను మధ్యవర్తిదేశం ఖతార్ తీవ్రంగా ఖండించింది. ఖ తార్ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడానికి ఎదురు దాడులు చేసే హక్కు కూడా తమకు ఉం దని హెచ్చరించింది.

## హసీనా దేశంలో కాలుపెట్టగానే అరెస్ట్ చేస్తాం

కోర్టులో లొంగుబాటు సాధ్యంకాదు

వీలైతే దౌత్యమార్గంలో అరెస్టుచేసి తీసుకొస్తాం

ట్రిబ్యునల్ ప్రాసిక్యూటర్ ఇస్లాం ప్రకటన



**ఢాకా:** అంతర్జాతీయ నేరస్థుల ఒప్పందంలో భాగంగా షేక్ హసీనా (పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి)కు లొంగిపోయే అవకాశం లేదని, ఆమె దేశంలోకి అడుగుపెట్టగానే అరెస్టు చేసి జైలులో బంధిస్తామని, తదుపరి విచారణ కొనసాగుతుందని ఆ దేశ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ ప్రధాన ప్రాసిక్యూటర్ అమీనుల్ ఇస్లాం చెప్పారు. తాను బంగ్లాదేశ్ వెళతానని, చావుకు భయపడబోనని, ఈ ఏడాది డిసెంబరులోపు తన జన్మభూమికి తిరిగి వెళతానని భారత్‌లో తలచుకుంటున్న షేక్ హసీనా ఇటీవల రెండుసార్లు ప్రకటనలు చేసిన పూర్వరంగంలో ట్రిబ్యునల్ ప్రాసిక్యూటర్ ఇస్లాం ఆదివారం మీడియా సమావేశంలో పైవిధంగా స్పందించారు. ''ఆమె ప్రస్తుతం భారత ప్రభుత్వ నియంత్రణలో ప్రవాసంలో ఉన్నారు, కానీ ఆమె ఇప్పుడు తన ఇష్టానుసారం ఒక సాధారణ పౌరురాలు హోదాలో దేశానికి తిరిగి రాలేరు, లొంగిపోయేందుకు వీలుకాదు,వెంటనే అరెస్టు చేస్తాం'' అన్నారు. గడచిన గురువారం షేక్‌హసీనా అవామీ లీగ్ నాయకులతో టెలిఫోన్‌లో గంటసేపు మాట్లాడారు. తాను దేశానికి వస్తానని, కోర్టులో లొంగిపోతానని చెప్పారు. బంగ్లాదేశ్‌లో 2024 జులైలో జరిగిన చరిత్రాత్మక తిరుగుబాటు తర్వాత ఆమె ప్రత్యేక విమానంలో భారత్‌కు వెళ్ళి అజ్ఞాతంలో ఉన్నారు. ఇటీవల రాయిటర్స్ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా ఆమె స్వదేశానికి వెళ్ళిపోతానని చెప్పారు.
దీనిపై ఇస్లాం స్పందిస్తూ,షేక్ హసీనా తన పార్టీ కార్యకర్తలు, నాయకుల కార్యకలాపాల ద్వారా దేశాన్ని అస్థిరపరచేందుకే ఇలాంటి ప్రకటన చేశారన్నారు. ఆమెను తనంతట తానుగా దేశానికి తిరిగి రావాలని కోరుకుంటున్నారని, దీనికి బదులుగా తమ ప్రభుత్వం ఆమెను దౌత్యమార్గాల ద్వారా దేశానికి తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఆమె కోర్టుకు హాజరుకాకపోయినాగానీ, న్యాయస్థానం ఆమెకు మరణశిక్ష విధిస్తూ తీర్పుచెప్పింది. మరణశిక్ష పడిన పరారీలో ఉన్న నేరస్థురాలికి బెయిలు వచ్చే అవకాశం లేదని, ఆమె దేశంలోకి రాగానే అరెస్టు చేస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.తీర్పు చెప్పిన 30 రోజుల్లో ఆమె లొంగిపోవాల్సి ఉందని, కానీ నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోనందువల్ల అప్పీలు చేసుకునే హక్కును కూడా ఆమె కోల్పోయారని చెప్పా రు. ఆమె ఆస్తులను జప్తు చేయాలని న్యాయస్థానం తీర్పు చెప్పినందువల్ల ఆమె వాటిని అనుభవించే హక్కు లేదన్నారు. 2024 తిరుగుబాటు సమయంలో మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిణ అణచివేత నేరాలు సహా ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న పది ప్రధాన కేసుల దర్యాప్తు కూడా తుదిదశకు వచ్చిందని చెప్పారు.

## ఏడిపిస్తున్న ఎల్‌నినో

(మొదటి పేజీ తరువాయి)

లక్షల ఎకరాల్లో (అంటే కేవలం 6.40 శాతం) మాత్రమే నాట్లు పడ్డాయి. వర్షాలు లేకపోవడంతో నీరు లేక వేసిన నారుమడులు ఎండిపోతున్నాయి. మరోవైపు తొలకరి జల్లులు చూసి రైతులు ముందస్తుగా వేసిన పత్తి, మొక్కజొన్న, కంది వంటి అరుతడి పంటల మొలకలు ఎండ తీవ్రతకు, తేమ లేక ఎండి పోతున్నాయి. దీంతో చాలా మంది రైతులు విత్తనాలు మొలకెత్తక రెండు, మూడు సార్లు విత్తనాలు వేయాల్సి రావడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. మరోవైపు తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా చాలా గ్రామాల్లో పశువులకు పచ్చిమేత దొరకడం కూడా గగనమైపోయింది.

**వట్టి పోతున్న సాగునీటి ప్రాజెక్టు**

ఎల్‌నినో దెబ్బకు వర్షాలు లేకపోవడంతో కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రధాన సాగు నీటి ప్రాజెక్టులు వట్టిపోతున్నాయి.రెండు ప్రధాన బేసిన్లలో సాధారణంగా ఈ సమయానికి రిజర్వాయర్లలో 522.31 టిఎంసిల నీటి నిల్వలు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 333.34 టిఎంసిల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. తెలంగాణలో అధిక శాతం వ్యవసాయం బోరు బావులపై ఆధారంపడి ఉండగా, వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు భారీగా క్షీణించాయి. వ్యవసాయ బోర్లు పూర్తిగా ఎండిపోతున్నాయి. దీంతో రైతులు 1000 అడుగులు వేసినా చుక్క నీరు పడని పరిస్థితి నెలకొంది. వర్షకాలంలో ఈ పరిస్థితి ఉంటే రబీ సీజన్‌లో ఎలా ఉండనుందోనని అందోళన చెందుతున్నారు.

**ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏ ప్రాజెక్టులోనూ నీరు లేదు**

వర్షం కాలం సగం ముగిసిన సరైన వర్షం కురవక పోవడంతో జలవనరులు వట్టిపోతున్నాయి. నాగార్జున సాగర్ పరివాహక ప్రాంతంలో ఉన్న చెరువులు, కుంటలలో కొద్ది కొద్దిగా నీరు కనపడుతుంది తప్ప మిగిలిన ప్రాంతాల్లో జలవనరులు ఎండిన బీళ్లను తలపిస్తున్నాయి. మధ్యతరహా ప్రాజెక్టులలో కూడా నీరు లేదు. రెండు రోజుల నుంచి రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా వైరా మధ్యతరహా ప్రాజెక్టులోకి గోదావరి నీరు చేరుతుంది. ఎన్ని రోజులకు వైరా చెరువు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుతుందో స్పష్టత లేదు. వైరా, పాలేరు, లంకా సాగర్ మొదలైన మధ్యతరహా ప్రాజెక్టులను మినహాయిస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏ ప్రాజెక్టులోనూ నీరు లేదు. వర్షాలు లేకపోవడంతో సాగునీటిని అందించడం సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. జీవనది లాంటి మున్నేరుకు ఇంత వరకు కొత్త నీరు రాకపోవడంతో నీటి కదలిక లేదు. వైరా, కిన్నెరసాని, కట్టలేరు, పెద్దవాగు, ముక మామిడి మొదలైన ప్రాజెక్టుల క్రింద ఉన్న లక్షలాది ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారింది.

**శాపమైన జాప్యం :** సాగునీట ప్రాజెక్టుల పట్ల పాలకుల నిర్లక్ష్యం రైతాంగానికి శాపంగా మారింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పంటల భూములకు సాగునీటిని అందించేందుకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు కానీ ఎకరానికి కూడా నీటిని అందించ లేదు. ప్రతి ఏడాది సుమారు 750 టిఎంసిల గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయి. గోదావరి నీటిని పొలాలకు మళ్లించాలన్న సుదీర్ఘ పోరాటాల ఫలితంగా 2004లో జలయజ్ఞం ద్వారా గోదావరి నీటిని ఎత్తిపోసేందుకు రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ ల పేరుతో రెండు ప్రాజెక్టులు ప్రారంభించి రూ.2,100 కోట్లు ఖర్చు చేశారు. వైఎస్ మరణం, రాష్ట్ర విభజన నేపథ్యంలో ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణం ఆగిపోయింది. రాష్ట్ర విభజన తర్వాత 2016లో సీతారామ ప్రాజెక్టు పేరుతో గోదావరి జలాలను ఎత్తిపోసేందుకు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2019 నాటికి పూర్తి కావాల్సిన ప్రాజెక్టుకు బిఆర్ఎస్ తొమ్మిదివేల కోట్లు ఖర్చు చేసింది. ప్రధాన కాలువల్లో అధిక భాగం పంపు హౌజ్‌లు పూర్తి చేశారు. కాంగ్రెస్ సీతారామను కాదనకపోయినా సరిపడ నిధులు కేటాయించకపోవడంతో అంచనాలు పెరిగి ఎప్పటికీ పూర్తవుతుందో చెప్పలేని స్థితి. ఎల్‌నినోలో కూడా గోదావరికి కొత్త నీరు చేరుతుందన్న సందర్భంలో ప్రాజెక్టులు పూర్తయి ఉంటే ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని సుమారు ఏడు లక్షల ఎకరాలకు సాగునీటి కొరత ఉండేది కాదు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యమే ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగం పాలిట శాపంగా మారి ఆకాశం వైపు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## 22 కొత్త రేడియల్ రోడ్‌లు

(మొదటి పేజీ తరువాయి)



ట్రాఫిక్ రద్దీ, నగర విస్తరణ, శివారు ప్రాంతాల్లో వేగంగా పెరుగుతున్న నివాస, పారిశ్రామిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ రేడియల్ రోడ్లను ప్రతిపాదించినట్లు అధికారులు తెలిపారు. వీటి ద్వారా నగర కేంద్రం నుంచి శివారు ప్రాంతాలకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడంతో పాటు జాతీయ, రాష్ట్ర రహదారుల మధ్య మెరుగైన అనుసంధానం ఏర్పడనుంది. ప్రతిపాదిత రహదారులు పటాన్‌చెరు, శంషాబాద్, షామీర్‌పేట్, ఘట్‌కేసర్, యాచారం, చేవెళ్ల, మెడ్చల్, కీసర, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాలను కలుపుతూ అభివృద్ధి చేయనున్నట్లు ప్రణాళికలో పొందుపర్చారు. ఆయా మార్గాల ప్రాధాన్యాన్ని బట్టి 24 మీటర్ల నుంచి 60 మీటర్ల వరకు వెడల్పు నిర్ణయించారు. మాస్టర్‌ప్లాన్‌లో ప్రతిపాదించిన ఈ రహదారులు అమల్లోకి వస్తే నగర పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్, పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలకు మరింత ఊతం లభించే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు ప్రతిపాదిత రహదారుల పరిధిలోకి వచ్చే భూములు, నిర్మాణాలపై భవిష్యత్‌లో ప్రణాళికా నిబంధనలు వర్తించే అవకాశం ఉండటంతో ఆయా ప్రాంతాల భూ యజమానుల్లో ఆసక్తి నెలకొంది. హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్‌కు ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించిన అనంతరం తుది రూపు ఇవ్వనున్నారు. అనంతరం దశలవారీగా రహదారుల అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంది. నగర భవిష్యత్ రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంలో ఈ 22 రేడియల్ రోడ్లు కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు అంటున్నారు.

**భూసేకరణ, ఆస్తుల నష్టపరిహారానికి ప్రాధాన్యత**

రోడ్ల విస్తరణలో భాగంగా భూములు, ఆస్తులు కోల్పోయే బాధితులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. నష్టపరిహారం చెల్లింపు, పునరావాస చర్యలు సజావుగా సాగేలా ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయి పరిశీలనలు చేయనున్నాయి. రహదారుల నిర్మాణంతో పాటు ఫుట్‌పాత్‌లు, సైనేజీలు, డ్రైనేజీ వ్యవస్థలను ఈ ప్రతిపాదనల్లో చేర్చారు.
భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా 'హైమొబిలిటీ' కారిడార్లు గచ్చిబౌలి, కోకాపేట, శంషాబాద్, మేడ్చల్ వంటి కీలక వృద్ధి కేంద్రాల మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఈ 22 రహదారుల విస్తరణ పూర్తయితే, రాబోయే రెండు దశాబ్దాల పాటు మహానగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సౌకర్యవంతమైన ప్రయాణం సాధ్యమవుతుందని హెచ్ఎండిఏ ఉన్నతాధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఈ మార్గాలను 'గ్రీన్ సిటీ', 'ఫ్యూచర్ సిటీ' కనెక్టివిటీకి లైఫ్‌లైన్‌గా మార్చనున్నారు.

**విస్తరించనున్న 22 ప్రధాన రహదారులు..**

| రోడ్డు మార్గం | కారిడార్ | ప్రతిపాదిత వెడల్పు |
|---|---|---|
| పీర్జాదిగూడ టీజంక్షన్ | బోడుప్పల్ టీజంక్షన్ | 30 నుండి 45 మీటర్లు |
| ఉప్పల్ ఖల్సా ఘట్‌కేసర్ ఖల్సా | (పీర్జాదిగూడ, మేడిపల్లి మీదుగా) | 60 మీటర్లు |
| చెంగిచెర్ల ఎక్స్ రోడ్డు | (ఉప్పల్) చర్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియా | 12 నుండి 24 మీటర్లు |
| గుండ్లపోచంపల్లి ఖల్సా | కండ్లకోయ, దూలపల్లి, ఘట్‌కేసర్ | 60 మీటర్లు |
| బాచుపల్లి నిజాంపేట్ | ప్రగతి నగర్ ఖల్సా | 30 మీటర్లు |
| మియాపూర్ జంక్షన్ | అమీన్పూర్ సుల్తాన్‌పూర్ ఔటర్ రింగ్ రోడ్డు | 30 నుండి 36 మీటర్లు |
| తెల్లాపూర్ గచ్చిబౌలి | నార్సింగి | 24 నుండి 60 మీటర్లు |
| కోకాపేట ఖల్సా | నార్సింగి మంచీరేవుల | 60 మీటర్లు |
| నార్సింగి విలేజ్ టీజంక్షన్ | మంచీరేవుల | 45 మీటర్లు |
| ఇబ్రహీంపట్నం ఖల్సా | ఔటర్ రింగ్ రోడ్డు టీజంక్షన్ | 35 నుండి 60 మీటర్లు |
| గచ్చిబౌలి | నార్సింగి, కోకాపేట | 60 మీటర్లు |
| షేక్‌పేట, మణికొండ బౌండరీ | పుప్పాలగూడ మీదుగా నార్సింగి | 60 మీటర్లు |
| కిస్మత్‌పూర్ | బండ్లగూడ జాగీర్, చేవెళ్ల హైవే | 60 మీటర్లు |
| బుద్వేల్ విలేజ్ ఖల్సా (రాజేంద్రనగర్) | కిస్మత్‌పూర్ | 24 మీటర్లు |
| అప్పా జంక్షన్ హిమాయత్ సాగర్ | మొయినాబాద్ బౌండరీ | 24 మీటర్లు |
| శంషాబాద్ ఖల్సా | ఆదిభట్ల ఔటర్ రింగ్ రోడ్డు | 36 మీటర్లు |
| తూంకుంట | ఎన్‌హెచ్44 కారిడార్ | 24 మీటర్లు |
| ఎన్‌హెచ్44 | కొంపల్లి రోడ్డు నెట్‌వర్క్ | 24 మీటర్లు |
| మేడ్చల్ ఖల్సా | ఔటర్ రింగ్ రోడ్డు | 24 మీటర్లు |
| పెద్ద అంబర్‌పేట్ | పసుమాముల బౌండరీ | 30 మీటర్లు |
| మహేశ్వరం రోడ్డు | శ్రీశైలం హైవే | 30 మీటర్లు |
| బొంగుళూరు టీజంక్షన్ | కొంగర కలాన్ | 30 మీటర్లు |


## ఇరాన్ దాడి

(మొదటి పేజీ తరువాయి)

దాడి చేసిందని, దీంతో మంటలు చెలరేగి నౌక స్తంభించిపోయిందని సెంట్‌కామ్ ఆదివారం ప్రకటించింది. ఈ ఘటన తర్వాత పై వర్గాల ఆదేశాల మేరకు సిబ్బంది నౌకను విడిచిపెట్టి లైఫ్‌బోటులోకి చేరారని, ప్రస్తుతం వారు లైఫ్‌బోటులోనే ఉన్నారని తెలియజేసింది. ఈ దాడి ఒమన్ తీరానికి పది కిలోమీటర్ల దూరంలో జరిగిందని బ్రిటన్ సముద్రయాన సంస్థ యుకెఎంటిఓ వర్గాలు తెలియజేశాయి. జులై ఏడో తేదీన ఖమేనీ అంతిమయాత్ర కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. తుది ఒప్పందానికి రాకపోతే 'తమ పని పూర్తి చేస్తాం' అని ట్రంప్ హెచ్చరించడంతో ఆ సాయంత్రం దాటిన తర్వాత హోర్ముజ్ జలసంధిలో మూడు అమెరికా చమురు ట్యాంకర్లపై ఐఆర్‌జిసి దాడులు చేసింది. దీంతో బుధవారం ఉదయమే అమెరికా యుద్ధం ప్రారంభించింది. కాల్పుల విరమణ రద్దుచేశామని ప్రకటించింది. దీనికి ప్రతిగా హోర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించి, అమెరికా స్థావరాలపై దాడులు ప్రారంభించింది. ఈ దాడుల్లో భాగంగా అమెరికా ఆదివారం తెల్లవారకముందే మూడోవిడత భీకరంగా గగనతల దాడులు కొనసాగించింది. మొత్తం 140 లక్ష్యాలపై దాడులు చేసినట్లు సెంట్రల్ కమాండ్ ఎక్స్ వేదికగా ప్రకటించింది. మూడు విడతలుగా 315కు పైగా ఇరాన్ లక్ష్యాలను దెబ్బతీశామని పేర్కొంది. ఇరాన్‌లోని ఎనిమిది నగరాల్లో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి.ప్రధానంగా ఇరాన్ కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్,తీర ప్రాంతంలో ఉన్న స్థావరాలు,గస్తీ,నిఘా కేంద్రాలపై అమెరికా దాడులు కొనసాగించింది. ఇంతకుముందు రెండు విడతల దాడులకంటే తీవ్రంగా క్షిపణి,డ్రోన్, ప్రయోగస్థావరాలు, మందుగుండు సామాగ్రి నిల్వ కేంద్రాలు,సమాచార ప్రసార పరికరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్లు పేర్కొంది. దక్షిణ ఇరాన్ రాష్ట్రం,టెహ్రాన్ సమీప ప్రాంతాలు సహా ఇరాన్ వ్యాప్తంగా పలుచోట్ల దాడులు జరిగాయి. దీంతో ఇరాన్ కూడా బహ్రైన్, కువైట్, ఖతార్, ఒమన్, జోర్డాన్ సహా పలు గల్ఫ్ అరబ్ దేశాలలో అమెరికా సైనిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. గల్ఫ్ దేశాల్లో అమెరికా స్థావరాలపై దాడులు కొనసాగించినట్లు ఇరాన్ ఐఆర్‌జిసి ప్రకటన చేసింది.
ఖతార్, బహ్రైన్, ఒమన్‌లలో ఇరాన్ దాడులు చేసింది. ఒమన్‌పోర్టుపై భారీస్థాయిలో దాడులు చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ దాడులతో గల్ఫ్ అరబ్ దేశాలలో సర్వత్రా క్షిపణి,డ్రోన్ హెచ్చరికల మోత మోగింది. ఇరాన్ నుండి వస్తున్న కాల్పులను తాము అడ్డుకున్నామని, పొరుగున ఉన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో కాల్పుల శబ్దాలు, పేలుడు శబ్దాలు వినిపించాయని ఖతార్ సైన్యం ప్రకటించింది. పేలుళ్ళు అడ్డుకునే క్రమంలో ఒక చిన్నారి సహా ముగ్గురు గాయపడ్డారని ఖతార్ హోంమంత్రి చెప్పారు. యుఎఇ సరిహద్దుల్లోకి క్షిపణులు ప్రవేశించలేదని, కానీ అప్రమత్తంగా సైరన్లు మోగించామని యుఎఇ ప్రకటించింది. గడచిన మే నెలలో యుఎఇలో ఇరాన్ తుది దాడులు జరిగాయి. జోర్డాన్ సహా పలు దేశాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుందని ఖతార్ విదేశీమంత్రిత్వ శాఖ విమర్శించింది. ఈ దాడులపై ప్రతిస్పందించడానికి, సార్వభౌమాధికార భద్రత రక్షణకు తమకు పూర్తి హక్కులున్నాయని హెచ్చరించింది. ఈ దాడులను ప్రమాదకర ఉద్రిక్త పరిస్థితిగా అభివర్ణించింది.

## భారత్ ఖండన

(మొదటి పేజీ తరువాయి)



జలసంధి ప్రాంతంలో వాణిజ్య నౌకలు,పౌర సదుపాయాలను లక్ష్యాలుగా చేసుకుని ఎలాంటి దాడులు జరగకుండా చూడాలని, ఈ దాడులను తక్షణం నిలిపివేయాలని కోరింది. హోర్ముజ్ జలసంధిలోని ప్రధాన రవాణా మార్గం లోంచి ప్రయాణం చేస్తున్న సమయంలో సైప్రస్‌జెండాతో వెళుతున్న కంటైనర్ నౌక జిఎఫ్ఎస్ గెలాక్సీపై ఇస్లామిక్ రిపబ్లిక్ గార్డ్ కోర్ సైనికులు అత్యంత క్రూరంగా దాడిచేశారని అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారులు ఎక్స్ వేదికగా ఆదివారం ఉదయం ప్రకటించారు. ఈ దాడిలో నౌక ఇంజిన్ రూమ్ మంటల్లో దగ్ధమైందని, నావికుల సిబ్బందిలో ఒకరు గల్లంతయ్యారని ప్రకటించింది. పదిమంది సిబ్బంది సురక్షితంగా లైఫ్‌బోటులోకి ఎక్కారని కూడా పేర్కొంది. అదేవిధంగా బ్రిటన్‌కు చెందిన సముద్ర వాణిజ్య కార్యకలాపాల సంస్థ (యుకెఎంటిఓ) మరో ప్రకటన చేస్తూ, జిఎఫ్ఎస్ గెలాక్సీ నౌకను ఆదివారం తెల్లవారుజామునే ఇరాన్ సైనికులు లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారిన, దీనివల్ల నౌక ఇంజన్ రూములో మంటలు చెలరేగాయని పేర్కొంది. భారత విదేశీ మంత్రిత్వశాఖ తన ప్రకటనలో పదిమంది భారతీయులను కాపాడామని, వారు సురక్షితంగా ఉన్నారని పేర్కొంది. ఒమన్ దేశాధికారులతో తాము ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సమన్వయంతో వ్యవహరిస్తున్నామని, వారి భద్రతకు జాగ్రత్తలు చేపట్టామని పేర్కొంది. తక్షణం ఉద్రిక్తతలకు స్వస్తిచెప్పాలని పునరుద్ఘాటిస్తున్నాం,శాంతి,స్థిరత్వాలను ఈ ప్రాంతంలో నెలకొల్పాలి'' అని పేర్కొంది. ఈ ప్రాంతంలో పౌర సదుపాయాలపై దాడులు నిలిపివేయాలి, నౌకాయాన స్వేచ్ఛ కొనసాగాలి,అంతర్జాతీయ చట్టాలను బలంగా అమలు చేయాలి అని కోరింది. మరోవైపు సెంట్‌కామ్ కూడా ఆందోళన వ్యక్తం చేస్తూ, హోర్ముజ్‌లో శాంతి కాపాడేందుకు అమెరికా ప్రభుత్వం ఎంతో ఖర్చుచేస్తోందని,పౌర సదుపాయాలు,వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు చేస్తూ ఈ ప్రాంతంలో స్థిరత్వం లేకుండా చేస్తోందని విమర్శించింది. గడచిన మంగళవారం(జులై 7) సాయంత్రం హోర్ముజ్ జలసంధిలో మూడు చమురు నౌకలపై ఇరాన్ దాడులు చేయడంతో ఆ మరునాటి నుండే అమెరికా దాడులు ప్రారంభించింది. బుధవారం ఇరాన్‌లోని 85 లక్ష్యాలపైన,గురువారం 90 లక్ష్యాలపైనా దాడులు చేసిన అమెరికా ఆదివారం మూడో విడత 140 లక్ష్యాలపై దాడులు చేసింది. ఇరాన్ డ్రోన్,క్షిపణి స్థావరాలు,యుద్ధ సామాగ్రి నిల్వకేంద్రాలపై ఈ దాడులు జరిగాయి. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా గల్ఫ్‌వ్యాప్తంగాన్,కువైట్,జోర్డాన్,ఖతార్,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌దేశాలలో అమెరికా స్థావరాలపై దాడులు చేసింది

## సోనమ్ ఆరోగ్యం

(మొదటి పేజీ తరువాయి)

సిజెపి పేర్కొంది. సిపిఐ(ఎంఎల్) లిబరేషన్‌కు అనుబంధంగా ఉన్న 'ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్' (ఎఐఎస్ఎ) సభ్యులు నేహా, మనీష్, దీపక్ కుమార్ వర్మ, అమీన్ నిరసన స్థలంలోని వేరొక వేదికపై తమ నిరవధిక నిరాహార దీక్షను కొనసాగించారు. కాగా, పరీక్షల అవకతవకల కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ. 1 కోటి పరిహారం చెల్లించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సిజెపి డిమాండ్ చేస్తోంది. వర్షాకాల సమావేశాలు ప్రారంభ రోజైన ఈనెల 20న పార్లమెంటుకు శాంతియుత ర్యాలీని కూడా ఆ సంస్థ ప్రకటించింది.

# టీమిండియా ఇన్నింగ్స్ డిక్లేర్!



యస్తిక చిరస్మరణీయ శతకం

రెండో రోజే లార్డ్స్ టెస్టులో పట్టుబిగించిన భారత జట్టు ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. యస్తికా భాటియా (113) చిరస్మరణీయ శతకంతో చెలరేగగా.. స్మృతి మంధాన(70), రీచా ఘోష్(50 నాటౌట్)లు అర్ధ శతకాలతో భారీ స్కోరందించారు. తొలి టెస్టు సెంచరీ కొట్టిన యస్తిక ఔటయ్యాక.. దూకుడుగా ఆడిన రీచా.. ఫిఫ్టీ పూర్తి చేసుకోగానే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 341/7 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ఇంగ్లండ్‌కు 457 పరుగుల కఠినమైన లక్ష్యాన్ని నిర్దేశించింది టీమిండియా. లార్డ్స్ వేదికగా జరుగుతున్న ఏకైక టెస్టులో భారత జట్టు పటిష్ఠ స్థితిలో నిలిచింది. చరిత్రాత్మక మ్యాచులో టాపార్డర్ మెరుపులతో ఇంగ్లండ్కు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది టీమిండియా. ప్రత్యర్థిని 170కే పడగొట్టిన భారత్. రెండో ఇన్నింగ్స్‌లో రెచ్చిపోయింది. మూడోరోజు తొలి సెషన్‌లో యస్తికా భాటియా (113) సుదీర్ఘ ఫార్మాట్‌లో తొలి శతకంతో మెరిసింది.

**250-4తో లంచ్‌కు**

మంధాన, భాటియా మెరుపులతో టీమిండియా ఆధిక్యం మూడొందలు దాటింది. అయితే.. మంధాన జెమీమా రోడ్రిగ్స్(3)లను ఔట్ చేసిన లారెన్ బెల్(2–27) ఆతిథ్య జట్టుకు బ్రేకిచ్చింది. కాసేపటికే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(16)ను ఎకిల్‌స్టోన్ (5–118) ఎల్బీగా వెనక్కి పంపింది. టపటపా మూడు వికెట్లు పడడంతో యస్తిక, దీప్తి శర్మ(10) లు ఆచితూచి ఆడారు. దాంతో, 250–4తో లంచ్‌కు వెళ్లింది టీమిండియా. అప్పటికి 91 పరుగులతో ఉన్న యస్తికా.. ఇసీ వాంగ్ ఓవర్‌లో సింగిల్‌తో టెస్టుల్లో మొదటిసారి మూడంకెల స్కోరందుకుంది. క్రీజునంటుకున్న దీప్తి, యస్తికలను వెనక్కి పంపిన ఎకిల్‌స్టోన్.. స్నేహ్ రానా(1)ను ఔట్ చేసి ఐదో వికెట్ సాధించింది. అనంతరం రీచా ఘోష్(52 నాటౌట్), సయాలీ సత్ఘరే(18 నాటౌట్)లు దూకుడుగా ఆడారు. 52 బంతుల్లో రీచా అర్ధ శతకం పూర్తి చేసుకోగానే కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ బాల్కనీ నుంచి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. 115 పరుగుల ఆధిక్యం.. రెండో ఇన్నింగ్స్‌లో 341 రన్స్ కలిపి.. ప్రత్యర్థికి 457 రన్స్ లక్ష్యంగా భారత్ నిర్దేశించింది.



# ఇంగ్లండ్ కోచ్ పదవికి మెక్కల్లమ్ రాజీనామా!



ఇంగ్లండ్ ప్రధాన కోచ్ పదవికి బ్రెండన్ మెక్కల్లమ్ రాజీనామా చేశాడు. ఇటీవల జట్టు చెత్త ప్రదర్శనతో విమర్శల పాలైన మెక్కల్లమ్ ఆదివారం తాను కోచ్‌గా వైదొలుగుతున్నట్టు ప్రకటించాడు. కెప్టెన్‌గా బెన్ స్టోక్స్ వైదొలగడంతో.. 'ఇక నేను ఉండి ఏం లాభం' అనుకున్నాడేమో తాను కూడా ఇంగ్లండ్, వేల్స్ బోర్డుకు టాటా చెప్పేశాడు. సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో టెస్టు మధ్యలోనే బెన్ స్టోక్స్ రిటైర్‌మెంట్ అనంతరం తదుపరి హెడ్‌కోచ్ బ్రెండన్ మెక్కల్లమ్ రాజీనామానే బాకీ అనుకున్నారంతా. అందరూ ఊహించినట్టే విమర్శకులకు మరింతగా తిట్టిపోసే అవకాశమివ్వకుండా మెక్కల్లమ్ వైదొలిగాడు. 'బజ్ బాల్' ఆటతో టెస్టులకు కొత్త రూపునిచ్చిన మెక్కల్లమ్‌ను ఇటీవల యాషెస్ సిరీస్‌లో ఓటమి, స్వదేశంలో న్యూజిలాడ్ చేతిలో 12తో సిరీస్ కోల్పోవడం వంటివి బాధించాయి. విఫల కోచ్‌గా ఉండడం కంటే బాధ్యతల నుంచి తప్పుకోవడమే సరైందని అతడు భావించాడు. ఇంకా ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆదివారం తన నిర్ణయాన్ని ప్రకటించాడు.

**2022లో బాధ్యతలు..** న్యూజిలాండ్ ఓపెనర్‌గా మెక్కల్లమ్ ఎన్నో విధ్వంసక ఇన్నింగ్సులు ఆడాడు. ఆ తర్వాత కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ఐపీఎల్ ఆరంభ సీజన్ 2008లోనే శతకం బాదిన అతను 2022లో క్రిస్ సిల్వర్వుడ్ అనంతరం ఇంగ్లండ్ ప్రధాన కోచ్గా బాధ్యతలు చేపట్టాడు. ఆ సమయానికి ఆ జట్టు టెస్టుల్లో వరుస ఓటములను చవిచూస్తోంది. అలాంటి జట్టును ఒక్క ఏడాదిలోనే మెక్కల్లమ్ మార్చేశాడు. తన స్టయిల్ విధ్వంసక ఆటను జట్టుకు ఒంటబట్టించాడు. స్ట్రోక్ ప్లేతో అలరించే బెన్ స్టోక్స్ కెప్టెన్ అయ్యాక అతడి పని మరింత సులువైంది. మెక్కల్లమ్‌ను అభిమానులు ముద్దుగా 'బాజ్' అని పిలుస్తారు. దాంతో, అతను నేర్పిన ఆటకు 'బజ్‌బాల్' అనే పేరు ప్రచారంలోకి వచ్చింది. గత ఏడాది నుంచి ఇంగ్లండ్ టెస్టుల్లో అదరగొడుతోంది. పాకిస్థాన్ పర్యటనలో స్టోక్స్ సేన మూడు టెస్టులు నెగ్గి రికార్డు సృష్టించింది. ఆ తర్వాత స్వదేశంలో ఐర్లాండ్‌తో జరిగిన ఏకైక టెస్టులోనూ సంచలన విజయం సాధించింది.

# ఆరోగ్యం

## యవ్వనంలోనే హైబిపి..

- ముందస్తు పరీక్షలే రక్షణ కవచం

భారతదేశంలో ఒకప్పుడు కేవలం వృద్ధులలో మాత్రమే కనిపించే రక్తపోటు (హైపర్ టెన్షన్) సమస్య, ఇప్పుడు యువతలో వేగంగా పెరుగుతోంది. శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం, దీర్ఘకాలిక మానసిక ఒత్తిడి, జంక్ ఫుడ్స్ అలవాటు వంటి జీవన శైలి మార్పులే దీనికి ప్రధాన కారణాలని గుండె వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవలి ఎన్ఎఫ్‌హెచ్ఎస్–6 గణాంకాల ప్రకారం.. దేశంలో 15 ఏళ్లు పైబడిన వారిలో 19.4 శాతం మహిళలు, 22.1 శాతం పురుషులు అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణాల్లో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది. హైబిపికి ప్రాథమికంగా ఎలాంటి లక్షణాలు ఉండవు. అందుకే దీనిని 'సైలెంట్ కిల్లర్' అంటారు. ఎయిమ్స్ కార్డియాలజీ విభాగం అధిపతి డాక్టర్ రాజీవ్ నారంగ్ అభిప్రాయాన్ని అనుసరించి, పదేళ్ల క్రితం 40 ఏళ్లలోపు వారిలో బిపి అరుదుగా కనిపించేది. కానీ ఇప్పుడు రోజూ చూస్తున్నాం. సాఫ్ట్‌వేర్, కార్పొరేట్ ఉద్యోగుల్లో సుదీర్ఘ గంటల కూర్చునే అలవాటు, నిద్రలేమి, ఒత్తిడి వల్ల రక్తనాళాలు చిన్న వయసులోనే బలహీనపడుతున్నాయి. హార్ట్ లంగ్స్ డిసీజెస్ రీసెర్చ్ సెంటర్ చైర్మన్ డాక్టర్ రాహుల్ చందోలా ప్రకారం.. చాలామంది యువకులు తాము ఆరోగ్యంగా ఉన్నామనే అనుకుంటారు. వేరే ఇతర పరీక్షలు లేదా గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లోనే ఇది బయటపడుతుంది. ఆసుపత్రిలో ఒకసారి చూసే రీడింగ్ కంటే, ఇంట్లోనే డిజిటల్ పరికరాల ద్వారా క్రమంగా బిపిని పర్యవేక్షించడం ఉత్తమం.

భారతీయులలో ఉప్పు వినియోగం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) నిర్దేశించిన 5 గ్రాముల కంటే చాలా ఎక్కువగా ఉంటోంది. దీనిని తగ్గించడం తక్షణ అవసరం. వారానికి కనీసం 150 నిమిషాల వ్యాయామం లేదా నడక తప్పనిసరి. ఆహారంలో పండ్లు, కూరగాయలు పెంచి, ప్రాసెస్ చేసిన ఆహారాలను, ఉప్పును తగ్గించాలి. బరువును అదుపులో ఉంచుకుంటూ, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలి. తగినంత నిద్ర, మానసిక ఒత్తిడి నిర్వహణ ముఖ్యం. బిపి అనేది వృద్ధాప్య జబ్బు అనే అపోహ వీడాలి. శరీర బరువు, షుగర్ లెవెల్స్ లాగే రక్తపోటును కూడా క్రమం తప్పకుండా పరీక్షించుకోవడం ద్వారా భవిష్యత్తులో వచ్చే గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, కిడ్నీ వ్యాధుల ముప్పును ముందుగానే అడ్డుకోవచ్చు.




## పెరుగుతున్న కేన్సర్ కేసులు




ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 2.06 కోట్ల కొత్తకేన్సర్ కేసులు నమోదవుతుండగా, దాదాపు ఒక కోటి మంది ఈ వ్యాధితో మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) విడుదల చేసిన తాజా నివేదిక స్పష్టం చేస్తున్నది. రోజుకు సగటున 26 వేల మందికిపైగాకేన్సర్ కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే 2050 నాటికి ప్రతి ఏడాది నమోదయ్యే కొత్తకేన్సర్ కేసుల సంఖ్య దాదాపు 3.5 కోట్లకు చేరుకుంటుందని డబ్ల్యుహెచ్ఓ అంచనా వేసింది. గుండె సంబంధిత వ్యాధుల తర్వాత ప్రపంచంలో అత్యధిక మరణాలకు కారణమవుతున్న రెండో ప్రధాన వ్యాధిగా కేన్సర్ కొనసాగుతోంది. డబ్ల్యుహెచ్ఓ, ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్‌కేన్సర్ సంయుక్తంగా రూపొందించిన 'గ్లోబల్ స్టేటస్ రిపోర్ట్ ఆన్ కేన్సర్–2026' ప్రకారం, అనేక దేశాలు కేన్సర్ నివారణ, అవగాహన, చికిత్స రంగాల్లో కొంత పురోగతి సాధించినప్పటికీ, ధనిక, పేద దేశాల మధ్య ఆరోగ్య సేవలలో తీవ్రమైన అసమానతలు కొనసాగుతున్నాయి. కేన్సర్‌ను ముందుగానే గుర్తించడం, ఖచ్చితమైన నిర్ధారణ, నాణ్యమైన చికిత్స, చికిత్స అనంతర సంరక్షణ వంటి సేవలు ప్రపంచంలోని లక్షలాది మందికి ఇంకా అందుబాటులో లేవు. ఈ అసమానతలకు రొమ్ము కేన్సర్ చికిత్స ఒక స్పష్టమైన ఉదాహరణ. అధిక ఆదాయ దేశాల్లో రొమ్ము కేన్సర్ బారినపడిన మహిళల్లో సుమారు 87 శాతం మంది ఐదేళ్లకు పైగా జీవిస్తుండగా, తక్కువ ఆదాయ దేశాల్లో ఈ శాతం కేవలం 42 మాత్రమే. ప్రపంచ దేశాల్లో మూడింట ఒక వంతు కన్నా తక్కువ దేశాలు మాత్రమే తమ సార్వత్రిక ఆరోగ్య సేవల పథకాలలో కేన్సర్ చికిత్సను పూర్తిగా చేర్చాయి. ఫలితంగా అనేక కుటుంబాలు అవసరమైన వైద్య సేవలను పొందలేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కేన్సర్ ప్రభావం కేవలం ఆరోగ్యానికే పరిమితం కాదని డబ్ల్యుహెచ్ఓ పేర్కొంది. ఈ వ్యాధి కుటుంబాల ఆర్థిక స్థితిని, మానసిక ఆరోగ్యాన్ని, సామాజిక జీవితాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తుంది. కేన్సర్ బాధితులపై నిర్వహించిన తొలి ప్రపంచ సర్వేలో కనీసం 45 శాతం మంది తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వెల్లడైంది. సగానికి పైగా బాధితులు మానసిక ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలను ఎదుర్కొంటుండగా, రోగులను చూసుకునే కుటుంబ సభ్యుల్లో దాదాపు అందరూ ఉచిత సేవలు అందించడం, ఉద్యోగ అవకాశాలను కోల్పోవడం, సామాజిక ఒంటరితనం వంటి భారాలను అనుభవిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి కేన్సర్ నియంత్రణను సార్వత్రిక ఆరోగ్య సేవలలో భాగంగా చేర్చడం, వైద్య సిబ్బంది సామర్థ్యాన్ని పెంచడం, ప్రజలకు సమానంగా నాణ్యమైన చికిత్స అందించడం, బాధితులకు సామాజిక భద్రత కల్పించడం, ప్రజారోగ్య అవసరాలకు అనుగుణంగా పరిశోధన, సాంకేతికతను అభివృద్ధి చేయడం అత్యవసరమని డబ్ల్యుహెచ్ఓ సూచించింది. కేన్సర్ నుంచి ఒక వ్యక్తి ప్రాణాలతో బయటపడతాడా లేదా అనేది అతను ఏ దేశంలో పుట్టాడన్నది లేదా అతని ఆదాయం ఎంత అన్న దానిపై ఆధారపడకూడదని, ప్రపంచ దేశాలు సమిష్టిగా చర్యలు తీసుకుంటే ఈ అసమానతలను గణనీయంగా తగ్గించవచ్చని సంస్థ పిలుపునిచ్చింది.

# కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు




- ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు కాలరాస్తున్నాయని హక్కుల సాధనే లక్ష్యంగా ఎఐటియుసి నిరంతర పోరాటం చేస్తుందని కనీస వేతనాల బోర్డు మెంబర్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పుల నేపథ్యంలో ఎఐటియుసి 22వ మహాసభలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయన్నారు. ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయన్నారు. ఆదివారం నగరంలోని న్యూఅంబేద్కర్ భవన్‌లో ఎఐటియుసి 22వ జిల్లా మహాసభలను మొదటి రోజు అట్టహాసంగా ప్రారంభించి రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, ఉపప్రధాన కార్యదర్శి నర్సింహ, సుధాకర్, భూమయ్య పాల్గొని కార్మిక నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకు 4 లేబర్ కోడ్‌లను తెచ్చిందని మండిపడ్డారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం కూడా సమర్థించటం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పిఆర్‌సి ప్రకటించి కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించేలా ఒత్తిడి తేవటం ఎఐటియుసి ముఖ్య కర్తవ్యమన్నారు. జిల్లాలోని స్థానిక కార్మికులకే మొదటి ప్రాధాన్యతగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని పోరాడుతామన్నారు. మహాసభలలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుధాకర్, వివిధ కార్మిక సంఘాల నేతలు, జిల్లా నలుమూలాల నుండి తరలివచ్చిన వందలాది మంది కార్మికులు పాల్గొని విజయవంతం చేశారు. 22వ జిల్లా మహాసభలలో కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం

- అంగన్‌వాడీలను కట్టుబానిసల్లా చూస్తున్న ప్రభుత్వం
- చాలీచాలని వేతనాలతో బతుకులు దుర్భరం
- అంగన్‌వాడీల పాదయాత్రను ప్రారంభించిన సాబీర్ పాషా, మేయర్ గణేష్




**ప్రజాపక్షం/భద్రాచలం :** అంగన్‌వాడీల హక్కుల సాధనకు రాజీలేని పోరాటాలే శరణ్యమని, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా స్పష్టం చేశారు. చాలీచాలని వేతనాలతో బతుకు భారం ఈడుస్తున్న అంగన్‌వాడీలకు మోయలేని పనిభారం పడుతోందని ప్రభుత్వం వారిని కట్టు బానిసలుగా చూస్తోందని తీవ్రంగా విమర్శించారు. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఇదే నిర్లక్ష్య వైఖరిని కొనసాగిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి సచివాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఎఐటియుసి అనుబంధ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రను పాషా ఆదివారం భద్రాచలంలో కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మన్యంవీరుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. అనంతరం ఏఐటియూసి అరుణపతాకాలు చేతబూని అంగన్ వాడీలు, ఏఐటియూసి నాయకులు కదం తొక్కారు. ఎర్రజెండాలతో భద్రాచలం పట్టణంతో పాటు పాదయాత్ర సాగిన దారులు అరుణ వర్ణమయ్యాయి. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్‌లో రెడ్డి అరుణ, గోనె మణి అధ్యక్షతన జరిగిన సభలో పాషా మాట్లాడుతూ అంగన్వాడీల సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. వారిపై అదనపు విధులు మోపడం వెట్టి చాకిరీ చేయించడమే అన్నారు. ఒకవైపు చాలీచాలని వేతనాలు, మరోవైపు అధిక పనిభారంతో అంగన్‌వాడీల జీవితాలను ప్రభుత్వం దుర్భరంగా మారుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించడం సరికాదని, ఇచ్చిన హామీలు అమలయ్యేంత వరకు గుర్తు చేస్తూనే ఉంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల న్యాయమైన డిమండ్లను తక్షణమే పరిష్కరించి పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి చర్చల పేరుతో కాలయాపన చేస్తే సహించేదే లేదని పాషా హెచ్చరించారు. అంగన్‌వాడీల పోరాటానికి సిపిఐ, ఎఐటియుసి సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన ప్రకటించారు. హక్కులు సాధించే వరకు ఉద్యమ జెండా దించేదే లేదని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం దిగిరాకుంటే వేలాది మంది అంగన్‌వాడీలతో సచివాలయాన్ని ముట్టడించి తమ సత్తా చాటుతామని పాషా హెచ్చరించారు. ఐసిడిఎస్‌కు సరిపడా నిధులను ప్రభుత్వం కేటాయించాలని, నెలకు రూ.18వేల వేతన హామీని నిలుపుకోవాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, బిఎల్‌ఓ విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని, పదవీ విరమణ పొందిన వారి బకాయిలు చెల్లించాలని కోరారు. పాదయాత్రకు దారిపొడవునా ఘన స్వాగతం లభించింది. వివిధ ప్రాంతాల్లో కార్మికులు, ప్రజలు సంఘీభావం ప్రకటించారు. అరుణపతాకాలు, నినాదాలతో భద్రాచలం వీధులు మార్మోగాయి. అంగన్‌వాడీల ఐక్యతా పోరాట స్ఫూర్తితో పాదయాత్ర ఉత్సాహభరితంగా కొనసాగింది. రెండు రోజుల పాటు సాగే పాదయాత్ర తొలిరోజు భద్రాచలం మీదుగా సారపాక, బూర్గంపాడు మండలాలతో పాటు పాల్వంచ మండలంలోని జగన్నాధపురం వరకు సాగింది. సారపాకలో ఎఐటియుసి కార్మిక సంఘాల నాయకులు హరిప్రసాద్, పోటు రంగారావు, నాగభూషణం తదితరులు సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు. రెండోరోజు పాదయాత్ర సోమవారం జగన్నాధపురంలోని పెద్దమ్మ తల్లి ఆలయం నుండి మొదలై పాల్వంచ మీదుగా కలెక్టరేట్ వరకు చేరుకుంటుంది. కలెక్టరేట్ ముందు సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయి ఈశ్వరి, కార్యదర్శి నందూరి కరుణకుమారి, రాష్ట్ర డిప్యుటీ సెక్రెటరీ సీతా మహాలక్ష్మి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శులు శింగు నర్సింహారావు, నరాటి ప్రసాద్, సిపిఐ ఎఐటియుసి మహిళా సమాఖ్య నాయకులు కల్లూరి వెంకటేశ్వరరావు, కంచర్ల జమలయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, ముద్దా వెంకటేశ్వరావు, మున్నా లక్ష్మీ కుమారి, వేల్పుల మల్లిఖార్జున్, అన్నారపు వెంకటేశ్వర్లు, మీసాల భాస్కర్ రావు, ఏపూరి వెంకటేశ్వరరావు, ఎస్వీఎస్ నాయుడు, మారెడ్డి శివాజీ, కంభంమెట్టు శ్రీనివాస్, సాధనపల్లి సతీష్, రామిరెడ్డి అశోక్, సత్తినేడు సాయిరామ్, రుద్ర బ్రదర్స్, చింతల రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి




- ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం
- ఘనంగా ఎఐటియుసి 4వ జిల్లా మహాసభలు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** కార్మిక హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, బిల్డింగ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రవీణ్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పైలట్ కాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ఎఐటియుసి జిల్లా 4వ మహాసభలు ఘనంగా జరిగాయి. జిల్లా అధ్యక్షులు మోట పలుకుల రమేష్, అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, బిల్డింగ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రవీణ్, సింగరేణి కాలోరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కొరిమి రాజ్‌కుమార్, మహాసభ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలోవారు మాట్లాడారు.

**కేంద్ర విధానాలపై విమర్శలు**

కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లుగా మార్చిందని నాయకులు ఆరోపించారు. ఈ 4 కోడ్‌లు కార్మికులను బానిసలుగా చేస్తాయని, కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచడం అన్యాయమని అన్నారు. సమ్మెను నేరంగా పరిగణించి కార్మికులను జైలుకు పంపే చట్టాలు తెస్తున్నారని దుయ్యబట్టారు. 1920 నుండి కార్మికుల సమస్యలపై సంపూర్ణ అవగాహనతో పోరాడుతున్న సంఘం ఏఐటీయూసీ అని, జిల్లాలోని కార్మికులంతా ఏకమై పోరాటాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

**పెద్ద ఎత్తున కార్మికుల హాజరు**

ఈ మహాసభకు జెన్కో, ఆర్‌టిసి, మున్సిపల్, గ్రామపంచాయతీ, బిల్డింగ్ రంగం, మధ్యాహ్న భోజన కార్మికులు, సింగరేణి వర్కర్స్, కాంట్రాక్ట్ కార్మికులు, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్, హమాలీ, సివిల్ సప్లై హమాలీ కార్మికులతో పాటు వివిధ రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహాసభలో 14 తీర్మానాలు ఆమోదించారు. 4 లేబర్ కోడ్‌ల రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, కార్మిక హక్కుల పరిరక్షణ తదితర అంశాలు తీర్మానాల్లో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి క్యాతారాజు సతీష్, నాయకులు వెంకటేష్, తాళ్ల పోశం, శీను, సుగుణ, సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్, జిల్లా సమితి సభ్యులు శ్రీకాంత్, జోసెఫ్, గులాం నబి, పెంట రవి, రాజయ్య పాల్గొన్నారు.

# స్కావెంజర్లకు రూ.26 వేల కనీసవేతనం




- ఎఐటియుసి వరంగల్ జిల్లా గౌరవాధ్యక్షుడు పనాస ప్రసాద్ డిమాండ్

**ప్రజాపక్షం/వరంగల్ :** స్కావెంజర్లకు కనీస వేతనం 26వేలు ఇచ్చి పర్మినెంట్ చేయాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షులు పనాస ప్రసాద్ అన్నారు. వరంగల్ శివనగర్ తమ్మెర భవన్‌లో పోలేపల్లి అధ్యక్షతన నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలలో పని చేసే పారిశుద్ధ కార్మికుల స్కావెంజర్స్ జిల్లా మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఐటీయూసీ వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పనాస ప్రసాద్ మాట్లాడుతూ కనీస వేతనం 26వేల అందించి స్కావెంజర్లందర్నీ పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా శ్రమ దోపిడీకి గురి అయ్యి తన రక్తాన్ని చెంటగా మార్చే ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్లందరినీ ఈ రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని తక్షణమే గ్రామ సమైక్య వివోలతోని సంబంధం లేకుంటే నేరుగా స్కావెంజర్ల అకౌంట్లోకి నెలసరి వేతనాలను అందించాలని, నెలకు మూడు రోజులు సెలవులు ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు, జిల్లా సహాయ కార్యదర్శి తాళ్లపెల్లి జాన్ పాల్, స్కావెంజర్స్ సముద్రాల పాపయ్య, కొలకనూరు మేరీ సునీత, కోమల, జక్రిపోతుల విజయ, అరుణ, రాధమ్మ, లాసాని, రామారావు, ఎండి బాబు, కాసగాని విజయ, మేకల కవిత, పసునూరి సునీత, జ్యోతి, స్వరూప, సహజ్ బేగం, రవి తదితరులు పాల్గొన్నారు.



## వేగంగా ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బిఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేసి, వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 29, 35, 36, 42 వార్డులో సర్ ప్రక్రియను పరిశీలించారు. ప్రతి రోజు కనీసం 2,500 ఫారాల లక్ష్యంతో పనిచేసి, నిర్ధేశిత గడువులోగా పెండింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్లు సకాలంలో ఫారాలు పూర్తి చేసి అందజేసేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా నిర్లక్ష్యం లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. బిఎల్ఓలు ఇంటింటికి తిరిగి ఫారం నింపాలని చెప్పారు. ఓటర్ల సంతకాలను చెక్ చేసుకోవాలని, మ్యాపింగ్ కరెక్ట్‌గా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వేణుమాధవరావు, తహశీల్దార్ సాయి గౌడ్ పాల్గొన్నారు.

## కరాటేలో గిన్నిస్ రికార్డు అభినందనీయం

### ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : సూర్యాపేటకు చెందిన కరాటే విద్యార్థులు, మాస్టర్లు పాల్గొని గిన్నిస్ రికార్డు సాధించడం అభినందనీయమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ఇటీవల గచ్చిబౌలిలో విజన్ మార్షల్ ఆర్ట్స్, జెఆర్ అకాడమీ ఆధ్వర్యంలో 10 రాష్ట్రాల నుంచి 1500 మంది కరాటే మాస్టర్లతో నిర్వహించిన కరాటే ప్రదర్శనలో సూర్యాపేటకు చెందిన 16 మంది ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు, మాస్టర్లకు పంపించిన సర్టిఫికెట్స్, బెల్టులను ఆదివారం స్థానిక బేబిమూన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాటిని అందజేసి మాట్లాడారు. కరాటే ఆత్మరక్షణకు ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు, విద్యార్థినీలు కరాటే నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కరాటే మాస్టర్ చిన్న తమ విద్యార్థులను ప్రపంచస్థాయి వేదికలకు పరిచయం చేయడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, చిలుముల శ్రీనివాస్ రెడ్డి, ధరావత్ వీరన్న నాయక్, కరాటే మాస్టర్లు జెవి రమణ (చిన్నా), ఆర్ సంతోష, నిఖిల్, రిషి, ప్రశాంత్, వినయ్, యోగానంద్, అక్షర పాల్గొన్నారు.

## నకిరేకల్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి

### రూ.30 లక్షలతో పద్మశాలీ కమ్యూనిటీ భవనం నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్ వీరేశం శంకుస్థాపన



**ప్రజాపక్షం/నకిరేకల్:** పట్టణంలోని పద్మశాలీ సంఘం సభ్యులకు ఉపయోగపడేలా రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన కమ్యూనిటీ భవనం,డైనింగ్ హాల్ నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదివారం శంకుస్థాపన చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం,సామాజిక మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పద్మశాలి సంఘం సభ్యులు సామాజిక, సాంస్కృతిక,కుటుంబ కార్యక్రమాలను ఒకే చోట నిర్వహించుకునేందుకు ఈకమ్యూనిటీ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతూ నకిరేకల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు,ఎం కృష్ణమూర్తి ,సందానందం, చంద్రయ్య,గోలి పద్మ,రావిరాల మల్లయ్య , కిషన్,రావిరాల యాదగిరి,బోనగిరి యాదగిరి,చిలుకూరి లక్ష్మి నరసయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు,పన్నాల రాఘవరెడ్డి పాల్గొన్నారు.

## ఓట్ల తొలగింపుపై అప్రమత్తం

**ప్రజాపక్షం/నూతనకల్ :** దేశంలో సర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఓట్ల తొలగింపు కుట్రపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిపిఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్ గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా నుంచి లక్షల మంది ఓట్లను తొలగించే కుట్రను అడ్డుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రత్యేక ఓటరు నమోదు పేరుతో ఇప్పటికే బీహార్, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో లక్షలాది మంది ఓటర్ల పేర్లను తొలగించారన్నారు. వెంకట్‌రెడ్డి, నారాయణ, చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, రాములయ్య, సైదులు పాల్గొన్నారు.

## బుచ్చయ్య మృతి బాధాకరం



**ప్రజాపక్షం/డిండి:** నల్గొండ జిల్లా డిండి మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ కామ్రేడ్ తాటికొండ బుచ్చయ్య అంత్యక్రియల్లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి పాల్గొని ఆయన పార్థివదేహంపై సిపిఐ జెండాను కప్పి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తూం బుచ్చిరెడ్డి మాట్లాడుతూ తాటికొండ బుచ్చయ్య మరణం చాలా బాదాకరం అని నమ్మిన సిద్దాంతం కోసం పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పార్టీ ప్రతి కార్యక్రమంలో పాల్గొనే వారని ఆయన మరణం పార్టీకి తీవ్ర నష్టం అని అన్నారు. నివాళులర్పించిన వారిలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మైనోద్దిన్, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు శైలేష్, విజేందర్‌రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహా, లచ్చయ్య, గ్రామశాఖ కార్యదర్శి జంగయ్య, శ్రీను, జాన్సీరాం, శ్రీను, పెద్దజంగయ్య, శ్రీను ఉన్నారు.

# రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం

### భువనగిరి, చిట్యాల నాలుగు లేన్ల రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేటలో స్టేజ్1, ప్యాకేజ్2/7లో భాగంగా రూ.339.59 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 109.3 కిలోమీటర్ల పొడవైన రహదారుల అభివృద్ధి పనులకు ఆదివారం తెలంగాణ రాష్ట్ర రహదారులు, భవనాలు , సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భువనగిరి నుండి చిట్యాల వరకు రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించే నిర్మాణ పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ భువనగిరి,చిట్యాల నాలుగు లేన్ల రహదారి కోసం ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారని, రహదారి పూర్తయితే జిల్లాలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు ప్రయాణ సమయం తగ్గి, ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. దశాబ్దాలుగా ఈ రహదారి విస్తరణ కోసం ప్రజలు ఎదురుచూస్తుండగా, ప్రజా ప్రభుత్వం ఆ కోరికను నెరవేరుస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, రహదారి భద్రత మెరుగుపడి, రవాణా సౌకర్యాలు విస్తరించి, ప్రాంతీయ వాణిజ్యం, వ్యవసాయం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ఊపు లభించనుంది. అలాగే వాణిజ్య, పారిశ్రామిక, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదవ్వాలి

### మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు తప్పకుండా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి సూచించారు. మిర్యాలగూడ పట్టణంలోని 18, 36, 37 వార్డుల్లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, పేరు మార్పులు, చిరునామా మార్పులు, దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాలను పరిశీలించారు. బూత్‌ల వద్ద ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీసి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కార్యక్రమం పారదర్శకంగా కొనసాగాలని, అర్హత కలిగిన ఓటరు ఎవరూ జాబితాకు దూరం కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రజల్లో అవగాహన పెంచి ప్రతి కుటుంబాన్ని సంప్రదిస్తూ ఓటరు వివరాల సవరణ చేపట్టాలని బూత్ స్థాయి సిబ్బందికి సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు కీలకమైందని, ఓటరు జాబితా ఖచ్చితత్వం ఎన్నికల ప్రక్రియకు బలమని పేర్కొన్నారు. ప్రజలు కూడా తమ వివరాలను పరిశీలించుకుని అవసరమైన సవరణలు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, బూత్ లెవల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వెలగని వీధి దీపాలు

### నిద్రమత్తులో పాలకులు



**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మేళ్లచెరువు పోలీస్ స్టేషన్ వెనుకాల ఉన్న కాలనీలో వెలగని వీధి దీపాల సమస్యతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వల్ల దొంగతనాలు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని సామాజిక కార్యకర్త మేళ్లచెరువు సికిందర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో సమస్య జటిలమై వీధుల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. దీంతో రాత్రి వేళల్లో వాహనదారులు భయంతో రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఈ కాలనీ మహాసిమెంట్ పరిశ్రమకు పోవడానికి ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుందని, దీంతో చిన్న పిల్లలు ఆయన వృద్దులు, ఆయన రాత్రి వేళాల్లో బయటకు వస్తే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉటుందని స్థానికులు అంటున్నారు. అందులోనూ ఆ వీధి చుట్టుపక్కల పొలాలు ఉండటం వల్ల రాత్రి వేళల్లో చల్లని గాలికి పాములు, తేళ్లు బయటకు వచ్చి ప్రజల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో బయటకు రావాలంటే అక్కడ ప్రజలు జంకుతున్నారు. గత కొద్ది రోజులుగాఈ సమస్య నెలకొని ఉన్నా అధికారులు, పాలకుల దృష్టికి తీసుకపోయినా కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు వేయటంలో చూపించే శ్రద్ద పాలనలోనూ, ప్రజల సమస్యలపైన పాలకుఉల కొంత పెడితే బాగుంటుందని అనుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని కోరుకుంటున్నారు.

## యజమానులు ఐకమత్యంతో పనిచేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : సూర్యాపేట హోటల్ యజమానులు ఐక్యమత్యంతో పనిచేస్తూ అసోసియేషన్ ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సూర్యాపేట హోటల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ బలంగా ఉన్నప్పుడే హోటల్ యజమానుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరు తమవంతు సహకారం అందించాలని కోరారు. పట్టణ హోటల్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా పానుగంటి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా చీర్యాల నరేష్, కోశాధికారిగా వనం మురళీకృష్ణ, ఉపాధ్యక్షులుగా రమేష్ శెట్టి, లతీఫ్, ప్రచార కార్యదర్శులుగా రాము, దయాకర్, గిరి, శ్రీనివాసులును ఎన్నుకున్నారు. మాజీ అధ్యక్షులు జానకిరాములు అధ్యక్షతన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి రామమూర్తి, కమిటి సభ్యులుగా సాంబయ్య, ప్రవీణ్, బాబా, పవన్, సుధా కిషోర్, వెంకటేశ్వర్లు, సాయి, లక్ష్మణ్, లింగం, రాఘవశెట్టి, సైదులు, హరిప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం అభినందనీయం




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : వార్డు ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరం అభినందనీయమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. ఆదివారం పట్టణంలోని 16వ వార్డులో కౌన్సిలర్ షేక్ జహీర్ ఆధ్వర్యంలో ఏఆర్ కంటి ఆసుపత్రి నిర్వాహకులు పాషా సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత వైద్యశిబిరాలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. సమాజ సేవ దృక్పదంతో ఈ క్యాంప్ ఏర్పాటు చేసిన కౌన్సిలర్, ఆసుపత్రి నిర్వాహకులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు షేక్ జహీర్, కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, నాయకులు ధరావత్ వీరన్న నాయక్, ఎలిమినేటి అభినయ్ నాయుడు, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, జావేద్ బేగ్, అరుణ్ కుమార్, వెన్న మధుకర్ రెడ్డి, నాగు నాయక్, అనిల్ పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



**ప్రజాపక్షం/తిరుమలగిరిసాగర్** : మండలానికి నూతనంగా మంజూరు అయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం నిర్మాణాని నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులలోని కోటి 43 లక్షల అంచనా వ్యయం తో ఈ పిఎస్ సి భవనం నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. మండలానికి అవసరమైన పూర్తి వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే సబ్ మార్కెట్ యార్డ్‌లోని నాలుగు ఎకరాల భూమిలో ఇంటిగ్రేటెడ్ ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం చేపడుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ జడ్పి వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి.మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్,హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గడ్డం సాగర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జటావత్ లాలు నాయక్ పాల్గొన్నారు.

## పల్లా వెంకట్‌రెడ్డిని కలిసిన సిపిఐ పల్లెపహాడ్ బృందం



**ప్రజాపక్షం/ నార్కట్‌పల్లి :** ఇటీవల జరిగిన చేనేత సహకార ఎన్నికలలో మునిపంపుల సహకార సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన వనం వాసుదేవులు ఆదివారం నార్కట్‌పల్లిలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి కలిశారు. సిపిఐ నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్, సిపిఐ నార్కట్ పల్లి మండల కార్యదర్శి పెండ్యాల శంకరయ్య, సిపిఐ చిట్యాల మండల కార్యదర్శి అక్బర్, ఏఐకెఎస్ మండల అధ్యక్షులు వెంపటి శ్రీనివాస్, పల్లెపహాడ్ గ్రామ సర్పంచి సంగిశెట్టి రాణమ్మ శ్రీనివాసులు కలిసి పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా చేనేత సహకార సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన వనం వాసుదేవులును పల్లా వెంకట్ రెడ్డి ప్రోత్సహించారు. అదే విధంగా ప్రతినిధి బృందం పల్లా వెంకట్‌రెడ్డి అమెరికా పర్యటన ముగించుకొని స్వదేశానికి వచ్చినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## నేడు నారాయణరావు వర్ధంతి సభ



**ప్రజాపక్షం/చింతపల్లి** : దేవరకొండ తాలుకా కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత, మాజీ శాసనసభ్యులు ఉజ్జిని నారాయణరావు పదవ వర్ధంతి సభ నేడు మండల కేంద్రంలోని సాయిసుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మునుగోడు మాజీ శాసనసభ్యులు ఉజ్జిని యాదగిరిరావు తెలిపారు. నల్లగొండ జిల్లా దేవరకొండ ప్రాంతంలో తెలంగాణ సాయుధ పోరాటానికి కమ్యూనిస్టు ఉద్యమాలకు ఆకర్షితులై కమ్యూనిస్టు పార్టీలో చేరి చివరి వరకు కొనసాగిన మహనీయులు ఉజ్జిని నారాయణరావు. ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని, కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ చరిత్ర నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఎంతైన ఉన్నది. నారాయణరావు ఉద్యమ చరిత్రను స్మరిస్తూ నేడు ఉదయం 10 గంటలకు సొంత గ్రామం ఘడియగౌరారం గ్రామంలో నారాయణరావు స్థూపం వద్ద సిపిఐ శ్రేణులు శ్రద్ధాంజలి ఘటించనున్నారు. తదనంతరం మండల కేంద్రంలోని సాయిసుమంగళి ఫంక్షన్ హాల్‌లో వర్ధంతి సభ నిర్వహించనున్నారు. ఈ సభకు సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరుకానున్నారు. ఈ వర్ధంతి సభ సందర్భంగా మండల కేంద్రంలో సిపిఐ శ్రేణులు ఎర్రని జెండాలతో అలంకరణ చేశారు. సిపిఐ శ్రేణులు, అభిమానులు సకాలంలో హాజరై ఈ సభను జయప్రదం చేయాలని యాదగిరిరావు కోరారు.



## సమర్థవంతంగా 'సర్' ప్రక్రియ

### హుజూర్‌నగర్ ఆర్‌డిఓ శ్రీనివాసులు

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రీయ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. ఆదివారం నేరేడుచర్ల మున్సిపాలిటిలోని రామాపురం 34, 35 పోలింగ్ బూత్‌లలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ దరఖాస్తుల స్వీకరణ అంశాలను తహసిల్దార్ సైదులుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రీయను బిఎల్‌వోలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఓటు నమోదు ప్రక్రీయ మార్పులు చేర్పులు తొలగింపులు ప్రక్రీయను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు కల్పించాలని సూచించార. ఈ ప్రక్రీయను వేగవంతంచేసి, నిర్ణిత గడువులోగా పూర్తి చేయాలని అదేశించారు. డిప్యూటీ తహసిల్దార్ మౌనిక, సీనియర్ అసిస్టెంట్ చంద్రకళ, అధికారులు, ప్రజాప్రతినిధులు, బిల్‌వోలు పాల్గొన్నారు.

## ఉచిత ఎముకల వైద్య శిబిరం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** బోధిధర్మ యోగా అండ్ హెల్త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఎముకల వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఆదివారం బోధిధర్మ యోగ అండ్ అసోసియేషన్ అధ్యక్షులు సీత భాస్కర్, సభ్యుల ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎమ్మెస్ విశ్వనాథ్ రాజేశ్వరి నర్సింగ్ హోమ్ సౌజన్యంతో నిర్వహించిన ఈశిబిరంలో 200 మంది పట్టణ, మండల ప్రజలకు ఉచిత పరీక్ష నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. ఫిజియోథెరపీ డాక్టర్. ప్రదీప్ ఫిజియోథెరపీకి సంబంధించిన సూచనలు చేశారు. ఉపాధ్యక్షులు కడవేరు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి చింతల రామకృష్ణ, సహాయ కార్యదర్శిలు దోర్నాల బాలరత్నం, రణం రాజశేకర్, కోశాధికారి కొండమడుగు మల్లేష్, సంస్కృతిక కార్యదర్శి వనం వెంకటేష్, కార్యవర్గ సభ్యులు దోర్నాల బాలరాజు, బావండ్ల రాజు, వీడెం విష్ణు, గౌరవ సలహాదారులు ఈపూరి ముత్యాలు, కర్నాటి బాలరాజు పాల్గొన్నారు.




## లోపాలు ఉండొద్దు

**ప్రజాపక్షం / తిప్పర్తి:** తిప్పర్తి మండలంలోని గోదారిగూడెం, ఆరేగూడెం గ్రామాలలోని పోలింగ్ స్టేషన్లలో నల్లగొండ ఆర్‌డిఓ అశోక్ రెడ్డి ఆదివారం ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాల సేకరణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూడాలని, అర్హత గల ప్రతి ఓటరుకు అవకాశం కల్పించాలని అధికారులను సూచించారు.ఈకార్యక్రమంలో తహసీల్దార్ రాజకొండ రామకృష్ణ, ఆర్.ఐ ప్రసాద్ రెడ్డి, బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయలు, టమాటాల పంపిణీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని స్థానిక హౌసింగ్ బోర్డులో సుమన్ షోటో ఖాన్ కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రతి వారం శిక్షణ పొందుతున్న కరాటే విద్యార్థిని విద్యార్థులకు వారి ప్రతిభను బట్టి బహుమతులు అందజేసే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ వారం ప్రత్యేకంగా కరాటే నేర్చుకుంటున్న 80 మంది విద్యార్థిని విద్యార్థులకు కూరగాయలు, టమాటాలను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి హాజరై కరాటే విద్యార్థులకు కూరగాయలను అందజేశారు. కరాటే అకాడమీ జాతీయ అధ్యక్షులు బూడిద సైదులు, నాలుగో వార్డు కౌన్సిలర్ పుట్టపాక శీను, బీఎస్ఎన్ఎల్ శీను, ఆర్గనైజర్ చీఫ్ జాతీయ జనరల్ సెక్రటరీ సీనియర్ కరాటే మాస్టర్ బండవత్ రామకృష్ణ నాయక్ పాల్గొన్నారు.



## నకిలీ పత్తి విత్తనాల విక్రయం: ముగ్గురిపై కేసు



**ప్రజాపక్షం / కౌటాల:** మహారాష్ట్ర నుంచి నకిలీ పత్తి విత్తనాలు తీసుకొచ్చి చింతలమానేపల్లి మండల రైతులకు అసలు విత్తనాలుగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం. కమలాకర్ తె లిపారు. మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దులోని గూడెం గ్రామంలో నకిలీ ప త్తి విత్తనాలు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు, వ్యవసా య శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులను పట్టుకోగా, పరారీలో ఉన్న మరో వ్యక్తితో కలిపి మొత్తం ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ కమలాకర్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## 'అల్బెండజోల్' మాత్రల పంపిణీకి సర్వం సిద్ధం: కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** జిల్లాలో ఈ నెల 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం (ఎన్‌డిడి) కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల 1,81,425 మంది పిల్లలను గుర్తించగా, వారికి పంపిణీ చేసేందుకు 2,36,400 అల్బెండజోల్ మాత్రలను సిద్ధం చేశారు. ఇప్పటికే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా మాత్రలను పంపిణీ చేయడంతో పాటు సిబ్బందికి శిక్షణలు పూర్తి చేసినట్లు తెలిపారు. అల్బెండజోల్ మాత్రలు కడుపులోని నులిపురుగులను నిర్మూలించి పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలు, కళాశాలలు, చైల్డ్ కేర్ హోమ్స్ తదితర సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. జూలై 13 న మాత్రలు తీసుకోలేని పిల్లలకుతల్లి దండ్రులు, విద్యాసంస్థలు, ప్రజాప్రతినిధులు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి



**ప్రజాపక్షం / కోటపల్లి :** ఆల్గాం గ్రామ శివారులోని ఎస్ఆర్ఆర్ ఫర్టిలైజర్ షాప్ వద్ద డబ్బులు పందెంగా పెట్టుకొని పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ఎస్. రాజశేఖర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆకస్మికంగా ఈ దాడి నిర్వహించి, నిందితుల వద్ద నుండి రూ.12,640 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులను చూసి పరారైన మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ దాడిలో ఎస్ఐ ఎస్. రాజశేఖర్, హెడ్ కానిస్టేబుల్ బుజ్జిబాబు, పోలీస్ కానిస్టేబుళ్లు శ్రావణ్, నరేష్, టిజిఎస్పి సిబ్బంది పాల్గొన్నారు.

## ఈటల రాజేందర్‌ను కలిసిన నత్తి మల్లేష్ ముదిరాజ్



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకం అయిన సందర్భంగా ఆదివారం మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్‌ను బిజెపి రాష్ట్ర నాయకులు నత్తి మల్లేష్ ముదిరాజ్ వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలలో పార్టీని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పథకాలు ప్రజలకు చేరేలా చూడాలని, రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల మధ్యన ప్రజలకు అందుబాటులో ఉండాలని, జాతీయ పార్టీ, రాష్ట్ర పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. నత్తి మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మునిసిపాల్ 2 వార్డు కౌన్సిలర్ చందా అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కుంగ్‌ఫూ శిక్షణతోనే ఆత్మరక్షణ



**ప్రజాపక్షం / మందమర్రి :** చిన్ననాటి నుంచే కుంగ్ ఫూ శిక్షణ పొందడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు ఆత్మరక్షణ లభిస్తుందని గ్రాండ్ మాస్టర్ కంటేశ్వర్, అసిస్టెంట్ మాస్టర్ హరికృష్ణ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో ఆదివారం కుంగ్‌ఫూ బెల్ట్ ఎగ్జామినేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మాస్టర్ జెట్టి కృష్ణ సారథ్యంలో ఈ పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాద పరిస్థితుల్లో ఎదురయ్యే ఆపదల నుంచి రక్షించుకోవడానికి కుంగ్‌ఫూ ఎంతగానో తోడ్పడుతుందని చెప్పారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మందమర్రి టౌన్ ఎఎస్ఐ మిలన్ కుమార్, సీనియర్ మాస్టర్లు విద్యార్థులకు ఎల్లో, గ్రీన్, మెరూన్ బెల్టులతో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు బెల్టులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్లు రాజేష్, శ్రీనివాస్, టి. రవి, చందు, శ్రీధర్, ప్రభాకర్, ఎంఎల్ రవి పాల్గొన్నారు.

## దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు



### ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

**ప్రజాపక్షం/తానూర్ :** గత పది సంవత్సరాల పాలకుల నిర్లక్ష్య వైఖరి మూలంగా ముధోల్ నియోజకవర్గంలో పేదలకు ఇల్లు మంజూరు కాక ప్రజలు ఇబ్బందులు పడ్డారని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్‌అన్నారు. ఆదివారం తానూర్ మండలంలోని మసల్గా తండాలో ఇద్దరు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.దశలవారీగా ఇందిరమ్మ ఇల్లాలు మంజూరు చేయించి,పేదోడి స్వంత ఇంటి కల నెరవేరేలా తన వంతుగా పాటుపడతానని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఇందిరమ్మ ఇండ్లు పేదలకు మంజూరు అవుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజల కోసం దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నారని, అదేవిధంగా మారుమూల మండలమైన తానూర్ మండల కేంద్రంలో గ్రామీణ రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, హామ్ పథకంలో 140 కోట్లతో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని, అదేవిధంగా తానూర్ నుండి తండా వరకు రోడ్లు వేయించడం జరుగుతుందన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు మండల సర్పంచులు,నాయకులు,తండావాసులు,ఘనంగా స్వాగతి ంచి, శాలువాతో సత్కరించారు. బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి,చిన్నారెడ్డి,మండల అధ్యక్షుడు లక్ష్మి రెడ్డి,సర్పంచులు,మాజీప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణ, మత్తు పదార్థాల అడ్డుకట్టే లక్ష్యం

### రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**ప్రజాపక్షం / మంచిర్యాల :** నేరాల నియంత్రణ, మత్తు పదార్థాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా భారీ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరుగుతుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఇళ్లలో రహస్యంగా గంజాయి విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో శనివారం అర్ధరాత్రి సుమారు 300 మంది ప్రత్యేక పోలీసు సిబ్బందితో ఎన్‌టిఆర్ కాలనీని ముట్టడించి, ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సోదాల్లో రూ.20 వే ల విలువైన అక్రమ మద్యం, సరైన పత్రాలు లేని 166 ద్విచక్ర వాహనాలు, ఐదు ఆటోలు, ఒక తల్వార్ స్వాధీనం చేసుకున్నారు. అర్ధరాత్రి రోడ్లపై పుట్టినరోజు వేడుకలు జరిపి ఇబ్బంది కలిగించిన 10 మంది యువకులతో పాటు 10 మంది పాత నేరస్తులకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ఎన్‌టిఆర్ నగర్ ప్రజలు మంచి ప్రవర్తనతో సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. రోడ్లపై అసాంఘికంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని, యువతను సరైన మార్గంలో నడిపించడమే పోలీసు శాఖ ముఖ్య ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైతే పోలీసు శాఖ తరపున శిక్షణ ఇస్తామని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జోన్ డిసిపి ఏ.భాస్కర్, ఎసిపిలు ఆర్.ప్రకాష్, వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌రావు, ఇతర ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పకడ్బందీగా 'సర్' ప్రక్రియ

### ఇప్పటివరకు 42 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ప్రజాపక్షం/నిర్మల్ కలెక్టరేట్ :** జిల్లాలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ పకడ్బందీగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.ఆదివారం భైంసా పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే ప్రతి ఓటరుకు ఎస్ఐఆర్ ఫారములు అందివ్వడం జరిగిందని అన్నారు. ఎస్ఐఆర్ ఫారముల ప్రక్రియ స్వీకరణ కూడా కొనసాగుతుందని వివరించారు.తిరిగి తీసుకున్న ఫారముల డిజిటలైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 42 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు వివరించారు. జిల్లా పరిధి కిందికి వచ్చే 23 మండలాల్లో 7 లక్షల 55 వేల ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టినట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాలలో ప్రక్రియ కాస్త నెమ్మదిగా ఉందని, భైంసా పట్టణానికి సంబంధించి నిన్నటి సాయంత్రం వరకు 20 శాతం ఎన్యుమరేషన్ ఫారముల డిజిటలైజేషన్ పూర్తిచేసినట్లు చెప్పారు. పట్టణ ప్రాంతాలను ప్రత్యేక జోన్లుగా విభజించి, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ అధికారులు, బిఎల్ఓ, బిఎల్ఓ సూపర్వైజర్ల ద్వారా ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేస్తామని వెల్లడించారు.ప్రతి బిఎల్ఓ తప్పనిసరిగా ఇంటింటికి వెళ్లి ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణకు సహకారం అందించాలని తెలిపారు.ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, తహసీల్దార్ శశిభూషణ్, ఎంపీడీవో నీరజ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బిఎల్ఓ సూపర్వైజర్లు, బిఎల్ఒలు ఇతర అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అప్పు తీరేదెప్పుడు? ముద్ద దిగేదెప్పుడు?

### విటిడిఎ చైర్మన్ మహేందర్ జాదవ్✻ సావర్గం జిపి భవన బిల్లుల చెల్లింపులో ప్రభుత్వాల నిర్లక్ష్యం

### ✻ రూ. 20 లక్షల బిల్లు పెండింగ్.. వడ్డీల భారంతో కుంగుతున్న వైనం




**ప్రజాపక్షం/నేరడిగొండ:** ''గ్రామ రూపురేఖలు మార్చాలని, నూతన భవనాన్ని అందుబాటులోకి తేవాలని అప్పులు తెచ్చి మరీ పనులు పూర్తి చేశాం. కాని నేడు ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా అసలు కంటే వడ్డీల భారం కొండలా పెరిగిపోతోంది. తెచ్చిన అప్పు తీరేదెప్పుడు? మా గొంతులో ముద్ద దిగేదెప్పుడు?'' అం టూ సావర్గం విటిడిఎ చైర్మన్ మహేందర్ జాదవ్ ప్రభు త్వ తీరుపై తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేశారు. నేరడిగొండ మండలం సావర్గం గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణం గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ నూతన భవనంలోకి పంచాయతీ కార్యకలాపాలను కూడా మార్చారు. ఐటిడిఎ ద్వారా రూ. 20లక్షల వ్యయంతో నిర్మించిన ఈ భవనానికి సంబంధించిన బిల్లులు నేటికి మంజూరు కాకపోవడం గమనార్హం. ఏళ్లు గడుస్తున్నా బిల్లుల విడుదల విషయంలో పాలకులు, అధికారులు అంతంత మాత్రంగానే స్పందిస్తున్నారని భవన నిర్మాణ కర్తలు మండిపడుతున్నారు.

**వడ్డీల భారంతో దిక్కుతోచని స్థితిలో..**

గ్రామాలను ప్రగతి పథంలో నడిపించాలనే సంకల్పంతో విటిడిఎ చైర్మన్లు తమ సర్వస్వాన్ని ధారపోసి, బయట వడ్డీలకు అప్పులు తెచ్చిమరీ అభివృద్ధి పనులు చేపట్టారు. తీరా పనులు పూర్తి చేసి భవనాన్ని ప్రభుత్వానికి అప్పగించినా, ఆ పనుల తాలూకు నిధులు విడుదల చేయకపోవడంతో వారంతా రోడ్డున పడే పరిస్థితి వచ్చింది. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి తట్టుకోలేక, రోజు రోజుకూ పెరుగుతున్న వడ్డీలు కట్టలేక తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్నామని మహేందర్ జాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి బిల్లులు మంజూరు చేయకపోతే, తమకు అప్పుల బాధతో ఆత్మహత్యలే శరణ్యమని హెచ్చరించారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం సావర్గం జిపి భవన బిల్లుల విడుదలపై ప్రత్యేక దృష్టి సారించి, తమను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## పేదల ఆరోగ్యానికి పెద్దపీట

### అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



**ప్రజాపక్షం/నిజామాబాద్:** అర్బన్ నియోజకవర్గంలోని పేదల ఆరోగ్యానికి పెద్దపీఠ వేస్తున్నామని, అవసరమైన వారికి నిమ్స్‌లో ఎల్ఒసిఅందజేస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని కార్యాలయంలో ఆదివారం ఎల్ఒసి అందజేసి ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో అర్హులైన పేదలకు ఎల్ఒసి ఇప్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి పరిస్థితిని సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. నగరంలోని ఆటోనగర్‌కు చెందిన మూడున్నరేళ్ల బాలిక ఉమ్మె కుర్సుం క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. దీంతో నిమ్స్‌లో చికిత్స కోసం రూ. 5 లక్షల ఎఒసి వారి కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. పార్టీలకతీతంగా పేదల ప్రాణాలను కాపాడటమే తన లక్ష్యమన్నారు. ఎయిమ్స్‌లో అత్యాధునిక వైద్య సేవలు, హైదరాబాద్‌లోని బీబీనగర్ ఎయిమ్స్‌లో అత్యాధునిక సేవలు అందుబాటు లో వచ్చాయన్నారు. పేదలు ధీర్ఘకాలిక వైద్య సమస్యలున్న వారు అత్యవసర శస్త్రచికిత్సలు అవసరమైన వారు ఎయిమ్స్‌కు వెళ్లాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం వెయ్యి కోట్లతో నిర్మించి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చారని చెప్పారు. 132 మంది ప్రొఫెసర్లు, 133 మంది సీనియర్ డాక్టర్లు సేవలందిస్తున్నారన్నారు. కావున నియోజకవర్గ ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు .

## డిగ్రీ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి

### సిపిఐ నాయకుడు వర్కొల్ రాకేష్

**ప్రజాపక్షం/వాంకిడి :** వాంకిడి మండలంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించి, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని సిపిఐ నాయకులు వర్కొల్ రాకేష్ కోరారు. ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఒక వినతిపత్రం సమర్పించారు. వాంకిడి ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో గిరిజన, గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల విద్యార్థులు ప్రతిరోజూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రధాన రహదారి నుంచి కళాశాల వరకు సరైన రహదారి లేకపోవడంతో వర్షాకాలంలో బురద, గుంతల కారణంగా విద్యార్థులు, అధ్యాపకులు కళాశాలకు చేరుకోవడం చాలా కష్టంగా మారిందని వివరించారు. వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు వంటి సేవల వాహనాలు కూడా కళాశాల వరకు చేరుకోవడం ఇబ్బందిగా ఉంటోందని పేర్కొన్నారు. కళాశాలలో స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, భద్రత కోసం ప్రహరీ గోడ, రాత్రి వేళల్లో విద్యార్థుల రాకపోకలకు అవసరమైన వీధి దీపాలు, తగిన ఫర్నిచర్, నిరంతర విద్యుత్ సరఫరా, ఆధునిక తరగతి గదులు వంటి ప్రాథమిక సౌకర్యాలు తగిన స్థాయిలో లేవని తెలిపారు. ఈ సమస్యల కారణంగా విద్యార్థులు చదువుపై పూర్తిగా దృష్టి సారించలేకపోతున్నారని, విద్యా ప్రమాణాలు కూడా దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాలంటే ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలను అన్ని విధాలుగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కళాశాలకు తక్షణమే సిసి రహదారి నిర్మాణం చేపట్టడంతో పాటు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ప్రహరీ గోడ, వీధి దీపాలు, ఫర్నిచర్, విద్యుత్ సదుపాయాలు, తరగతి గదుల అభివృద్ధి తదితర అన్ని మౌలిక వసతులను కల్పించాలని మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. విద్యార్థుల సంక్షేమం, గిరిజన ప్రాంతాల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, వాంకిడి ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలి

### అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య



**ప్రజాపక్షం/మంచిర్యాల :** యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్–2026 ప్రవేశ పరీక్షలను పూర్తి పారదర్శకతతో, ప్రశాంత వాతావరణంలో నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య ఆదేశించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన ప్రవేశ పరీక్షా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పరీక్షా గదులు, హాజరు నమోదు, ప్రశ్నాపత్రాల పంపిణీ, ఇన్విజిలేషన్ విధానం తదితర అంశాలను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినులకు త్రాగునీరు, విద్యుత్, పరిశుభ్రతతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అభ్యర్థులకు ప్రశాంతమైన పరీక్షా వాతావరణం కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం తాండూరు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన ప్రవేశ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి ఏర్పాట్లను తనిఖీ చేశారు. పరీక్షల పారదర్శకతను కాపాడుతూ అన్ని నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, అభ్యర్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. నెన్నెల మండలంలోని నెన్నెల, ఆవడం, గంగారం గ్రామపంచాయతీలలో కొనసాగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాలలో మండల పంచాయతీ అధికారి, డిప్యూటీ తహసీల్దార్, గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శి, మండల తహసిల్దార్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేసిన కేంద్రం


### ఎఐకెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి




**ప్రజాపక్షం/భైంసా :** భైంసా మండలం హంపోలి కే గ్రామంలో జరిగాయి. సంఘం జిల్లా అధ్యక్షు లు కే సర్దార్ జెండావిష్కరణ చేసి, అధ్యకత వహించగా,సభలను రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి ప్రారంభించారు. రైతాంగం, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, సాగు ఖర్చులు పెరగడం, పంటలకు గిట్టుబాటు మద్దతు ధరలు లేకపోవడం, రుణభారం పెరగడం వల్ల రైతులు సంక్షోభంలోకి నెట్టబడ్డారని అన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి, కనీస వేతనాలు, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.రైతు పంటలకు చట్టబద్ధమైన గిట్టుబాటు మద్దతు ధర సాధన కోసం పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ విధానాలు రైతాంగానికి అనుకూలంగా లేవని, రైతు వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని కోరారు.ఎఐకెఎమ్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న పాల్గొని మాట్లాడుతూ, రైతులు–కూలీల హక్కుల సాధనకు ఐక్య పోరాటాలే మార్గమని పిలుపునిచ్చారు. రైతులకు ఇచ్చిన హామీలను రేవంత్ ప్రభుత్వం విస్మరించ్చిందని విమర్శించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జే రాజు కార్యదర్శి నివేదికను ప్రవేశ పెట్టారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియుజిల్లా ప్రధాన కార్యదర్శి ఎం హరిత,అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఎల్ ఆర్ ఉపాలి, దీనజీ, బాబు, సాయినాథ్,కేశవ్, గణపతి,రాజేష్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

## పేరుకే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్

### పేద విద్యార్థుల భవిష్యత్తుతో సర్కార్ ఆటలు!




**ప్రజాపక్షం/నిర్మల్ :** పేద, అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే సత్సంకల్పంతో ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (బిఎఎస్ఎస్) పథకాన్ని తీసుకువచ్చింది. కానీ, ప్రస్తుతం ఈ పథకం అమలు తీరు చూస్తుంటే ప్రభుత్వానికి పేద పిల్లల చదువుపై ఎంతటి నిర్లక్ష్యం ఉందో స్పష్టమవుతోంది. "పేరుకే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్.. కానీ క్షేత్రస్థాయిలో కనీస వసతులు లేవు" అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా సంఘాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రూ. 5 కోట్ల బకాయిలు.. కూలుతున్న విద్యా వ్యవస్థ :**

విద్యా హక్కు చట్టం (ఆర్‌టిఇ) నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాలలోనూ పేద విద్యార్థుల కోసం 25 శాతం రిజర్వేషన్ కల్పించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద ఎంపికైన విద్యార్థులకు అయ్యే ఫీజులు, పాఠ్యపుస్తకాలు, యూనిఫారమ్స్ ఖర్చులను ప్రభుత్వమే భరించాలి. అయితే, గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం ఈ ఫీజుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తోంది. మూడేళ్లలో కేవలం 20 శాతం పెండింగ్ బిల్లులను మాత్రమే విడుదల చేసి, మిగతా భారాన్ని పాఠశాలలపైనే వదిలేసింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ. 5 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు పేరుకుపోవడంతో, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి.నిధులు రాకపోవడంతో పాఠశాలల నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. బడులు తెరిచి రోజులు గడుస్తున్నా విద్యార్థులకు కనీస విద్యా సామాగ్రి అందకపోవడం వల్ల వారి చదువుపై తీవ్ర ప్రభావం పడుతోంది.

**కనీస వసతులు కరవు.. విద్యార్థుల జీవితాలతో ఆటలా..**

ప్రభుత్వం జిల్లా కేంద్రంలో కేటాయించిన పలు బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కూడా లేకపోవడం గమనార్హం. తాగునీరు, నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన శౌచాలయాలు, నివాస యోగ్యమైన వసతి గృహాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ. 5 కోట్ల భారీ బకాయిల వల్ల స్కూళ్లు కనీస వసతులు కల్పించలేని స్థితికి చేరుకున్నాయి. వసతులు లేని ఇటువంటి స్కూళ్లను మార్చాలి. అక్కడ పిల్లలను ఉంచడం వల్ల వారి చదువు నిర్వీర్యమవడమే కాకుండా, ఆరోగ్యం కూడా పాడవుతుంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల పేద విద్యార్థుల జీవితాలు, వారి భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతున్నాయి" అని తల్లిదండ్రుల సమావేశంలో ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఉన్నతాధికారులు తనిఖీలు చేయాలి,కార్పొరేట్ పాఠశాలలు కేటాయించాలి !**

ఈ విద్యా సంక్షోభం నేపథ్యంలో ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. వెంటనే విద్యాశాఖ ఉన్నతాధికారులు రంగంలోకి దిగి, ప్రస్తుతం పథకం కింద ఉన్న పాఠశాలలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వసతులు లేని స్కూళ్ల నుండి విద్యార్థులను తక్షణమే మార్చి, అన్ని రకాల మౌలిక సదుపాయాలు,ఉత్తమ విద్యా ప్రమాణాలు కలిగిన ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించాలని కోరుతున్నారు.ప్రభుత్వం ఇప్పటికైనా నిద్ర మత్తు వీడి, తక్షణమే రూ. 5 కోట్ల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, ఈ విద్యా సంవత్సరానికి ఇంకా అడ్మిషన్లు పొందని అర్హులైన విద్యార్థులందరికీ నాణ్యమైన కార్పొరేట్ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించి పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని ప్రజా సంఘాలు, తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు.

‘ హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా కలర్ ఫొటో, బేబి వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్ లో రూపొందుతున్న సినిమా చెన్నై లవ్ స్టోరీ. ’

రీల్



## 24న ‘చెన్నై లవ్ స్టోరీ’ విడుదల

హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా కలర్ ఫొటో, బేబి వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్ లో రూపొందుతున్న సినిమా చెన్నై లవ్ స్టోరీ. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కెఎన్. సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ ‘చెన్నై లవ్ స్టోరీ‘ సినిమాకు బ్లాక్‌బస్టర్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ నెల 24న వరల్డ్ వైడ్ థియేట్రికల్ రిలీజ్ కు ‘చెన్నై లవ్ స్టోరీ‘ మూవీ రెడీ అవుతోంది.మెలొడి బ్రహ్మ మణిశర్మ పుట్టినరోజు వేడుకల్ని ‘చెన్నై లవ్ స్టోరీ‘ టీమ్ ఘనంగా నిర్వహించారు. హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ, నిర్మాతలు ఎస్ కేఎన్, సాయి రాజేష్, సహ నిర్మాత ధీరజ్ మొగిలినేని, డైరెక్టర్ రవి నంబూరి పాల్గొన్నారు. కేక్ కట్ చేసి మణిశర్మకు బర్త్ డే విశెస్ తెలిపారు. ఈ సినిమాకు మణిశర్మ కంపోజ్ చేసిన 'తొలి ప్రేమేం తోపు కాదే..', 'వదలనే..','జిగితార..', 'హొయిలా హొయిలా' పాటలన్నీ ఛాట్ బస్టర్స్ గా మ్యూజిక్ లవర్స్ ను అలరిస్తున్నాయి.ఈ చిత్రానికి ఆర్ట్ భాస్కర్ ముదావత్, ఎడిటర్ సంతోష్ నాయుడు, డీవోపీ విశ్వాస్ డేనియల్, పాటలు అనంత్ శ్రీరామ్, విశాల దాట్ల, లైన్ ప్రొడ్యూసర్ శ్యామ్ ప్రసాద్ మేక.

## ‘హ్యాపీ జర్నీ’ నుంచి ‘ఆనందమే’ పాట రిలీజ్



రొటీన్ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, మహిళల భావోద్వేగాలను ప్రధానంగా తీసుకుని రూపొందుతున్న చిత్రం ‘హ్యాపీ జర్నీ’. ఏడు మంది మహిళల జీవితాల చుట్టూ తిరిగే ఈ కథలో అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జినీషా అలిశెట్టి, రూపా శ్రీనివాస్, సునైనా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పృథ్వీ దండమూడి, వంశీ, రవి శివ తేజ పైల కీలక సహాయ పాత్రలను పోషించారు. గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్లపై బాలాజీ గుత్తా, కౌశిక్ రెడ్డి నిర్మిస్తున్న ‘హ్యాపీ జర్నీ’ చిత్రంతో అభిరామ్ నాయుడు దర్శకుడిగా పరిచయం అవుతుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు ‘ఆనందమే’ ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసి, మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ప్రారంభించింది. ఈ పాట పూర్తిగా పాజిటివ్ ఎనర్జీ, ఫీల్‌గుడ్ వైబ్‌తో సాగుతుంది. వేర్వేరు వయసుల వారు కలిసి పారిస్ ట్రిప్‌లో ప్రతీ క్షణాన్ని ఎలా ఆస్వాదిస్తున్నారో ఈ పాటలో అందంగా చూపించారు. శేఖర్ చంద్ర అందించిన స్వరాలు ఉత్సాహాన్ని నింపేలా ఉన్నాయి. సురేష్ బానిసెట్టి రాసిన సాహిత్యం బంధాల నుంచి బయటపడి స్వేచ్ఛగా ఎగిరే పక్షులతో మనసులోని ఆనందాన్ని పోలుస్తూ ఎంతో అందంగా సాగింది. సత్య యామిని తన ఎనర్జిటిక్ వోకల్స్‌తో పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు.విజువల్‌గా కూడా ఈ పాట ఎంతో ఆకట్టుకుంటుంది. పారిస్ వీధులు, అందమైన లొకేషన్లు, పాటు హృదయానికి దగ్గరైన భావోద్వేగాలను కూడా అందించబోతోంది. ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందిస్తుండగా, మణికందన్ సుబ్రమణియన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. చోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా, బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. చిత్రానికి సహ నిర్మాత: తరుణ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శైలేంద్ర కుమార్, డిఒపి : మణికందన్ సుబ్రమణియన్, ఎడిటర్: ఛోటా కె ప్రసాద్

## రూ.100 కోట్ల క్లబ్‌లో సమంత




లేడీ ఓరియెంటెడ్ ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కిన ‘మా ఇంటి బంగారం’ సినిమా ఇప్పుడు రూ.వంద కోట్ల క్లబ్ లో చేరిపోయింది. సమంత ప్రధాన పాటలో నటించిన ఈ సినిమా వంద కోట్లు వసూల్ చేసింది. నందిని రెడ్డి దర్శకత్వంలో ఈ సినిమాను తెరకెక్కించారు. రాజ్ నిడుమోరు, హిమాంక్ దువ్వూరు కలసి ఈ సినిమాను నిర్మించారు. యాంకర్ శ్రీముఖి, గుల్షన్ దేవయ్య, చైతన్య కృష్ణ, మంజూష ప్రధాన పాత్రలు పోషించారు. జూన్ 19వ తేదీన థియేటర్లలో విడుదలైన ఈ సినిమా విజయవంతగా నడుస్తోంది. ఈ నేపథ్యంలో వంద కోట్లు సంపాదించిన నేపథ్యంలో సమంత వంద కోట్ల పోస్టర్ ను విడుదల చేశారు. ఈ పోస్టర్ కు సంబంధిన ఒక వీడియోను కూడా సమంత రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సమంత ఆశ్చర్యంతో కూడిన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## ‘చోర శిఖామణులు’ షూటింగ్ షురూ



శ్రీకరివివాన్ సమర్పణలో శ్రీకరి క్రియేషన్స్ బ్యానర్ మీద బానూరు నాగరాజు నిర్మిస్తున్న చిత్రం ‘చోర శికామణులు’. ఆనంద్ కుర్మా ఈ మూవీకి కథ, కథనం, మాటలు అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. యాక్షన్, క్రైమ్, కామెడీ జానర్లో రానున్న ఈ మూవీలో రామ్ తేజ్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్, నరేష్, అజయ్ ఘోష్, సంపూర్ణేష్ బాబు, మురళీధర్ గౌడ్, అప్పు, కరణ్, జబర్దస్త్ సత్య శ్రీ తదితరులు ముఖ్య పాత్రలను పోషించనున్నారు. చోర శికామణులు’ చిత్ర ప్రారంభోత్సవం, పూజా కార్యక్రమాలకు త్రినాథరావు నక్కిన, దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ముహూర్తపు సన్నివేశానికి దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్, త్రినాథ రావు నక్కిన స్క్రిప్ట్ అందించగా.. తొలి సన్నివేశానికి త్రినాథరావు నక్కిన గౌరవ దర్శకత్వం వహించారు. ఈ మూవీకి ఆనంద్ రాజావిక్రమ్ సంగీత దర్శకుడిగా, జగదీష్ కొమరి కెమెరా మెన్గా, యాక్షన్ కొరియోగ్రఫీ బాధ్యతలను డ్రాగన్ ప్రకాష్ నిర్వహించనున్నారు. జూలై 25 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మంచి సాంగ్తో ఈ మూవీ షూటింగ్ ప్రారంభం కానుందని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి సమర్పణ శ్రీకరివివాన్ బ్యానర్ శ్రీకరి క్రియేషన్స్, నిర్మాత బానూరు నాగరాజు, సంగీత దర్శకుడు ఆనంద్ రాజవిక్రమ్ ఎడిటర్ శ్రీకాంత్ (కేజీఎఫ్), ఫైట్స్ డ్రాగన్ ప్రకాష్.

## ‘ఏపీ సీఎం లక్ష్మి ప్రణతి’ పాత్రలో రమ్యకృష్ణ




ప్రముఖ సోషల్ మీడియా ఇనుఫ్లుమెన్సర్ యామినీ ఈఆర్ ను హీరోయిన్ గా పరిచయం చేస్తూ డైరెక్టర్ రతన్ రిషి ‘క్వీన్‘ మూవీని రూపొందిస్తున్నారు. ఈ సినిమాను వన్ సర్కిల్ ఫిలింస్ బ్యానర్ నిర్మిస్తోంది. ఈ చిత్రంలో కాళకేయ ప్రభాకర్, అజయ్ ఘోష్ విలన్స్ గా నటిస్తున్నారు. డైలాగ్ కింగ్ సాయికుమార్ హీరోయిన్ తండ్రి పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఒక ఇంపార్టెంట్ అనౌన్స్ మెంట్ చేశారు. ‘క్వీన్‘ చిత్రంలో ఒక పవర్ ఫుల్, స్ట్రాంగ్ క్యారెక్టర్ లో ప్రముఖ నటి రమ్యకృష్ణ నటిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి లక్ష్మి ప్రణతి పాత్రలో రమ్యకృష్ణ తన నటనా ప్రతిభతో ప్రేక్షకుల్ని ఆకట్టుకోబోతున్నారు. ‘క్వీన్‘ చిత్రాన్ని వాస్తవ ఘటనల ఆధారంగా, రియల్ క్యారెక్టర్స్ ను స్ఫూర్తిగా తీసుకుని ఫిక్షనల్ స్టోరీతో దర్శకుడు రతన్ రిషి రూపొందిస్తున్నారు. 2006–2010 మధ్య కాలం నేపథ్యంగా ఈ చిత్ర కథ సాగనుంది. ప్రస్తుత సొసైటీ తో ముడిపడి ఉన్న ఒక ఇంట్రెస్టింగ్ లవ్ స్టోరీని ఈ చిత్రంలో ప్రేక్షకులు చూడబోతున్నారు. ‘క్వీన్‘ సినిమా ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది.యామినీ కాళకేయ ప్రభాకర్, డీవోపీ బాల ఎన్ సరస్వతి ( సరస్ ), మ్యూజిక్ భరత్. ఎం, ఎడిటింగ్ ఆర్ ఎం విశ్వనాథ్ కుచనాపల్లి.

## మంగ పాత్ర నా మనసుకు చాలా దగ్గరగా ఉంటుంది: హీరోయిన్ రాషా తడానీ



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని అజయ్ భుపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానిని కూడా ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు. ఈ చిత్రం జూలై 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ రాషా తడాని మీడియా తో చిట్ చాట్ నిర్వహించారు. గత ఏడాది జూలైలో ఈ కథ విన్నాను.ఆ ఎమోషన్ను నేను కూడా ఫీల్ అయ్యాను. ఇది చాలా అద్భుతమైన కథ. ఈ సినిమా కోసం దర్శకుడు అజయ్ భూపతి ప్రతి డైలాగ్, అందులోని ఎమోషన్ను దగ్గరుండి నేర్పించారు. ప్రతీ విషయంలో చాలా కేర్ తీసుకున్నారు. నాకు తెలుగు తెలియదు. మొదట్లో డైలాగులు అర్థం చేసుకోవడానికి కాస్త కష్టపడ్డాను. కానీ దర్శకుడు అజయ్ భూపతి గారు నాకు చాలా హెల్ప్ చేశారు. తెలుగు, హిందీ కలిపి డైలాగుల అర్థం చెప్పేవారు. ఆయన వల్ల నా పని చాలా ఈజీ అయింది. పూర్తిగా ప్రిపేర్ అయిన తర్వాతే షూటింగ్ చేసేవాళ్లం. కావాల్సిన టైమ్ ఇచ్చేవారు. వైజయంతి మూవీస్ చాలా ప్రతిష్టాత్మకమైన సంస్థ. ఆ సంస్థ నుంచి మహేష్ బాబుతో పాటు ఎంతో మంది స్టార్స్ పరిచయం అయ్యారు. నా జీవితంలో కలిసిన బెస్ట్ పర్సన్లలో అశ్వినీ దత్ ఒకరు. ఆయన నన్ను ఎప్పుడూ మనవరాలిలా చూసుకునేవారు. ఏది కావాలన్నా అడగమని చెప్పేవారు. తెలుగు సినిమా ఇండస్ట్రీలో చాలా ఆరోగ్యకరమైన, ఆనందకరమైన వాతావరణం ఉంటుందని చెప్పారు. శ్రీనివాస మంగాపురం లాంటి మంచి సినిమాతో తెలుగులో పరిచయం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను.అజయ్ భూపతి ఆర్ఎక్స్ 100 చూసినప్పుడు నేను చాలా ఇంప్రెస్ అయ్యాను. అలాగే మంగళ వారం కూడా చాలా ప్రత్యేకమైన సినిమా. శ్రీనివాస మంగాపురం కూడా అద్భుతంగా వచ్చింది. దేవుడు, ప్రేక్షకుల ఆశీస్సులతో ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

## ఆర్‌సి పురంలో మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభం

### ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన సినీ నటి రాశీ ఖన్నా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 2012లో తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో ప్రారంభమైన మాంగళ్య షాపింగ్ మాల్, వస్త్ర వ్యాపార రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ వేగంగా విస్తరిస్తోంది. నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందిస్తూ ప్రజల ఆదరణను పొందిన మాంగళ్య, ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో తన ఉనికిని చాటింది. ఈ క్రమంలో ఆర్ సి పురంలో ఆదివారం తన 31వ శాఖను ఘనంగా ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి రాశి ఖన్నా ముఖ్య అతిథిగా హాజరై, దీప ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి, అభిమానులతో సంతోషంగా మమేకమయ్యారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అభిమానులు తరలి వచ్చి ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు.రిబ్బన్ కటింగ్ అనంతరం నటి రాశి ఖన్నా మాట్లాడుతూ ఆర్ సి పురం ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌కు మంచి ఆదరణ అందిస్తారని నమ్మకం ఉందని, వారి ఆశీర్వాదాలతో ఈ మాల్ మరింత విజయవంత మవుతుంది” అని అన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు పుల్లూరు నరసింహ మూర్తి, కాసం నమశివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ“ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందించడమే తమ విజయ రహస్యం” అని తెలిపారు.“మా స్వంత హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఆధునిక మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా డిజైన్ చేసి, వస్త్ర వ్యాపారంలో ముందంజలో కొనసాగుతున్నాం” అని పేర్కొన్నారు .మాంగళ్య షాపింగ్ మాల్‌లో మహిళలు, పురుషులు, యువత, పిల్లల కోసం తాజా ఫ్యాషన్ కలెక్షన్స్, అలాగే వివాహాలు, శుభకార్యాలకు ప్రత్యేకమైన భారీ వెడ్డింగ్ కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయని, ఈ మాల్ ప్రారంభంతో ఆర్ సి పురం ప్రజలు ఇకపై పెళ్లి షాపింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ ప్రాంతంలోనే నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు కొనుగోలు చేయవచ్చునని తెలిపారు. రూ.99 నుంచి ప్రారంభమై రూ.1 లక్ష వరకు ధరల శ్రేణిలో వస్త్రాలు అందుబాటులో ఉండటంతో పాటు, మాంగళ్య ఒక సంపూర్ణ ఫ్యామిలీ షాపింగ్ మాల్ గా ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు. ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న మాంగళ్య షాపింగ్ మాల్, రాబోయే రోజుల్లో ఈ మూడు రాష్ట్రాల్లోనే 10 కొత్త ప్రాజెక్టులు ప్రారంభించనుండగా, భవిష్యత్తులో తమిళనాడు రాష్ట్రానికి కూ డా విస్తరించనున్నట్లు డైరెక్టర్లు తెలిపారు.దేశ వ్యాప్తంగా వినియోగదారుల విశ్వాసాన్ని పొందిన మాంగళ్య షాపింగ్ మాల్, పాన్ ఇండియా స్థాయిలో నంబర్ వన్ షాపింగ్ మాల్‌గా నిలుస్తోందన్నారు.

ఆర్ సి పురం ప్రజలు తమ తమ శుభ కార్యక్రమం ఏది ఉన్న ఒకసారి మాంగళ్య షాపింగ్ మాల్ కు స కుటుంబ సపరివారంగా విచ్చేసి ఒక నూతన షాపింగ్ ఒరవడి సృష్టించాలని డైరెక్టర్స్ కోరారు.

## వయనాడ్ కొండ చరియల విపత్తు మృత దేహం లభ్యం..

**వయనాడ్ (కేరళ):** కేరళలోని వయనాడ్ కల్లాడి టన్నెల్ ప్రాజెక్ట్ సమీపంలో జూలై 7న సంభవించిన భారీ కొండచరియల విరిగిపాటు ఘటనలో ఐదు రోజులుగా గల్లంతైన ప్రాజెక్ట్ కన్‌స్ట్రక్షన్ మేనేజర్‌గా విక్రమ్ రాణా (58) మృతదేహం ఆదివారం ఉదయం లభ్యమైంది. హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాకు చెందిన ఆయన మృతదేహాన్ని మీనాక్షి వంతెనకు దిగువన దాదాపు 350 మీటర్ల దూరంలో ఇనుప వ్యర్థాలు పేరుకుపోయిన చోట రెస్క్యూ బృందాలు కనుగొన్నాయి; దీనితో ఈ ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య ఎనిమిదికి చేరింది. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్ ఇఆర్ఎఫ్), స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ ఒజి), అగ్నిమాపక, అటవీ శాఖల సిబ్బందితో పాటు యువజన సంఘాలు సంయుక్తంగా చేపట్టిన ఈ ముమ్మర గాలింపు చర్యలను కేరళ వ్యవసాయ శాఖ మంత్రి టి. సిద్ధిఖీ, రాష్ట్ర పోలీస్ చీఫ్ రవాడ ఎ. చంద్రశేఖర్ స్వయంగా సమీక్షించారు. సీసీటీవీ ఫుటేజ్, కార్మికుల సమాచారం ఆధారంగా నది పొడవునా ప్రత్యేక రంగాలుగా తెలిపింది.

## జల జగడాలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

మాధుర్యం తెలుస్తుందని, మనిషి మనుగడ కోసమే పుట్టిన సిద్ధాంతం కమ్యూనిజం అన్నారు. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ ఎర్రజెండా పోరాట ఛాయలు ఉంటాయని దోపిడీ రహిత పేదల రాజ్యం స్థాపించడమే ఎర్ర జెండా లక్ష్యమన్నారు. దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభం దిశగా పయనిస్తుందని దాన్ని దాచి పెట్టేందుకు నరేంద్ర మోదీ పొదుపు మంత్రం పట్టిస్తున్నారని, హిందుత్వ ఎజెండాతో ఓట్ల లబ్ధి పొందేందుకు, రాజ్యాంగ వ్యవస్థను తుంగలో తొక్కినందుకు రాజ్యాంగ పీఠికకు బిజెపి ఉరి తాళ్లు పేనుతోందన్నారు. దేశ సంపద కొందరి చేతుల్లో కేంద్రీకృతమయ్యే విధానాలను అనుసరిస్తుందని, పేదల సంక్షేమ పథకాలను ఉచితాల పేరుతో ఎత్తివేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తుందని, అలాంటప్పుడు కార్పొరేటర్లకు బహుళ జాతీ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. ఉచిత పథకాలపై విష ప్రచారం చేస్తున్న కేంద్రం, కంపెనీలకు ఇస్తున్న లక్షల కోట్ల రాయితీపై ఎందుకు ప్రచారం చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి ఇండ్ల పట్టాలు ఇవ్వాలని, పేదల గుడిసెలను కూలిస్తే పాలకుల గుండెల్లో గుణపాలు దిగుతాయని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పార్టీ శ్రేణులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 9 నుండి 16 వరకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహిస్తున్నామని సెప్టెంబర్ 1న కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఢిల్లీలో భారీ ప్రజా ప్రదర్శన నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలన్నారు. సిపిఐ నేత జితేందర్‌రెడ్డి, భారత కమ్యూనిస్టు పార్టీ విప్లవోద్యమ చరిత్ర అంశంపై తరగతులు బోధించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నరసింహ, రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య, కేశవులు గౌడ్, సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి విజయరాములు, నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి గద్వాల జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు, నారాయణపేట జిల్లా కార్యదర్శి నరసింహులు, వివిధ జిల్లాల నాయకులు రమేష్, సురేష్, శ్రీరామ్ , మోష శ్రీహరి, గోపాలకృష్ణ, రాబర్ట్ భాస్కర్, అబ్రహం, డంగు కుర్మయ్య, రవీందర్, వంక గోపాల్, కాకం బాలస్వామి, కృష్ణవేణి, గీత, శ్యామల, చెన్నమ్మ, లావణ్య, కురుమ లక్ష్మి , శ్రీ విద్యా పద్మావతి, భార్గవి, ఇందిరా, సంతోష్, శ్రీను, దేవానంద్, పెంటయ్య, లక్ష్మీ పతి, నరసింహ శెట్టి, లక్ష్మీ నారాయణ శెట్టి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సందర్శకుల సందడి

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ కరీంనగర్,పక్క రాష్ట్రమైన చత్తీస్గడ్ నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. ఆదివారం సెలవు దినం కావడంతో జలపాతం వద్ద పర్యాటకులు కుటుంబ సభ్యులు, యువత, చిన్నారులు ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ఫోటోలు, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. చల్లని వాతావరణం, పచ్చని ప్రకృతి, జలపాతం నుంచి జాలువారుతున్న నీటి అందాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అయితే జలపాతం వద్ద పర్యాటకులు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా, హెచ్చరిక బోర్డులను గౌరవిస్తూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా పరిశుభ్రతను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. వర్షాకాలంలో బొగత జలపాతం మరింత అందంగా మారడంతో రానున్న రోజుల్లో సందర్శకుల రద్దీ ఇంకా పెరిగే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

## గుర్తింపు ఇవ్వండి..

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలోనే తెలంగాణ రాజ్య సమితి, తెలంగాణ రక్షణ సమితి పేర్లతో రెండు పార్టీలకు గుర్తింపునిచ్చారని, వాటికి లేని అభ్యంతరాలు తెలంగాణ రక్షణ సేనపై ఎందుకు అని ప్రశ్నించారు. ఈ మేరకు తెలంగాణ రక్షణ సేన ప్రధాన కార్యదర్శి హోదాలో అనిల్ కుమార్ ఆదివారం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌కు లేఖ రాశారు. కేవలం సాధారణ భౌగోళిక వర్ణనాత్మక ఉనికిని బట్టి, ఊహాజనిత సంక్షిప్త రూపాల ఆధారంగా వచ్చిన అభ్యంతరాలన్నింటినీ తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. చట్టప్రకారం నిష్పాక్షికమైన, హేతుబద్ధమైన పూర్తి కారణాలతో కూడిన స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. రాష్ట్ర జనాభా మూడున్నర కోట్లు అని.. వెయ్యి అభ్యంతరాలు వచ్చాయనే సంఖ్యను చూపిస్తూ ఈసీ నిర్ణయం సరికాదన్నారు. అసలు అభ్యంతరాల వెనుక లీగల్ మెరిట్ ఏమిటనేది కూడా పరిశీలించాలని, ఎవరైనా కావాలనే గ్రూపులుగా ఏర్పడి, ప్లాన్ ప్రకారమే ఇదంతా చేయించారా? అనేది కూడా తమకు అబ్జెక్షన్ కాపీలు ఇస్తేనే తెలుస్తుందని పేర్కొన్నారు. ఈసీ ఆమోదించిన పేరును నమ్ముకుని తాము సంస్థాగతంగా పార్టీ బలోపేతం చేసుకున్నామని, ఇప్పుడు ఆ పేరును మార్చుకోవాలంటే అది తమకు తీవ్ర నష్టమని, అన్యాయం అవుతుందన్నారు.

‘తెలంగాణ రక్షణ సేన‘ పార్టీ పేరుపై వచ్చిన అన్ని అభ్యంతరాల కాపీలను, అలాగే తమకు వ్యతిరేకంగా ఉపయోగించాలనుకుంటున్న అన్ని ఆధారాలను తమకు అందజేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సమాధానం ఇవ్వడానికి తమకు తగినంత సమయం ఇచ్చిన తర్వాతనే వ్యక్తిగత విచారణకు పిలవాలని విజ్ఞప్తి చేశారు.

## తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశాలు జారీ చేసింది. గత ఏడాది జూన్‌లో విడుదల చేసిన బిహార్ సర్‌లో ఈ ప్రకటనను చేర్చారు. కొత్త ఓటర్లు ఫారం 6తో పాటు ఈ ప్రకటనను కూడా దాఖలు చేయాల్సి ఉండేది. బిహార్ రోజువారీ సర్ బులెటిన్‌లలో ప్రకటనలతో పాటు నింపిన ఫారం కూడా చూపనట్లు ఇసి అధికారి తెలిపారు. ఈ ప్రకటనను ఆదేశాల ద్వారా చేర్చారని, ఫారం 6లో ఎలాంటి మార్పులు చేయలేదన్నారు. ‘ఇది ఓటర్లను గుర్తించడంలో సహాయపడుతుంది. కొత్త ఓటర్లు దరఖాస్తుతో పాటు సమర్పించాల్సిన పత్రాలను తగ్గిస్తుంది‘ అని ఆ అధికారి తెలిపారు. ఒక వ్యక్తి ఆన్‌లైన్‌లో ఫారం 6 నింపితే, ఆ ప్రకటనను నింపే వరకు వారు ముందుకు వెళ్లలేరు. మరోవైపు, ఎన్నికల అథారిటీ ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)ను సమర్థించుకుంది. ఐక్యరాజ్యసమితి ప్రతినిధులు లేవనెత్తిన ఆందోళనలను తోసిపుచ్చుతూ, ఈ ప్రక్రియ పారదర్శకంగా, రాజ్యాంగబద్ధంగా ఉందని, సుప్రీంకోర్టు ఆమోదం పొందిందని స్పష్టం చేసింది. ఎస్ఐఆర్ ద్వారా అర్హులైన భారత పౌరులందరినీ చేర్చి, నకిలీ, మరణించిన, వేరే ప్రాంతాలకు తరలివెళ్లిన, గైర్హాజరైన, విదేశీ ఓటర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించడమే లక్ష్యమని ఇసి అధికారులు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్‌తో సహా పలు ప్రాంతాల్లో మైనారిటీ ఓటర్లను పెద్ద ఎత్తున తొలగించారన్న ఆరోపణలపై స్పందిస్తూ, తొలగింపులను సవాలు చేసేందుకు ఓటర్లకు తగిన అవకాశాలు కల్పించామని, ఎలాంటి పక్షపాతం లేదని ఇసి అధికారులు ఖండించారు. ప్రభుత్వానికి ఇటీవల రాసిన లేఖలో, ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధులు ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని ఆరోపిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు.

## ‘ఆరోగ్యశ్రీ’పై అసహనం

(మొదటి పేజీ తరువాయి)



చెబుతున్నారు.ఆరోగ్యశ్రీ పరిధిలో చికిత్స పొందుతున్నప్పటికీ, ముందస్తుగా కొంత మొత్తం చెల్లించాల్సిందేనని కొందరు వైద్యశాలల నిర్వాహకులు ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న రోగుల కుటుంబాలు తప్పనిసరి పరిస్థితుల్లో అప్పులు చేసి డబ్బులు సమకూర్చుకోవాల్సి వస్తోంది. చెల్లింపులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకుండా నేరుగా నగదు రూపంలోనే ఇవ్వాలని కోరుతున్నారనే ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

**ప్రభుత్వ వైద్యశాలల్లో ఔషధాల కొరత**

మరోవైపు ప్రభుత్వ వైద్యశాలల్లోనూ అనేక సమస్యలు కనిపిస్తున్నాయి. నిర్మల్ పట్టణంలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రం, ప్రాంతీయ వైద్యశాలలు. ఇతర ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో అవసరమైన ఔషధాలు అందుబాటులో లేకపోవడం రోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. వైద్యులు సూచించిన మందులు ప్రభుత్వ నిల్వల్లో లేకపోవడంతో బయట ఉన్న మందుల దుకాణాల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనివల్ల పేద కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది.ఒక్కో కుటుంబం మందుల కోసమే వందల నుంచి వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఉచిత వైద్య సేవలు అందాల్సిన చోట మందుల కోసం బయటకు వెళ్లాల్సి రావడం ప్రభుత్వ వైద్య వ్యవస్థలోని లోపాలను బహిర్గతం చేస్తోంది.

**ఆకస్మిక తనిఖీలకు ప్రజల డిమాండ్**

ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ అమలు చేస్తున్న సంక్షేమ పథకం నిజమైన లబ్ధిదారులకు చేరాలంటే కఠినమైన పర్యవేక్షణ, నిరంతర తనిఖీలు, పారదర్శక వ్యవస్థ అవసరం. నిర్మల్ జిల్లాలోని అన్ని ఆరోగ్యశ్రీ అనుబంధ వైద్యశాలలపై సమగ్ర పరిశీలన చేపట్టి, నిబంధనలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.అలాగే ప్రభుత్వ వైద్యశాలల్లో అవసరమైన ఔషధాలు, వైద్య పరికరాలు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. నిరుపేదలకు ఉచిత వైద్యం అందించాలనే మహత్తర లక్ష్యంతో రూపొందించిన ఆరోగ్యశ్రీ పథకం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలను వెంటనే సరిదిద్దాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ :**

ఆరోగ్యశ్రీ పథకం అమలులో ఏ ప్రైవేట్ ఆసుపత్రి అయినా అక్రమాలకు పాల్పడితే కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ స్పష్టం చేశారు. రోగులను ఆరోగ్యశ్రీ కింద చేర్చుకున్నాక, టెస్టుల పేరుతో అదనపు బిల్లులు వేసి డబ్బులు వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం నుండి ఆరోగ్యశ్రీ క్లెయిమ్ డబ్బులు మంజూరైన తర్వాత, ఆసుపత్రులు రోగుల నుండి అంతకుముందు తీసుకున్న మొత్తాన్ని తిరిగి ఇవ్వకపోతే అది తీవ్రమైన తప్పు అవుతుందని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడ, ఏ ప్రైవేట్ ఆసుపత్రిలోనైనా ఆరోగ్యశ్రీ నిబంధనల విచారణ జరిపిస్తామని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో తప్పు రుజువైతే సదరు ఆసుపత్రులపై శాఖాపరంగా కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని డీఎంహెచ్ఓ భరోసా ఇచ్చారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com